www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
ఆదివారం 29 జూన్ 2025
సంపుటి :07 సంచిక : 33 , పేజీలు : 12 వెల:రూ. 5/-



## జగన్నాథుని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జూన్ 28:**

## బహుముఖ్ బనారస్ ఓ మంచి పుస్తకం

ఆవిష్కరించి అభినందించిన వెంకయ్యనాయుడు



**హైదరాబాద్,జూన్28( వెలుతురు):** పోలీసు అధికారిగా ఉండి మంచి పుస్తకం రాయడం గొప్ప విషయం అని మాజీ



## పివికి కెసిఆర్ ఘన నివాళి

ఘనంగా నివాళి అర్పించిన పార్టీ నేతలు

**హైదరాబాద్,జూన్28( వెలుతురు):** పీవీ మన తెలంగాణ ఠీవి.. భారతదేశ ఆణిముత్యం..' అని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు అభివర్ణించారు. పీవీ స్ఫూర్తితో ప్రజా సంక్షేమ పాలన కొనసాగించడమే వారికి మనం అర్పించే నివాళి అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి



## పివి జయంతి సందర్భంగా సిఎం తదితరుల నివాళి

ఆర్థిక సంస్కరణల పితామహుడిగా కొనియాడిన రేవంత్

నెక్లెస్ రోడ్డు పివి ఘాట్ వద్ద నివాళి అర్పించిన మంత్రులు

# 2029లో నియోజకవర్గాల పునర్విభజన

### జంటనగరాల దాహార్తిని తీర్చిన ఘనత పిజెఆర్‌దే

### పిజెఆర్ ఇల్లు జనతా గ్యారేజ్ లాగా ఉండేది

### కంచగచ్చిబౌలి భూములను అభివృద్ధి చేస్తాం

### పిజెఆర్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన్28( వెలుతురు):** 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోందని.. శేరిలింగంపల్లి 4 నియోజకవర్గాలుగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంలో పీజేఆర్‌ది కీలకపాత్ర అని కొనియాడారు. పీజేఆర్ కృషి వల్లే హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా జలాలు వచ్చాయని ఉద్ఘాటించారు. శనివారం పీజేఆర్ ఫ్లై ఓవర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి






ప్రారంభించారు. ఆటంకాలను అధిగమించి కంచ గచ్చిబౌలిని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అక్కడి భూముల్లో అభివృద్ధి ఆటంకాలు తాత్కాలికమేనని, కంచ గచ్చిబౌలిలో కొత్త కంపెనీల ఏర్పాటుతో 5 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. కొండాపూర్-గచ్చిబౌలి మార్గంలో 6 లైన్లతో 1.2 కిలోమీటర్ల పై వంతెనను ప్రభుత్వం నిర్మించింది. రూ. 182.72 కోట్ల వ్యయంతో గచ్చీబౌలి నుంచి కొండాపూర్ వరకు వంతెన నిర్మాణం చేపట్టింది. దీంతో గచ్చిబౌలి చౌరస్తా దగ్గర ట్రాఫిక్ సమస్య తగ్గనుంది. దీనిని ప్రారంభించిన అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధి కోసం చాలామంది హైదరాబాద్ వస్తుంటారని తెలిపారు పేదల నాయకుడిగా పీజేఆర్ గొప్పపేరు సంపాదించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ప్రజలు ఎప్పుడు పిలిచినా పలికే నాయకుడు పీజేఆర్ అని

## వైద్యారోగ్య శాఖ పోస్టులకు ఆర్థికశాఖ ఆమోదం

**607 పోస్టులకు భర్తీకి నోటిఫికేషన్**


**ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**



**హైదరాబాద్,జూన్28( వెలుతురు):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి భారీ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 607 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చినట్టు ఇచ్చినట్టు తెలంగాణ మెడికల్

## జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయరు

- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి
- 4న నిరుద్యోగుల చలో సచివాలయానికి బిఆర్ఎస్ మద్దతు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన బిఆర్ఎస్ నేత హరీష్ రావు



**హైదరాబాద్,జూన్28( వెలుతురు):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయకపోవడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని

## నేడు పసుపుబోర్డు కార్యాలయ ప్రారంభం

- అమిత్ షా చేతలు మీదుగా బోర్డుకు శ్రీకారం
- ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత బిజెపిదే
- నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్



**నిజామాబాద్,జూన్28( వెలుతురు):** పసుపుబోర్డు సాధించడం, ఇక్కడే బోర్డు కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం నిజామాబాద్ రైతుల విజయమని ఎంపి ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లో పసుపుబోర్డు కార్యాలయాన్ని హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెలంగాణ రాష్ట్రానికి

## పివికి చంద్రబాబు, లోకేశ్ ఘన నివాళి






### పీవీ తెలుగు ఠీవీ, నిరాడంబర జీవితానికి

## నిలువెత్తు నిదర్శనం

- సొంత భూములు పంచిపెట్టి భూసంస్కరణలను ప్రవేశపెట్టిన మహనీయుడు
- దేశ ఆర్థిక ప్రగతికి పునాది వేసిన రాజనీతిజ్ఞుడు
- పీవీని విస్మరించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు
- పీవీ అంత్యక్రియలు కూడా సరిగా నిర్వహించకుండా అవమానించిన కాంగ్రెస్
- ఎన్నికలప్పుడే పీవీ పేరును వాడుకుని వదిలేసిన బీఆర్ఎస్
- పీవీ విజాన వేదికను నేటికీ ఏర్పాటు చేయకపోవడం శోచనీయం
- బండి సంజయ్ కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి

**కరీంనగర్ వెలుతురు జూన్ 28:** తెలుగు తేజం, గొప్ప రాజనీతిజుడు, భారతరత్న, ప్రధానమంత్రి పదవిని చేపట్టిన ఏకైక తెలుగు వాడైన మన తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు గారి జయంతి సందర్భంగా ఆ మహానుభావుడికి నివాళి అర్పిస్తున్నా. నిరాడంబర జీవితానికి, రాజనీతికి నిలువెత్తు నిదర్శనం స్వర్గీయ పీవీ నరసింహారావు గారు. ఆ మహానుభావుడు దేశానికి చేసిన సేవల గురించి ఈరోజు ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పీవీ నర్సింహారావు గారు రాజకీయవేత్త మాత్రమే కాదు... బహుభాషావేత్త, కవి, రచయిత, జర్నలిస్టు, అనువాదకుడిగా అపార జ్ఞానం సంపాదించిన మహోన్నతుడు పీవీ గారు. తన భూములను పేదలకు పంచి ఉమ్మడి రాష్ట్రంలో భూ సంస్కరణలకు బీజం వేసిన భూదాత. దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో



### మహాన్యూస్ ఛానల్ పై దాడి

## అమానుష చర్య


- దాడి వెనుక ఎంతపెద్దవారున్నా చర్యలు తప్పవని హెచ్చరిక
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:** మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై బిఆర్ ఎస్ మూకల దాడిని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల

## తెలుగు రాష్ట్రాల బిజెపి అధ్యక్షుల ఎన్నిక

- నేడు నోటిఫికేషన్..రేపు నామినేషన్
- జూలై1న అధ్యక్ష ఎన్నిక కార్యక్రమం

**హైదరాబాద్,జూన్28( వెలుతురు):** తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకాలకు ముహూర్తం ఖరారు అయ్యింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఒకే రోజు బీజేపీ అధిష్ఠానం అధ్యక్షులను ప్రకటించనుంది. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. మూడు రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని అధిష్ఠానం నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి, ఎంపీ పాకా సత్యనారాయణ విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి.. ఎన్నికల షెడ్యూల్





ప్రకటించారు. పాకా సత్యనారాయణ మాట్లాడుతూ? 'అంతర్గత ప్రజాస్వామ్యం పాటిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. ఆదివారం అధ్యక్ష ఎన్నిక నోటిఫికేషన్ జారీ అవుతుంది.

## ఇరిగేషన్ శాఖను భ్రష్టు పట్టించిన కెసిఆర్

- ప్రాజెక్టుల నిర్వహణను పట్టించుకోని నాటి పాలకులు
- జూరాల ప్రాజెక్టును సందర్శించిన మంత్రి ఉత్తమ్

**గద్వాల,జూన్28( వెలుతురు):** పదేళ్ల కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ శాఖని భ్రష్టు పట్టించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్ట్‌లకు మాజీ సీఎం కేసీఆర్ మెయింటనెన్స్ చేయలేదని మండిపడ్డారు. శనివారం జూరాల ప్రాజెక్ట్‌ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నేతలు సందర్శించారు. ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లను, 4,8 గేట్స్ ఐరన్ రోప్‌లను పరిశీలించారు. అనంతరం



(మొదటి పేజీ తరువాయి..)

## జగన్నాథుని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

ఆదిలాబాద్ లో ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగన్నాథుని రథయాత్ర వైభవంగా సాగింది. మధుర జిన్నింగ్ ఆవరణలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పూలతో అందంగా అలంకరించిన వాహనంలో ఉంచి శోభాయాత్రను ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు, ముందుగా శోభాయాత్రలో భాగంగా ఎంపీ, ఎమ్మెల్యే రోడ్లను ఉడిచి.. రథాన్ని తాడుతో లాగారు. జగన్నాథుని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాల ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లాలా మున్నా ఆకుల ప్రవీణ్ సంతోష్. అశోక్ రెడ్డి శివ. ముకున్ తదితరులు పాల్గొన్నారు

## పివి జయంతి సందర్భంగా సిఎం తదితరుల నివాళి

**హైదరాబాద్,జూన్28( వెలుతురు):**

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద పలువురు కాంగ్రెస్ నేతలు నివాళి అర్పించారు. భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు సేవలను గుర్తు చేసుకున్నారు. బహుభాషాకోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడంలో పీవీ పాత్ర ఎనలేనిదన్నారు. సీఎంతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేంద్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి.. పీవీకి నివాళులు అర్పించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు జయంతి సందర్భంగా పీవీ ఘాట్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పీవీ దేశంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. ఆర్థిక సంస్కరణల తో భారత దేశాన్ని ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టారని గుర్తుచేశారు. భూ సంస్కరణలతో సమాజంలో సమానత్వానికి కృషి చేశారని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా కాంగ్రెస్ ఇప్పటి వరకు 24 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు పంచిందన్నారు. తెలంగాణలో గత పదేళ్లు పాలించిన ప్రభుత్వం ధరణి తెచ్చి పేదలను ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. పేదల హక్కులను కాపాడడానికి భూభారతి చట్టాన్ని తెచ్చామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యారంగం బలోపేతం పీవీతోనే సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన అనేక సంస్కరణలు తెచ్చారని వివరించారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## పివికి కెసిఆర్ ఘన నివాళి

సందర్భంగా ఆయన దేశాభ్యున్నతికి చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ బిడ్డగా, పాలనాదక్షుడిగా, భారత ప్రధానిగా.. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టి, జాతి ఔన్నత్యాన్ని నిలబెట్టిన గొప్ప వ్యక్తి పీవీ అని ప్రశంసించారు. బహు భాషా కోవిదుడుగా, సాహితీవేత్తగా, రాజకీయ దురంధరుడుగా, దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ప్రసిద్ధిగాంచిన తీరు అజరామరమని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొద్దికాలమే పనిచేసినా ఆయన తెచ్చిన పాలనా సంస్కరణలు ఆదర్శమని కొనియాడారు. వారి కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలనే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకొని 'పీవీని తెలంగాణ ఠీవిగా' ప్రపంచానికి చాటిన ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కిందని తెలిపారు. పీవీ శతజయంత్యుత్సవాలను ఘనంగా జరుపుకోవడమే కా కుండా, భవిష్యత్తు తరాలు ఆయన కృషిని గుర్తుంచుకొని స్ఫూర్తి పొందేవిధంగా నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్‌గా నామకరణం చేశామని గుర్తుచేశారు. పీవీ 16 అడుగుల కాంస్య విగ్రహాన్ని నెలకొల్పామని, పీవీ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఆయన వారసత్వం కొనసాగింపుగా కూతురు సురభి వాణీదేవికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని గుర్తుచేశారు. పీవీకి భారతరత్న పురస్కారం ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని తెలిపారు. పీవీ కృషికి గుర్తింపుగా వంగర, లక్నేపల్లిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడంతోపాటు వరంగల్, కరీంనగర్, వంగర, ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో పీవీ కాంస్య విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. పీవీ గొప్పదనాన్ని స్మరించుకోవడం అంటే తెలంగాణ బిడ్డలు తమ గొప్పదనాన్ని గుర్తుచేసుకోవడమేనని కేసీఆర్ పేర్కొన్నారు.

## బహుముఖ్ బనారస్ ఓ మంచి పుస్తకం

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. కిల్లాడ సత్యనారాయణ రచించిన పుస్తకం 'బహుముఖ బనారస్' ను వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయోధ్య ఆలయ జ్ఞాపికను సత్యనారాయణ ఆయనకు అందించారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ..ఈ పుస్తకం కాశీలోని అనేక పార్శ్వాలను సృశించిందని అన్నారు. మన సంస్కృతిలో స్త్రీలకు గొప్ప ప్రాధాన్యం ఉంది అని చెప్పారు. యువతలో మార్పు రావాలని, సామాజిక, సాంస్కృతిక పునర్ వైభవం సాధించాలని సూచించారు. హిందూ అనేది జీవన విధానం అని సంపద, జనాభా, విజ్ఞానం ఉన్న దేశం మనది అని పేర్కొన్నారు. ఇలాంటి పుస్తకాలు వికసిత భారత్ కు తోడ్పడతాయని ఆశిస్తున్నానని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. ఒక మంచి పుస్తకాన్ని ఆవిష్కరించినందుకు చాలా ఆనందంగా ఉందని నాయుడు అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ డీజీ కిల్లాడ సత్యనారాయణ రాసిన 'బహుముఖ బనారస్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని హోటల్ దస్పల్లలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఈ పుస్తకం కాశీలోని అనేక పార్శ్వాలను స్పృశించిందని చెప్పారు. కాశీ గురించి చెప్పకుండా భారత సంస్కృతి గురించి మాట్లాడలేమని తెలిపారు. పోలీసు అధికారిగా ఉండి కూడా ఇంత మంచి పుస్తకం రాయడం గొప్ప విషయమని కొనియాడారు. 'మన సంస్కృతిలో స్త్రీలకు గొప్ప ప్రాధాన్యం ఉంది. అందుకే దేశంలో నదులన్నీ స్త్రీల పేర్లే. ఈ నేల గొప్పదనం తెలిపే విధంగా నూతన విద్యావిధానం ఉండాలి. ఒక్కో నగరానికి ఒక్కో చరిత్ర ఉంది. అవన్నీ పుస్తకాలుగా రావాల్సిన ఆవశ్యకత ఉంది' అని వెంకయ్యనాయుడు అన్నారు.

## వైద్యారోగ్య శాఖ పోస్టులకు ఆర్థికశాఖ ఆమోదం

అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీజీఎంహెచ్ఎఆర్బీ) సెక్రటరీ గోపీకాంత్‌రెడ్డి తెలిపారు. మల్టీ జోనల్1 లో 379 పోస్టులు, మల్టీ జోనల్2 లో 228పోస్టుల భర్తీకి నియామక పక్రియ జరగనుంది. జూలై 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ పక్రియ ప్రారంభం కానున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ చాన్నాళ్ల తర్వాత భారీ ఉద్యోగ నోటిఫఇకేషన్ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మెడికల్ కళాశాలల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలను ఈ నియామకం కింద భర్తీ చేయనున్నారు. దరఖాస్తు చేసుకునే వారి వయసు 46 ఏళ్ల లోపు ఉండాలి. సంబంధిత విభాగంలో అర్హత కలిగిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేసి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణ పక్రియ జూలై 10వ తేదీ నుంచి ఆరంభమవుతుంది. జూలై 17 సాయంత్రం 5 గంటలలోపు అర్హులైన అభ్యర్థులు అధికారిక వెబ్ సైట్ – లో అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారని గుర్తుంచుకోవాలి. దరఖాస్తు ఫీజు రూ.500 లు కాగా ప్రాసెసింగ్ ఫీజు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. జూలై 18–జూలై 19 వరకూ అప్లికేషన్ ఎడిట్ ఆప్షన్ ద్వారా వివరాలు సరిచేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ పోస్టుకు ఎంపికైన వారికి నెల జీతం రూ.68,900–రూ.2,05,500 మధ్య ఉంటుంది. నోటిఫికేషన్ ద్వారా పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు.

## పివికి చంద్రబాబు, లోకేశ్ ఘన నివాళి

**అమరావతి,జూన్28( వెలుతురు):**

మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు 104వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. పీవీని స్మరించుకున్నారు. ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలను దేశ పరిస్థితిని మార్చేశాయని గుర్తు చేసుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని అంటూ కొనియాడారు. 'భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 104వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా ప్రధాని బాధ్యతలు స్వీకరించి ఆర్థిక సంస్కరణల ద్వారా దేశగతిని మార్చిన పీవీ ఎప్పటికీ స్ఫూర్తిగానే నిలుస్తారు. ఆ మహనీయుడి స్మృతికి మరొక్క మారు నివాళి అర్పిస్తున్నాను' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# 2029లో నియోజకవర్గాల పునర్విభజన

అభివర్ణించారు. గతంలో పీజేఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజ్‌లా కనిపించేదని గుర్తుచేసుకున్నారు. జంటనగరాల్లో 25 ఏళ్లపాటు పీజేఆర్ శకం నడిచిందని గుర్తుచేసుకున్నారు. పీజేఆర్ మంత్రిగా ఉన్నప్పుడే హైటెక్ సిటీకి పునాది పడిందని తెలిపారు. హైటెక్ సిటీని ముందుకు తీసుకెళ్లింది చంద్రబాబే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. భాగ్యనగర అభివృద్ధికి ఎవరూ అడ్డుపడినా ఊరుకునేది లేదని హెచ్చరిచారు. ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధిపైనే తమ దృష్టి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలని కోరారు. అభివృద్ధిలో స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొందరూ అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయం ముసుగులో అవాంతరాలు కల్పిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'హైదరాబాద్‌లో ఆర్టీసీ డీజిల్ బస్సులు ఉండొద్దని నిర్ణయించాం. డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించాలని ఆదేశించాం. హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు ఇస్తున్నామని అన్నారు. ఆటోలు కూడా సిఎన్‌జి ఎలక్ట్రిక్ వెర్షన్‌లోకి మారాలి. హైదరాబాద్ నగరంలో అనేక నాలాలు, చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఆక్రమణలకు గురైన వాటిని హైడ్రా ద్వారా తొలగిస్తున్నాం. ఎన్ కన్వెన్షన్‌లో రెండెకరాలను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించి.. నటుడు నాగార్జున నిజమైన హీరో అనిపించుకున్నారు. రంగారెడ్డి జిల్లాకు శ్రీధర్‌బాబును ఇన్‌చార్జి మంత్రిగా చేశాం. రంగారెడ్డి జిల్లా అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలి. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించడం లేదు. రేపు అమిత్ షా తెలంగాణకు వస్తున్నారు.. మరోసారి కలిసి విజ్ఞప్తి చేస్తాం. రాజకీయాలు వదిలేసి హైదరాబాద్ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం.నేను దాదాపు 35 సార్లు ఢిల్లీ వెళ్లా. ప్రధాని సహా అనేకమంది కేంద్రమంత్రులను కలిశా. కానీ రాష్ట్రానికి కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదు. హైదరాబాద్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏం ఇచ్చారు. ఈ విషయం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆలోచించుకోవాలి. తెలంగాణ ప్రజలు బీజేపీకి 8 మంది ఎంపీలను ఇచ్చారు. కేంద్రం నుంచి బీజేపీ నేతలు ఏం తెచ్చారో చెప్పగలరా' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 3 లేయర్లుగా తెలంగాణను విభజించాలనుకున్నాం. రాబోయే 100 రోజుల్లో కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతాయి. కాలుష్యం కారణంగా నేడు ఢిల్లీలో నివసించలేని పరిస్థితి ఏర్పడింది. దేశ రాజధానిలో నివసించలేని పరిస్థితి వచ్చిందంటే పాలకులు సరైన ప్రణాళిక లేకపోవడమే కారణం. వర్షం వస్తే చెన్నై అతలాకుతలమవుతోంది, బెంగళూరు నగరం ట్రాఫిక్‌లో చిక్కుకుంటోంది. ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నుంచి మనం నేర్చుకోవాలి. హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. డీజిల్ బస్సులను నగరానికి అవతలకు పంపించే చర్యలు చేపట్టాం. నగరంలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తాం.

ఎలక్ట్రిక్ కార్లు, ఆటోలు కొంటున్న వారికి పన్ను లేకుండా చేస్తున్నాం. నాలాలు కబ్జాలకు గురవడం వల్లే నగరంలో ముంపు తీవ్రత పెరిగింది. చెరువుల్లో అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చి వేసింది. వరద నీళ్లు వెళ్లేందుకు చెరువుల్లేకుండా కొందరు కబ్జాలు చేశారు. బతుకమ్మకుంటను భారాస నాయకులు ఆక్రమించుకుంటే.. కబ్జా నుంచి విడిపించాం. హైదరాబాద్‌పై ఒత్తిడి పెరుగుతున్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని చేపట్టాం. 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గం నాలుగు నియోజకవర్గాలుగా మారబోతోంది. అందరికీ అభివృద్ధిలో భాగస్వాములయ్యే అవకాశం వస్తుంది' అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయరు

జూలై 4వ తేదీన ఛలో సచివాలయం సమ్మెకు నిరుద్యోగులు పిలుపునిచ్చారని తెలిపారు. నిరుద్యోగుల ఛలో సచివాలయం సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా హాలో నిరుద్యోగి, ఛలో సెక్రటేరియట్ సమ్మె పోస్టర్‌ని హరీష్‌రావు శనివారం తెలంగాణ భవన్‌లో విడుదల చేశారు. అనంతరం మీడియాతో హరీష్‌రావు మాట్లాడారు. నిరుద్యోగుల ఛలో సచివాలయం సమ్మెకి సీపీఎం పార్టీ మద్దతు ఇచ్చినట్లు నిరుద్యోగులు చెప్పారని పేర్కొన్నారు హరీష్‌రావు. బీఆర్ఎస్ హయాంలో 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కేలా మాజీ సీఎం కేసీఆర్ చొరవ తీసుకున్నారని హరీష్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న జాబ్ క్యాలెండర్‌లో ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయడం లేదని.. నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఇది జాబ్ క్యాలెండర్ కాదు.. జాబ్ లెస్ క్యాలెండర్. ఇది దగా క్యాలెండర్ అని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఏడాదికి లక్ష ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నిరుద్యోగులకు హామీ ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 12 వేల ఉద్యోగాలకు మించి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇందిరమ్మ మనమరాలుగా మాట ఇస్తున్నానని ప్రియాంకాగాంధీ యూత్ డిక్లరేషన్ ఇచ్చారని హరీష్‌రావు గుర్తుచేశారు. యూత్ డిక్లరేషన్‌లో చెప్పిన ఐదు అంశాలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ ఎందుకు నెరవేర్చలేదని హరీష్‌రావు ప్రశ్నించారు. స్కూటీ అంటే తనకు ఇష్టమని చెప్పిన ప్రియాంకాగాంధీ, మహిళ స్టూడెంట్స్‌కి ఇస్తామన్న స్కూటీ ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని నిలదీశారు.

నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రియాంక గాంధీ చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలవుతున్న నిరుద్యోగ భృతి ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. యూత్ డిక్లరేషన్‌లో ఐదు హామీలు ఇచ్చిన ప్రియాంకాగాంధీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు యూత్ డిక్లరేషన్ అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డిపైన ప్రియాంకాగాంధీ ఎందుకు మొట్టికాయలు వేయడం లేదని హరీష్‌రావు నిలదీశారు. ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చిన గాంధీ కుటుంబం నిరుద్యోగ యువతి, యువకులకు హామీలు ఇచ్చి దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. నిరుద్యోగుల పక్షాన మాట్లాడిన ప్రొఫెసర్ కోదండరాం, ఆకూనూరి మురళీ, రియాజ్, ఆఖరికి ప్రియాంక గాంధీకి కూడా ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ రక్తంలోనే ప్రశ్నించే తత్వం ఉంటుందని స్పష్టం చేశారు. నిరుద్యోగులు వారి సమస్యలపై పోరాడాలని.. వారి న్యాయబద్ధమైన పోరాటానికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని మాటిచ్చారు.

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని హరీష్‌రావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీల సాధనకు భారాస అండగా ఉంటుందని తెలిపారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. భారాస పాలనలో 1.62 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వస్తాయని యువత ఎన్నో ఆశలు పెట్టుకుందని.. కానీ ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని దుయ్యబట్టారు. 'దగా క్యాలెండర్‌తో నిరుద్యోగ యువతను మోసం చేశారు. నోటిఫికేషన్లు వద్దని యువత ధర్నాలు చేస్తున్నారని రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటించారు.. 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చేవరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడతాం. కమిషన్లు రావని రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## తెలుగు రాష్ట్రాల బిజెపి అధ్యక్షుల ఎన్నిక

30న ఉదయం 11 నుంచి 1 వరకూ నామినేషన్ స్వీకరణ పక్రియ ఉంటుంది. 30న మధ్యాహ్నం 1 నుంచి 2 వరకూ నామినేషన్ల స్క్రూటిని నిర్వహిస్తారు. సాయంత్రం 4 లోపు ఉపసంహరణకు గడువు. జూలై 1న అధ్యక్ష ప్రకటన, బాధ్యతల స్వీకరణ ఉంటుంది. జాతీయ కౌన్సిల్ పీసీ మోహన్ ఎన్నికల అబ్జర్వర్‌గా ఉంటారని చెప్పారు.అలాగే తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు బీజేపీ పార్టీ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి, కిషన్ రెడ్డిలు తెలుగు రాష్ట్రాలకు అధ్యక్షులుగా ఉన్నారు. నోటిఫికేషన్‌తో భాజపా సంస్థాగత ఎన్నికల పక్రియ తుది దశకు చేరుకుంది. రెండురాష్ట్రాల్లోనూ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు పార్టీ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ నుంచి పలువురు పోటీలో ఉన్నారు. డికె అరుణ, ఈటెల రాజేందర్, రఘునందన్ రావు,రామచంద్రరావులు ప్రధాన పోటీదారులుగా ఉన్నారు.

## ఇరిగేషన్ శాఖను భ్రష్టు పట్టించిన కెసిఆర్

మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కమీషన్లకు కక్కుర్తి పడ్డారని ఆరోపించారు. భారీ వాహనాలను జూరాలపై నడపటం సేఫ్టీ కాదని ఆనాడే అధికారులు నిర్ధారించారని... కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. జూరాల డ్యామ్‌కు అనుసంధానంగా మరో బ్రిడ్జికి రూ. 100 కోట్లు ఇప్పుడే మంజూరు చేస్తున్నామని ప్రకటించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. భారీ వాహనాల వల్ల జూరాల ప్రాజెక్ట్‌కు ప్రమాదం ఉందని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున రూ. 100 కోట్లు మరో బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. పదేళ్ల పాటు కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉండి ప్రాజెక్ట్‌లను పట్టించుకోకపోవడంతోనే దెబ్బతింటున్నాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో పూడికతీత పనులు కూడా చేపట్టలేదని ధ్వజమెత్తారు. జూరాల ప్రాజెక్ట్ పూడికతీత పనులు వెంటనే చేపడతామని స్పష్టం చేశారు. రూ.300 కోట్లతో రెండవ గ్యాంటి క్రెన్ మంజూరు చేస్తున్నామని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. నీటిని ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నింపేలా పనులు చేపడుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 90శాతం పూర్తయినా నె÷-టటెంపాడు పనులను కూడా కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వంలో నె÷-టటెంపాడుకి రూ.2,753 కోట్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. డిసెంబర్ నాటికి వందశాతం పనులు చేసి నె÷-టటెంపాడు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

మక్తల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. ఇరిగేషన్ శాఖలో 1100 మంది ఇంజనీర్లను నియమించామని ప్రకటించారు. ప్రతిపక్షాలు సాగు, నీటి ప్రాజెక్ట్‌లపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. ఇరిగేషన్ శాఖ అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాలు ముందుగా రావడంతో జూరాల ప్రాజెక్ట్ పనులు పూర్తి కాలేదని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. జూరాల ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాల నేతలు ప్రజలను భయాందోళనకు గురి చేశారని చెప్పారు. కాళేశ్వరం కుంగిపోతే ఏమికాదని మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు జూరాలపై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారన్గి÷ర్ అయ్యారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూసిన.. వారు నమ్మరని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## మహాన్యూస్ ఛానల్ పై దాడి అమానుష చర్య

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇది అమానుష చర్య అని పేర్కొన్నారు. మీడియా సంస్థల కార్యాలయాలపై ఈ రకంగా భౌతిక దాడులకు పాల్పడడం, విధ్వంసం సృష్టించడం దారుణమని ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి అని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి పక్షాన ప్రభుత్వం తరపున ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటించారు. సంస్థలు, వ్యవస్థలపై పెయిడ్ ఆర్టిస్ట్ లతో ఈ విధంగా దాడులు చేయించడం ప్రజాస్వామ్యంలో సరైనదికాదని స్పష్టం చేశారు.. పార్టీ పరంగా ఛానల్స్ నిర్వహిస్తూ పెయిడ్ ఆర్టిస్ట్ లతో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగపరుస్తూ ప్రభుత్వంపై ఇష్టమొచ్చిన రీతిలో బురద జల్లుతున్నారని అన్నారు. ఏదైతే నిజాన్ని నిర్భయంగా అధికార పక్షమనో, ప్రతిపక్షమనో తేడా లేకుండా ధైర్యంగా న్యూస్ ప్రచారం చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా గాని ధైర్యంగా న్యూస్ ప్రచురిస్తున్న ప్రింట్ మీడియాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం అండగా ఉంటూ పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి దాడులకు చోటులేదని అన్నారు. న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడికి పాల్పడి హత్యాయత్నానికి ప్రయత్నించిన వారి వెనుక ఎంతటి ఎంత పెద్దవారున్నా వదిలిపెట్టేదిలేదని దోషులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి దాడులను అరాచకాలను సహించేదిలేదన్నారు.

## పీవీ తెలుగు ఠీవీ, నిరాడంబర జీవితానికి నిలువెత్తు నిదర్శనం

ప్రధానిగా పీవీ చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక ప్రగతికి పునాది వేశాయి. కాకతీయ పత్రికలో జర్నలిస్టుగా పీవీ గారు తన జీవిత ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. మంత్రిగా, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రిగా, ప్రధాన మంత్రి వరకు అనేక ఉన్నత పదవులు చేపట్టి ఆ పదవులకే వన్నె తెచ్చిన నాయకుడు. భారత దేశంలో రాజకీయాల్లో అపర చాణక్యుడు అనగానే సామాన్య ప్రజలకు కూడా గుర్తుకొచ్చే పేరు పీవీగారిదే. హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ లో కలిపేందుకు జరిగిన 'తెలంగాణ విమోచన ఉద్యమం'లో కీలక పాత్ర వహించి అఖండ భారతావని కోసం క్రుషి చేసిన మహనీయుడు మన పీవీ...తెలుగు దనానికే ఠీవీ. హంగు, ఆర్భాటాలు లేని సాదా సీదా నేత. ఎదిగే కొద్దీ ఒదిగి ఉంటూ దేశానికి ఆదర్శంగా నిలిచిన మహా నేత. పీవీ నర్సింహారావు గారు దేశానికి చేసిన సేవలను కాంగ్రెస్, బీఆర్ఎస్ విస్మరించాయి. మాజీ ప్రధాని పీవీ చనిపోతే ఢిల్లీలో అంత్యక్రియలు జరగనీయకుండా అవమానించిన పార్టీ కాంగ్రెస్. ఎన్నికలప్పుడు మాత్రమే పీవీ పేరును వాడుకుని, ఆ తరువాత ఆయనను పూర్తిగా విస్మరించిన పార్టీ బీఆర్ఎస్. పీవీ జన్మించిన వంగరలో పీవీ జ్ఞాన వేదికను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన నాలుగేళ్లయినా నేటికీ వాటిని పూర్తి చేయకపోవడం బాధాకరం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలైనా పీవీ జ్ఞాన వేదికతోపాటు పీవీ ధ్యాన మందిరం, పీవీ విగ్రహ ఏర్పాటు వంటి పెండింగ్ పనులను పూర్తి చేయకపోవడం శోచనీయం. ఇకనైనా వాటిని సత్వరమే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మహనీయుడు పీవీ.నర్సింహారావు గారికి ఘన నివాళి అర్పిస్తున్నా.

## నేడు పసుపుబోర్డు కార్యాలయ ప్రారంభం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రానున్నారు. ఉదయం 11.25 గంటలకు గుజరాత్ లోని అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట విమానశ్రయానికి చేరుకోనున్నారు. మధ్యాహ్నం 1.45 గంటలకు బేగంపేట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి వినాయక్ నగర్ లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్నీ ప్రారంభించడానికి వెళ్లనున్నారు. ఇక, మధ్యాహ్నం 2 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించ నున్నారు. 2 నుంచి 2.30 వరకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలోనే ఉండనున్నారు. మధ్యాహ్నం 2.35 గంటలకు నిజామాబాద్ లోని కంఠేశ్వర్ క్రాస్ రోడ్ లో ఏర్పాటు చేసిన డి శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. 2. 45 నుంచి 4 గంటల వరకు పాలిటెక్నిక్ గ్రౌండ్ లో జరిగే కిసాన్ మహా బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. సాయంత్రం 5 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ బిజెపి అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్రం ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుందని అర్వింద్ అన్నారు. పసుపుబోర్డుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత బిజెపిదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం పసుపు బోర్డును సాధించుకున్నామని అన్నారు. ఈనెల 29వ తేదీన నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించడానికి కేంద్ర మంత్రి అమిత్‌షా వస్తున్నారని చెప్పారు. రైతు సభకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. దీంతో పసుపురైతులకు గిట్టుబాటు ధరలు దక్కడంతో పాటు, అంతర్జాతీయంగా ఎగుమతులకు అవకాశం పెరుగుతుందని అన్నారు. మోడీ 11 ఏళ్లలో కోట్లాది మంది పేదలకు ఇళ్లు కట్టించారని, వారికి నల్లా కనెక్షన్లు ఇప్పించారని ఎంపీ అన్నారు. అంతర్జాల సౌకర్యాన్ని విస్తరించారని, మారుమూల గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించారని, దేశంలో 60 కోట్ల మందికి ఆయుష్మాన్ భారత్ సౌకర్యం అందిస్తుందని, 50 కోట్ల మందికి జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు ఇచ్చారని చెప్పారు. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేశారని అన్నారు.

# మహా న్యూస్ పై దాడి పిరికిపంద చర్య

సిగ్గు లేకుండా ఫోన్ ట్యాపింగ్ చేసిందే కాక ప్రశ్నించిన మహా టీవీపై దాడులు చేయిస్తారా?



జర్నలిజం గురించి నీతులు మాట్లాడే ట్విట్టర్ టిల్లు...మీడియాపై దాడి చేయించడానికి సిగ్గన్పించడం లేదా?

బీజేపీ నేతలపై నిత్యం వ్యక్తిత్వహననానికి పాల్పడే టీ న్యూస్ సంగతేంటి?

మా కార్యకర్తలు తలుచుకుంటే టీ న్యూస్ ఉండేదా?

టీ న్యూస్ విషయంలో మా కార్యకర్తలు ఎంతో సహనంతో ఉన్నారు

టీ న్యూస్ యాంకర్ స్వేచ్ఛ అనుమానాస్పద మరణంపై చర్చను పక్కదారి పట్టించేందుకు మహా న్యూస్ దాడి కుట్ర

బీఆర్ఎస్ పాపాల పుట్ట బద్దలవుతుంటే తట్టుకోలేక దాడులకు పాల్పడుతున్నారు

ప్రజాస్వామ్యవాదులంతా మీడియాపై దాడిని ఖండించండి

జర్నలిస్టు సంఘాలు వెంటనే స్పందించాలి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ వెలుతురు జూన్ 28:

## ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారికి సన్మానం చేసిన శ్రీ ప్రసన్నాంజనేయ ఆలయ కమిటీ భాగ్యనగర్



**ఆదిలాబాద్ వెలుతురు జూన్ 28:**
శ్రీ ప్రసన్నాంజనేయ ఆలయ కమిటీ భాగ్యనగర్ తరపున గౌరవ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారికి సన్మానం చేయడం జరిగింది, ఆలయానికి నాలుగు లక్షల నలభై వేల రూపాయలు ఎమ్మెల్యే జిపిఆర్ఎస్ ఫండ్ నుంచి ఆలయానికి అందించినారు భాగ్యనగర్ కాలనీ వాసిన తరపున ఘనంగా సన్మానించి అన్నగారికి కృతజ్ఞతలు తెలిపినారు.. ఇందులో అధ్యక్షులు అశోక్ గౌడ్, ఉన్న దశరథ్, సురేష్ గౌడ్, గంట సురేష్, సుంకరి సుధాకర్ గారు డాక్టర్ రమేష్, మునియాల గోపి, విద్యాసాగర్ రావు కాలనీవాసులందరూ పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు

# మంత్రి కొండా సురేఖ నివాళి



**హైదరాబాద్ వెలుతురు జూన్ 28**
బహుభాషావేత్త, ఆర్థిక మేధావి, గల్లి నుంచి ఢిల్లీ పీఠానికి ఎదిగిని రాజకీయ ఎవరెస్టు శిఖరం, తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆ మహనీయుడిని మనమంతా స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఆయన భూసంస్కరణలు చేసిన గొప్ప సామ్యవాది. పీవీ నరసింహారావు ఆలోచనా ఫలితమైన నవోదయ పాఠశాలల ఈ రోజు దేశ విద్యా రంగంలో ఎంతగానో కీలక పాత్ర పోషిస్తున్న విషయం మన అందరికీ తెలిసిందే. రాజీవ్? గాంధీ గారి ఆశయాలతో ముందుకు కదిలిన పీవీ తన హయాంలో తీసుకున్న గొప్ప నిర్ణయాలు గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ విధానాలు ఎంతగానో ప్రభావం చూపాయి. ఈ రోజు దేశంలో ప్రైవేటు పారిశ్రామిక రంగం పెరిగిపోవడానికి వారి ఇరువురే కారణమని స్పష్టంగా చెప్పవచ్చు. పీవీ నర్సింహారావు గారి ఆశయాల మేరకు ప్రజాసంక్షేమాన్ని కోరి విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అగ్రస్థానం కల్పిస్తున్నది.

## కొందరు నా వ్యాఖ్యలతో నొచ్చుకున్నారు

### - క్రమశిక్షణా కమిటీ ముందు కొండా మురళి వివరణ

**హైదరాబాద్,జూన్28( వెలుతురు):**
కాంగ్రెస్ నేతలంటే గౌరవం ఉంది. కొందరు నేతలు నా వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్నారు. వాటిని పట్టించుకోవద్దని కాంగ్రెస్ నేత కొండా మురళి ప్రకటించారు. ఈ మేరకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమటీ ముందు హాజరయ్యారు. కాంగ్రెస్ నేత కొండా మురళి వ్యాఖ్యలపై ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇటీవల పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన శనివారం గాంధీభవన్‌లో పీసీసీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. గాంధీభవన్‌కు పెద్దసంఖ్యలో కార్యకర్తలతో తరలివచ్చిన ఆయన.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ముందు వివరణ ఇచ్చారు. ఆరు పేజీల లేఖను క్రమశిక్షణ కమిటీకి అందించారు. అనంతరం కొండా మురళి మాట్లాడుతూ.. 'నా వ్యాఖ్యలపై మల్లు రవికి వివరణ ఇచ్చాను. కాంగ్రెస్ నేతలంటే నాకు గౌరవం ఉంది. కొందరు నేతలపై వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవద్దు. నేను బలవంతుడినో, బలహీనుడినో అందరికీ తెలుసు. కార్యకర్తలను పట్టించుకోవాలని మాత్రమే కోరాను. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం కావాలి. బీసీలకు మేలు జరగాలని 40 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా. రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనే తపన మా అందరిలో ఉంది' అని పేర్కొన్నారు. మరోవైపు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి మాట్లాడారు. మేం నోటీసు ఇస్తే కొండా మురళి వచ్చారు. ఆయన మాకు వివరణ ఇచ్చారు. రాతపూర్వకంగా కూడా వివరణ ఇచ్చారని తెలిపారు.

# మహాన్యూస్‌పై దాడి హేయమైన చర్య

## దాడి ఘటనను తీవ్రంగా ఖండించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్28( వెలుతురు):**
తెలుగు న్యూస్ టీవీ ఛానల్ 'మహాన్యూస్' హైదరాబాద్ ప్రధాన కార్యాలయంపై దుండగులు శనివారం దాడి చేశారు. కర్రలు, రాళ్లతో ఆఫీస్ మీద దాడి చేసి బిల్డింగ్ అద్దాలు, కార్ల అద్దాలు పగులగొట్టారు. కర్రలతో ఆఫీస్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. మీడియాపై దాడి హేయమైన చర్య అని అన్నారు. మీడియాపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సమర్థనీయం కాదని తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. మహాన్యూస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ (ఓజీఠబఠ ఐబీపజీస ఉనీబీట) అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. పత్రికా విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని చెప్పారు. మీడియా ప్రసారాలు, కథనాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని తెలియజేసేందుకు చట్టపరమైన మార్గాలు ఉన్నాయని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం సహించరానిదని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వాస్తవాలను ప్రజలకి వివరిస్తున్న మహాన్యూస్‌పై దాడి చేయడం అప్రజాస్వామికమని అన్నారు. మహాన్యూస్ ఛానల్‌పై జరిగిన ఈ దాడిని ప్రజాస్వామ్యవాద వాదులు అందరూ ఖండించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తులపై ప్రభుత్వం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

# శుభాంశు శుక్లాతో ప్రధాని మోడీ సంభాషణ

## రోదసీ యాత్ర నవశకానికి నాంది అని వెల్లడి



**న్యూఢిల్లీ,జూన్28( వెలుతురు):**
శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణాన్ని.. భారత మానవసహిత యాత్ర 'గగన్‌యాన్'కు తొలి అడుగుగా ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శుక్లా చరిత్రాత్మక యాత్ర కేవలం రోదసికే పరిమితం కాలేదని, వికసిత్ భారత్ వైపు సాగుతున్న ప్రయాణానికి కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో ప్రధాని మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా 'భారత్ మాతా కీ జై' నినాదాలతో 'ఐఎస్ఎస్' మార్మోగింది. 'మిషన్‌లో భాగంగా మీరు ప్రస్తుతం భారత్‌కు చాలా దూరంగా ఉన్నప్పటికీ.. దేశవాసుల హృదయానికి దగ్గరగా ఉన్నారు. మీ రోదసి ప్రయాణం నవ శకానికి నాంది. అంతరిక్షాన్ని అన్వేషించాలనే విద్యార్థుల సంకల్పాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుంది' అని శుభాంశును ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే శుభాంశు స్పందిస్తూ.. ఇదంతా తానొక్కడి ఘనత కాదని, యావత్ దేశం సమష్టి విజయమని చెప్పారు. 'భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉంది. ఇక్కడినుంచి మొదటిసారి మన దేశాన్ని చూసినప్పుడు.. అది మ్యాప్‌లో కంటే చాలా పెద్దదిగా, గొప్పగా కనిపించింది. ఈ భూమి అంతా మన నివాసంగా, మనమంతా దాని సభ్యులుగా అనిపిస్తోంది. సరిహద్దులు, విభజన రేఖలు లేని ఏకత్వ భావన కలుగుతోంది' అని అన్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్-9 రాకెట్ ద్వారా భారత్‌కు చెందిన శు భాంశు శుక్లా సహా పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ -విస్నీవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లు అంతరిక్షంలోకి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరిన వీరి వ్యోమనౌక.. గురువారం సాయంత్రం 'ఐఎస్ఎస్'కు చేరుకుంది. డాకింగ్ అనంతరం వీరంతా అందులోకి ప్రవేశించారు. ఈ మిషన్‌లో భాగంగా 14 రోజులపాటు అక్కడే గడపనున్నారు.

# మాజీ ప్రధాని భారత రత్నా పీవీ నరసింహారావు గారి 104 వ జయంతి సందర్భంగా పీవీ జ్ఞానభూమి లో పీవీ కుటుంబ

- **సభ్యులతో కలిసి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్..**
- **అనంతరం ఉచిత ఐ స్క్రీనింగ్ క్యాంప్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**





**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మాజీ భారత ప్రధాని పీవీ నరసింహారావు గారి 104 వ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తున్న వారు దేశానికి అనేక సంస్కరణలు చేశారు. మానవ వనరులకు సంబంధించిన విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తెచ్చారు.. నవోదయాలు, గురుకులాలు తెచ్చారు.. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారు దేశం తన కాళ్ళ మీద తను నిలబడేలా ఆర్థిక సంస్కరణలు తెచ్చారు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వంగర లో జన్మించారు.. వంగర లో స్మృతి వనం పూర్తి చేసే కార్యాచరణ తీసుకున్నాం వచ్చే జయంతి వరకు మెమోరియల్ సెంటర్ మ్యూజియం తో పాటు అన్ని బాగుండేలా ఏర్పాటు చేస్తాం మా గురువు చొక్కారావు గారికి అత్యంత సన్నిహితంగా ఉండేవారు ఈనాటి యువత కు పీవీ నరసింహారావు గారి జయంతి స్ఫూర్తి.. కింది స్థాయి నుండి ప్రధాని వరకు ఎదిగిన ఒదిగిన వ్యక్తి పీవీ నరసింహారావు గారు ఆయన ఆర్థిక సంస్కరణలు ,విద్యా వ్యవస్థలో చేసిన మార్పులు ఆదర్శం..

# మహా న్యూస్ చానెల్ ను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- **మహా న్యూస్ పై బిఆర్ఎస్వి దాడి నేపథ్యంలో దాడి వివరాలు ఆరా తీసిన మంత్రి పొన్నం ప్రభాకర్**
- **మహా న్యూస్ ఎండి వంశీ కృష్ణ తో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్**
- **దోషులను కఠినంగా శిక్షిస్తామని, దాడి చేసిన వారిని ఇప్పటికే గుర్తించమన్న మంత్రి పొన్నం ప్రభాకర్**





**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహా టివి మీద జరిగిన దాడి ప్రజాస్వామ్యం మీద దాడి ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగవ స్తంభం తప్పును తప్పుగా ప్రజాస్వామ్యంలో ప్రజల ముందు ఉంచే బాధ్యత మీడియా ది.. వ్యక్తిగతంగా వార్తలు వస్తున్నాయని ట్వీట్ చేసి కార్యకర్తలను రెచ్చగొట్టి దాడి చూపించారు.. ఈ దాడి తో వారి రాజకీయ విలువల ఎలా తగ్గిపోతున్నాయో అర్థమవుతుంది అధికారంలో ఉన్న ఒక విధంగా..అధికారం కోల్పోయిన తర్వాత మరో విధంగా వ్యవహరిస్తూ దాడులు చేస్తున్నారు మీడియా మీద దాడి వివక్ష కోల్పోయి దాడి చేశారు. పోలీస్ అధికారులు కఠినంగా చర్యలు తీసుకోవాలి.. ఇది ప్రజాస్వామ్యం మీద దాడి.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తగ్గించేలా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ఎవరు వ్యవహరించిన కఠినంగా వ్యవహరించాలి దాడి పై హైదరాబాద్ ఇన్చార్జి మంత్రిగా గౌరవ ముఖ్యమంత్రి గారితో మాట్లాడడం జరిగింది దాడి చేసిన వారిని గుర్తిస్తున్నాం.. సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు.. ఇప్పటికే కొంత మంది నీ అరెస్ట్ చేసాం.. మిగిలిన వారిని పట్టుకుంటాం దీని వెనకాల ఎవరున్నా కఠిన చర్యలు తీసుకోవాలి దాడి పథకం ప్రకారం జరిగింది శాంతి భద్రతలు ఇబ్బంది కలిగితే చర్యలు తప్పవు మా కాంగ్రెస్ పార్టీ మీడియా కి అండగా ఉంటుంది.. నేను రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్సీ బలమూరి వెంకట్,కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఇక్కడికి వచ్చి చూసాం దాడి పై విచారణ జరుగుతుంది దాడి చేసిన వారిని ఇప్పటికే గుర్తిస్తున్నాం.. ఇలాంటి వాటిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది..

# ప్రధాని మోడీకి ధర్మ చక్రవర్తి పురస్కారం

## జైన అత్యున్నత మండలి నిర్ణయం



**న్యూఢిల్లీ,జూన్28( వెలుతురు):**
విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన సభ నేపథ్యంలోనే జైన అత్యున్నత మండలి ప్రధాని మోడీకి ధర్మ చక్రవర్తి పురస్కారం అందించారు. ధర్మనిబద్ధతత పాటించే పాలకులకు , ధర్మ పరిరక్షణ సంకల్పం కల్గిన వారికి ఈ బిరుదు ప్రసాదించడం జరుగుతుంది. ఈ విశిష్ట పురస్కారానికి తాను అర్హుడినని తాను భావించడం లేదని, అయితే సాధువులు బహుకరించే వాటిని దివ్య ప్రసాదంగా స్వీకరించడం భారతీయ సంస్కృతి, ఈ క్రమంలోనే ఈ గౌరవాన్ని తాను ప్రసాదంగా తీసుకుంటున్నానని తెలిపారు. జైన సాధు మహారాజు జయంతి ఉత్సవాలను కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, భగవాన్ మహావీర్ అహింసా భారతి ట్రస్టు సంయుక్తంగా నిర్వహించాయి.

# పివి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే

## సముచిత గౌరవం ఇచ్చిన ఘనత బిఆర్ఎస్‌దే: కేటీఆర్



**హైదరాబాద్,జూన్28( వెలుతురు):**
మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు జయంతి సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ నివాళులు అర్పించారు. సంస్కరణశీలి, బహుభాషా కోవిదుడు, కవి, ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, నిత్య విద్యార్థి... ఇలా భారతరత్న పీవీ నరసింహారావు గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అని అన్నారు. భారత ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గ్టటెక్కించిన మహా మేధావి పీవీ అని కొనియాడారు. తన సొంత భూమిని ప్రభుత్వానికి అప్పగించి దేశంలో కీలకమైన భూసంస్కరణలను ప్రారంభించిన మహనీయుడు పీవీ అని అన్నారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేసిన పీవీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహించిందని గుర్తు చేసుకున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టిందని.. నెక్లెస్ రోడ్‌కు పీవీ మార్గ్ అని పేరు పెట్టడమే కాకుండా.. పీవీ ఎత్తయిన విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి తీర్మానం పంపిందన్నారు. పీవీ తనయ సురభి వాణీదేవికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించిందని చెప్పుకొచ్చారు. నవ భారత నిర్మాత పీవీ మన తెలంగాణ గడ్డపై పుట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## భౌతిక దాడులు సరికావు: కెటిఆర్

**హైదరాబాద్,జూన్28( వెలుతురు):**
ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఆస్కారం లేదని మాజీమంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అదే క్రమంలో.. అబద్దాలకు, అసందర్భ ప్రేలాపనలకు, మీడియా ముసుగులో చేసే రాజకీయాలకు కూడా అస్సలు తావు ఉండకూడదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని ఓ న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై దాడి ఘటన నేపథ్యంలో కేటీఆర్ స్పందించి ఈ మేరకు ప్రకటన చేశారు.' కానీ, నేటి రాజకీయాల్లో అన్నీ మెయిన్ స్ట్రీమ్‌కి తీసుకొచ్చారు. భారాస సోదరులు సంయమనం పాటించాలి. న్యాయ ప్రక్రియను నమ్ముకుందాం. మీ బాధను అర్థం చేసుకోగలను. పార్టీ, నాపై మీకు ఉన్న ప్రేమను గౌరవిస్తాను. ఈ బురదజల్లే ప్రయత్నంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం' అని కేటీఆర్ తెలిపారు.

## అన్నపూర్ణా క్యాంటీన్ పేర్లు మార్పు తగదు: కెటిఆర్

**హైదరాబాద్,జూన్28( వెలుతురు):**
జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తోన్న 'అన్నపూర్ణ పథకం' పేరు మార్పుపై మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై 'ఎక్స్'లో కేటీఆర్ విమర్శలు గుప్పించారు. దిల్లీ బాస్‌లకు మీ విధేయత చూపించాలనుకుంటే మీ పేరును రాజీవ్ లేదా జవహర్‌గా ఎందుకు మార్చుకోకూడదని ప్రశ్నించారు. అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చడం హాస్యాస్పదమన్నారు. 2028లో భారాస తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అర్థరహిత నిర్ణయాలన్నింటినీ రద్దు చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం అందిస్తున్నారు. ఇందిర క్యాంటిన్లుగా పేరు మార్చి.. రూ.5కే భోజనం, అల్పాహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# సంపాదకీయం..

## బనకచర్ల... మరో కాళేశ్వరం..!

బనకచర్లపై ఇరు రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు చేస్తానని కేంద్రమంత్రి పాటిల్ ప్రకటించిన నేపథ్యంలో ముందుగా ఇరు రాష్ట్రాలు కూర్చుని ఈ సమస్యపై చర్చించాలి. అలాగే కేంద్రం కూడా వివరాలు తెప్పించుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. కెసిఆర్ కాళేశ్వరం చేపడతామని అన్నప్పుడు కేంద్రం ప్రేక్షక పాత్ర వహించింది. ఇవాళ లక్షకోట్లకు పైగా దుబారా అయ్యాయి. కాళేశ్వరం ఎటిఎంగా మారిందన్న మోడీ, అమిత్ షాలు ఏనాడూ నిలదీసి అడగలేదు. నిజాయితీగా ప్రశ్నించలేదు. విచారణకు ఆదేశించలేదు. ఇప్పుడు బనకచర్ల విషయంలో అలాంటి పొరపాట్లుజరక్కూడదు. ఎందుకంటే సాధ్యాసాధ్యాలపై కేంద్రం అధ్యయనం చేయించాలి. ఆర్థిక వనరులపై చర్చించాలి. బనకచర్ల ప్రాజెక్టు ఎత్తిపోతల ప్రాజెక్టు. కింది నుండి పైకి నీటిని ఎత్తిపోయడానికి **4,125** మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఇందుకు ప్రతి సంవత్సరం భారీగా ఖర్చు చేయాలి. నిపుణుల అంచనా ప్రకారం కొత్తగా సాగులోకి వచ్చే మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రతి సంవత్సరం ఒక ఎకరానికి రూ.**50** వేలు ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చును ఎవరు భరించాలన్నది చెప్పాలి. ఎందుకంటే కాళేశ్వరంలో ఇదే జరిగింది. కాళేశ్వరం కొనసాగించాలంటే విద్యుత్ వినియోగం తడిసి మోపెడు అవుతుంది. ఇది కళ్లముందు కనిపిస్తున్న సత్యం. దీనిని కాదని బనకచర్ల అంటూ చంద్రబాబు పలవరించడం, కేంద్రం తలూపడం సరికాదు. ఇకపోతే బిఆర్ఎస్ గత తప్పిదాలను పక్కన పెట్టి బనకచర్లపై ఏదో కొంపలు అంటుకున్నట్లుగా గగ్గోలు పెడుతోంది. ప్రాజెక్టులన్నీ దెబ్బతిన్నా యని, వాటికి ప్రమాదం పొంచివుందని అంటోంది. పదేళ్లపాటు లేని ప్రమాదం ఏడాదిన్నరలో ఎలా వచ్చిందో హరీష్ రావు, కెటిఆర్లు చెప్పాలి. గగ్గోలు పెడితే అబద్దాలు నిజాలై పోవు. కాళేశ్వంరపై ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడలో భాగంగా బిఆర్ఎస్ హంగామా చేస్తోంది. ఎందుకంటే ఓ పద్దతి ప్రకారం ప్రాజెక్టులు, బనకచర్ల, స్కూళ్లు, హాస్టళ్లు తదితర సమస్యలపై ప్రస్తావిస్తూ తెలంగాణ ఆగమై పోయిందన్న రీతిలో మాట్లాడుతు న్నారు. బిఆర్ఎస్ నేతలు చేసే ఆరోపణలు నిజమైతే అందుకు వారే బాధ్యత వహించాలి.ఎందుకంటే పదేళ్ల పాటు తెలంగాణను ఏలింది వారే కనుక వారే సమాధానం చెప్పాలి.ఇకపోతే బనకచర్లపై ఎపిలో మాట్లాడి సాధ్యాసాధ్యాలు చర్చించాలి. ఎపి సిఎం చంద్రబాబు కూడా పోలవరం పూర్తి కాకుండానే ఇప్పుడు బనకచర్ల గురించి మాట్లాడుతున్నారు. అసలు లోటు బడ్జెట్లో ఉన్న సమయంలో దీనికి డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పడం లేదు. ఇది సాధ్యమా అన్నది చర్చించడం లేదు. విభజిత ఆంధ్రప్రదేశ్ తర్వాత పోలవరం ఆంధ్రకు వరం అంటూ హంగామా చేసిన నేతలే నేడు బనకచర్ల గురించి హడావుడి చేయడం వెనుక అనుమానాలు ఉన్నాయి.ఈ ప్రాజెక్టు కూడా కారట్రాక్టర్ల, రాజకీయ నాయకుల ఆదాయం సమకూర్చేదిగా మారకూడదన్నదే సకలజనుల అభిప్రాయం. గోదావరి వరద నీటిని రాయలసీమలోని పెన్నా బేసిన్కు మళ్లించి తద్వారా రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు ఇవ్వడం లక్ష్యంగా టిడిపి కూటమి ప్రభుత్వం చెబుతుంది. గోదావరి నుండి ప్రతి సంవత్సరం సుమారుగా రెండువేల టిఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుంది. ఈ నీటిలో పదో వంతు కనీసం **200** టిఎంసిల నీటిని వెనుకబడిన జిల్లాలకు మళ్లిస్తే రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెరుగుతుందంటూ నేతలు చెబుతున్నారు. ఇందుకోసం రూ.**80,112** కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేసి, జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ అంగీకరించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం సహాయం చేయాలని ప్రధానమంత్రిని, కేంద్ర ఆర్థికమంత్రిని రాష్ట్ర ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు ఢిల్లీ వెళ్లి కేంద్ర ఆర్థిక శాఖ, జలశక్తి శాఖ అధికారులకు పవర్పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి **48** వేల ఎకరాల భూమిని సేకరించడం, సుమారు **27** కిలో మీటర్ల సొరంగం తవ్వడం, రూ.**80** వేల కోట్లు పైగా ఖర్చు పెట్టడం సాధ్యమయ్యే పనేనా అన్న అనుమానాలు వస్తున్నాయి. కాళేశ్వరం తరహాలో కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకే అన్న అనుమానాలు వస్తున్నాయి. అందుకే కేంద్ర అధికారులు ఆదిలోనే అడ్డువేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ తోపాటు ఇతర హామీలు అమలు చేయడానికి ఖజానా ఖాళీ అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం రూ.**80** వేల కోట్ల భారీ ఖర్చుతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తాననడం అనుమానాలకు తావిస్తోంది. ఇది సాధ్యమేనా అని అనేకమంది ఇప్పటికే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అఖిలపక్ష సమావేశం వేసి, నీటిపారుదలరంగ నిపుణుల అభిప్రాయాలను, సూచనలను తీసుకోవడం ప్రభుత్వ కనీస బాధ్యత. ఆ తరవాతే దీనిపై ముందుకు సాగాలి. దీనికన్నా ముందు పోలవరం సజావుగా పూర్తి కావాలి. పోలవరం బాధితులు ఇప్పటికే రోడ్డున పడ్డారు. వారిని ఆదుకునే ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. భూములు, ఇళ్లు కోల్పోయిన గిగిరిజనులు గౌరవంగా బతికేలా చేయాలి. అమరావతికి భూమలు ఇచ్చిన రైతులు కూడా దర్జాగా బతకగలగాలి. ఇవన్నీ చేయకుండా, నిపుణలుతో చర్చించకుండా ముందుకు సాగాలనుకోవడం చంద్రబాబుకు తగనిపని. ఈ ప్రాజెక్టు గేమ్ చేంజర్, సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు, హైబ్రిడ్ యాన్యూటీ (హమ్) స్కీమ్ అని చెబుతున్నారు. ప్రాజెక్టులు కట్టి, నీటిపారుదల అభివృద్ధి చేస్తే ఎవరికి అభ్యంతరం వుండదు. కానీ గత ఐదేళ్ల చంద్రబాబు ప్రభుత్వ హయాలో అలా జరగలేదు. ఉమ్మడి ఎపిలో కూడా చంద్రబాబు అనేక ప్రాజెక్టులు చేపట్టినా పూర్తిచేయలేక పోయారు. గత కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్లో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన అనేక సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. అవేవీ వ్యవసాయాభివృద్ధికి తోడ్పడలేదు. కానీ కాంట్రాక్టర్లకు, అధికార పార్టీల నాయకులకు ప్రధాన ఆదాయ వనరులుగా మారాయి. అందుకు పోలవరమే సాక్ష్యం. విభజన తరవాత ఐదేళ్లు పాలించిన చంద్రబాబు అమరావతిని, పోలవరాన్ని పూర్తి చేయలేక పోయారు. తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ కూడా ఈ రెంటినీ పక్కన పెట్టి ఎపిని అప్పులకుప్పగా తయారు చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుండి నిధులను రాబట్టకుండా ఈ ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారన్న దానికి సమాధానం లేదు. కానీ ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య మాత్రం నిత్యం రచ్చ చేసుకునేలా చేస్తున్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఇప్పటికే పెట్టిన ఖర్చుకు ఫలితం దక్కుతుంది. వాటిని వదిలేసి భారీ ఖర్చులతో కొత్త ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు. ఇదంతా డబ్బులు దండుకోవడానికే అని వేరుగా చెప్పనక్కర లేదు. కేంద్రం కూడా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. ఇప్పటికే విద్యుత్ ప్రైవేటీకరణ వల్ల నడ్డివిరిగి పోతున్న రాష్ట్ర ప్రజలు, సాగునీటికి భారీగా చార్జీలు చెల్లించి వ్యవసాయం చేయడం అసాధ్యం. కార్పొరేట్ అనుకూల విధానాలు మోడీ మన్ననలు పొందుతాయేమోకానీ ప్రజల వ్యతిరేకతను మాత్రం పెంచడం ఖాయం. అందువల్ల మాటలతో కాకుండా చేతలతో పనులు చూపాలి. సత్వరం పోలవరం పూర్తి చేసి నిర్వాసితులను ఆదుకోవాలి. అలా చేయకుండా బనకచర్ల జపం చేయడం సరికాదు. కేంద్రం తనకు అనుకూలంగా ఉందని చంద్రబాబు అతి విశ్వాసానికి పోరాదు.

# జలయజ్ఞంతో మొదలైన ధనయజ్ఞం

- **ప్రాజెక్టులు చేపట్టి.. దోచకునే యత్నం**
- **పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం**

**అమరావతి,జూన్28( వెలుతురు):**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరుతో అనేక ప్రాజెక్టులను ఏకకాలంలో చేపట్టి అవి కాంట్రాక్టర్లకు, రాజకీయ నాయకులకు ధనయజ్ఞం లాగా మారిన వైనం చూసాం. అలాగే 2014-15 నుండి 2018-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం పోలవరంతో కలిపి 56 సాగునీటి ప్రాజెక్టులను రూ.80,792 కోట్లతో పూర్తి చేస్తామని చెప్పి వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదు. గత వైసిపి ప్రభుత్వం కొత్తగా మరో 37 ప్రాజెక్టులను ఒకేసారి ప్రారంభించి 4 సంవత్సరాల్లో పూర్తిచేస్తామని ప్రకటించి రూ.61,573.15 కేటాయించి, అందులో రూ.32,059,61 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. రాష్ట్రంలో పెండింగ్లో వున్న లేదా నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు పూర్తయితే భారీ ప్రాజెక్టుల ద్వారా 580.692 టిఎంసీల నీటితో 50,95,394 ఎకరాలు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 25.111 టిఎంసీల నీటితో 2,82,238 ఎకరాలు, చిన్నతరహా ప్రాజెక్టుల ద్వారా 3.742 టిఎంసీల నీటితో 58,052 ఎకరాలు మొత్తం 54,35,684 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా బనకచర్ల ప్రాజెక్టు గురించి అధికార పార్టీ మాట్లాడినా, ప్రతిపక్షం ప్రశ్నించకపోయినా ప్రజలు ప్రశ్నించాలి. కేంద్రం ఆరా తీయాలి. ఎందుకంటే ఇది సాధ్యమా కాదా అన్నది ముందు తేల్చాలి. కెసిఆర్ లాగా చంద్రబాబు చేస్తానంటూ చూస్తూ ఊరుకోరాదు. బనకచర్ల ప్రాజెక్టును మూడు దశల్లో నిర్మించాలని నిర్ణయించినట్లు సిఎం చంద్రబాబు చెబుతున్నారు. మొదటి దశలో ప్రస్తుతం వున్న పోలవరం కుడి కాలువ సామర్థ్యాన్ని 17,500 నుండి 38,000 క్యూసెక్కులకు పెంచుతారు. పోలవరం ఎత్తును 45.72 మీటర్ల నుండి 41.15 మీటర్ల ఎత్తుకు కుదిస్తూ కేంద్ర కేబినెట్ గత ఆగస్టులో తీర్మానించింది. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించలేదు. 41 మీటర్ల వరకే నీరు వుంటే 42 మీటర్ల నుంచి బనకచర్ల ప్రాజెక్టుకు నీరు తరలిస్తామనడం ఎలా సాధ్యం? అలాగే రెండో దశలో కొత్తగా పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి దగ్గర 150 టిఎంసీల నీటిని నిల్వ చేసే రిజర్వాయర్ నిర్మించాలి. దీనివల్ల బొల్లాపల్లి మండలంలో 15 గ్రామాలు నీటి మునుగుతాయి. వీరికి పునరావాసం కల్పించాలి. రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకే ఇప్పటికీ పరిహారం, మౌలిక సౌకర్యాలు కల్పించక పోవడంతో వారు పోరాడుతున్నారు. కొత్తగా ఈ 15 గ్రామాల పునరావాసం ఎప్పటికి తీరుతుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది. మూడో దశలో బొల్లాపల్లి రిజర్వాయర్లో 172 మీటర్ల నుండి 300 మీటర్లకు ఎత్తిపోసి, నల్లమలలో తవ్వే టన్నెళ్ల ద్వారా బనకచర్ల రెగ్యులేటర్కు తరలించాలి. బనకచర్ల మొత్తం ప్రాజెక్టు ఖర్చులో ఈ మూడో దశ పనులకే దాదాపు సగం ఖర్చు అవుతుంది. మొదటి, రెండు దశలతో పోలిస్తే మూడో దశ పని క్లిష్టమైంది. బనకచర్ల ప్రాజెక్టును సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అంటున్నారు. అంటే నీటిపారుదల శాఖ సిబ్బంది వేతనాలు, ప్రాజెక్టు నిర్వహణకు అయ్యే ఖర్చును రైతులే భరించాలేమో! ప్రస్తుత ఖర్చుల ప్రకారం ఎకరాకు యాభై వేల రూపాయలను రైతులు చెల్లించాలి. ఇది ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పెరగడమే తప్ప తగ్గే సమస్యే లేదు. దాదాపు ఉచితంగా సాగునీరు ఇస్తేనే పండిన పంట గిట్టుబాటు కాక ప్రాజెక్టులో నీరు వున్నప్పటికీ ధాన్యం పడించడానికి రైతులు సిద్ధపడని స్థితిలో ఇంత ఖర్చును భరించడం వ్యవసాయదారులకు సాధ్యమా? ఈ మాత్రం ఆలోచన పాలకులకు తెలియక కాదు. డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయాన్ని అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించే విధానాన్ని గతంలో జగన్ మోహన్ రెడ్డి, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ద్వారా అమలు చేయించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అటు విద్యుత్ చార్జీలు, ఇటు సాగునీటి ఖర్చులను పేద రైతులే కాదు, మధ్యతరగతి రైతులు కూడా భరించడం సాధ్యం కాదు. ఇప్పటికే రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి పేరుతో 11 లక్షల ఎకరాల భూమి కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి పోతుంది. రానున్న రోజుల్లో బనకచర్ల లాంటి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుల ద్వారా మరికొన్ని లక్షల ఎకరాల భూమి ఈ కంపెనీల చేతుల్లోకి వెళ్తుంది. అందువల్ల ముందుగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలి. జలయజ్ఞం పేరుతో చేపట్టిన ధనయజ్ఞానికి చెల్లుచీటి పలకాలి.

# ఇది ముమ్మాటికీ టిఎంసి ప్రభుత్వ వైఫల్యం

- **తన కూతరు ఘటన తరవాత పరిస్థితులు మారలేదు**
- **తాజా ఘటనపై ఆర్జీకర్' మృతురాలి తండ్రి తీవ్ర ఆవేదన**

**కోల్కతా,జూన్28( వెలుతురు):**

గతంలో కోలకతాలోని ఆర్జీకర్ వైద్య కళాశాలలో ఓ విద్యార్థినిపై హత్యాచార ఘటన మరవకముందే పశ్చిమబెంగాల్లో న్యాయ కళాశాల ప్రాంగణంలోనే ఓ విద్యార్థిని (24)పై సామూహిక అత్యాచార ఘటన నెలకొనడంతో మహిళల భద్రతపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. ఈ దారుణాన్ని 'ఆర్జీకర్' మృతురాలి తండ్రి తీవ్రంగా ఖండించారు. ఈ కేసులో అరెస్టయిన వారంతా అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారే అని ఆరోపించారు. టీఎంసీ ప్రభుత్వ ఉదాసీనత వల్లే రాష్ట్రంలో అత్యాచారాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో తన కుమార్తె హత్యాచారానికి గురైనప్పుడు వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేసినా.. ఎంత పోరాడినా మహిళలపై జరుగుతున్న దారుణాలలో ఎలాంటి మార్పు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. 'నా కుమార్తె లాంటి అభాగ్యులు ఇంకా ఎంతమంది ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలి కావాలి. రాష్ట్రంలో ఇటువంటి దారుణాలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయి. నా కుమార్తె విషయంలో జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ.. వేల మంది వీధుల్లోకి వచ్చారు. అయినా ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. కాలేజీలోని వారే దారుణాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కావద్దంటే న్యాయ విద్యార్థినిపై




అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులకు కఠిన శిక్ష విధించాలి' అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయ విద్యార్థినిపై అత్యాచార ఘటనపై టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యార్థినిపై ఆమె స్నేహితులు అత్యాచారం చేస్తే ఎవరేం చేస్తారని ప్రశ్నించారు. పోలీసులు కళాశాలల్లో ఉంటారా అంటూ మీడియాపై విరుచుకుపడ్డారు. ఇటువంటి ఘటనల్లో మహిళలు ప్రభుత్వాలతో కాకుండా ఈ దారుణాలకు పాల్పడుతున్న మగాళ్లకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. ఆయన వ్యాఖ్యలను ప్రతిపక్ష భాజపా నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. కోల్కతాలోని ఓ న్యాయ కళాశాల విద్యార్థిని(24)పై పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు విద్యాసంస్థ ప్రాంగణంలోనే అత్యాచారానికి ఒడిగట్టారు. విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగినట్టు వైద్య పరీక్షల్లో రూఢీ అయిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. గురువారం ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా.. శుక్రవారం ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా(31)కు అదుపులోకి తీసుకున్నారు. మోనోజిత్ మిశ్రాకు టీఎంసీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నట్లు తెలుస్తోంది. తనను వదిలేయాలంటూ ఆమె ఎంతగా ప్రాధేయపడినా నిందితులు కనికరించలేదని.. తనపై చేసిన దారుణాన్ని రికార్డ్ చేసి ఆ వీడియోలను అందరికీ చూపిస్తామని బెదిరించారని బాధితురాలు వాపోయింది. తప్పించుకొనేందుకు ప్రయత్నిస్తే హాకీ స్టిక్తో దాడి చేశారని పోలీసులకు వెల్లడించింది.

# జన్మతః పౌరసత్వం ఇక అందని ద్రాక్ష

- **సుప్రీం తీర్పుతో...నెగ్గనున్న ట్రంప్ పంతం**

**వాషింగ్టన్,జూన్28( వెలుతురు):**

జన్మతః అమెరికా పౌరసత్వ హక్కు వివాదంలో అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పంతం నెగ్గనుంది. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడికి ఉండే అధికారాలను దేశ సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ విషయంలో ట్రంప్ అధికారాల నిలిపివేతకు దిగువ న్యాయస్థానాల జడ్జిల తీర్పును సు ప్రీంకోర్టు పరిమితం చేసింది. అమెరికాలో జన్మించే నవజాత శిశువులకు స్వతహసిద్ధంగా తక్షణం అమెరికా పౌరసత్వం కల్పించే విధానం ఇప్పటివరకూ అమలులో ఉంది. అయితే ఇది కుదరదని ట్రంప్ తమ రెండోసారి అధికార ఆరంభంలోనే ఆంక్షలకుదిగారు. దీనిపై మూడు రాష్ట్రాలు కోర్టుకువెళ్లాయి. అక్కడ ట్రంప్ అధికారాలకు బ్రేక్ పడింది. అయితే ఇప్పుడు సుప్రీంకోర్టు 6:3 తీర్పుతో దిగువ కోర్టుల ఆంక్షలను పరిమితం చేసింది. అధికారిక నిర్ణయాల అమలు విషయాల పరిశీలన తరువాత ఈ జడ్జిల తీర్పును పరిమితం చేశారు ఇంజెక్షన్లను నిలిపివేయాలనే ట్రంప్ అధికార యంత్రాంగ అభ్యర్థనను ఆమోదించింది. ఈ పరిణామంతో ఇకపై ఆయా రాష్ట్రాల్లో కూడా జన్మతః పౌరసత్వ హక్కు సంపూర్తి అమలు సాధ్యం కాదు. పలు ఇతర అంశాల పరిధిలోనే నదజాత శిశువులకు సిటిజన్షిప్ బై బర్త్ స్థాయి కల్పిస్తారు.



# సర్వీస్ ట్యాక్స్‌పై వెనక్కి తగ్గని కెనడా

## కెనడాతో వాణిజ్య చర్చలు ముగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్,జూన్28( వెలుతురు):**

కెనడా విధిస్తున్న డిజిటల్ సర్వీస్ ట్యాక్స్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కీలక ప్రకటన చేశారు. ఈ డిజిటల్ సర్వీస్ ట్యాక్స్పై కెనడా వెనక్కి తగ్గకపోవడంతో ఆ దేశంతో అన్ని రకాల వాణిజ్య చర్చలు ముగిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ట్రూత్లో సంచలన ప్రకటన చేశారు. 'కెనడాతో అన్ని రకాల వాణిజ్య చర్చలను తక్షణమే నిలిపివేస్తున్నాం' అని ప్రకటించారు. కెనడలో డిజిటల్ సేవల పన్ను గతేడాది అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే, కంపెనీలు మాత్రం ఈ ఏడాది జూన్ 30 నుంచి పన్ను చెల్లింపులు ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. ఈ చట్టం ప్రకారం.. కెనడాలో ఆన్లైన్ ద్వారా గణనీయమైన ఆదాయం అర్జించే పెద్ద డిజిటల్ కంపెనీలు తమ ఆదాయంపై 3 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆన్లైన్ మార్కెట్ప్లేస్ సేవలు, ఆన్లైన్ ప్రకటనలు, సోషల్ మీడియా సేవలు, వినియోగదారుల డేటా అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ఈ పన్ను పరిధిలోకి వస్తుంది. ఈ విధానం యూఎస్లో ప్రధాన కార్యాలయం కలిగిన పెద్ద పెద్ద టెక్ కంపెనీలు, ఇ-కామర్స్ ఎ÷-లాట్ఫామ్లపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. దీంతో అధ్యక్షుడు దీనిపై ప్రధానంగా దృష్టి సాధించారు. జూన్ 30 నుంచి ఈ కొత్త పన్నుల విధానం అమల్లోకి రానున్న నేపథ్యంలో ట్రంప్ ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలి

- బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలి.
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**
రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు అవసరమైతే ప్రధానమంత్రి కార్యాలయం ముందు ధర్నా చేయాలన్నారు.బిజెపి నాయకులు పూటకొక మాట మాట్లాడుతున్నారని అసలు వారికి బీసీలకు రిజర్వేషన్లు పెంచే ఉద్దేశం ఉందో లేదో చెప్పాలని అన్నారు. ఒకరేమో రాష్ట్ర ప్రభుత్వం జీవో తేవాలని ఇంకొకరేమో కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని మాట్లాడుతూ బీసీలను కన్ఫ్యూజ్ చేస్తూ మోసానికి పాల్పడుతున్నారు.ఈ పార్టీలు కేవలం బీసీలను ఓట్ బ్యాంకు గానే చూస్తున్నారు గాని వారికి రిజర్వేషన్లు పెంచే ఆలోచన మాత్రం ఏ కోశాణ లేదని అన్నారు..రిజర్వేషన్లు పెంచిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు

## అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు



**మేడిపల్లి వెలుతురు జూన్ 28:**
మేడిపల్లి ప్రెస్ క్లబ్ పై వ్యక్తులపై సోషల్ మీడియా (వాట్సాప్ )లో అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి ప్రెస్ క్లబ్ అంతర్గత అంశాలపై సోషల్ మీడియా (వాట్సాప్) నెట్వర్క్ లో దుష్ప్రచారం చేస్తూ పోస్ట్ చేసిన రాజాపేట నవీన్ చారీ అనే వ్యక్తిపై బీఎన్ఎస్ 352 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలు చేస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించేలా, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేకా పోస్ట్ లు పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని సీఐ గోవింద్ రెడ్డి తెలిపారు.

## ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి తరలి వెళ్లిన పురేందర్ రెడ్డి...



**కూకట్ పల్లి జూన్ 28 వెలుతురు:**
గచ్చిబౌలి, కొండాపూర్ ఫ్లై ఓవర్ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సమక్షంలో ఎమ్మెల్యే నివాసం నుండి పలువురు నాయకులు, కార్యకర్తలు ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జనంపల్లి పురేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు రామకృష్ణ గౌడ్, హరినాథ్, రామ్ చందర్, ఇబ్రహీం, లింగం, చందు, జి ప్రసాద్, శ్రీధర్, పవన్, నరసింహారావు, రమేష్, అశోక్, మహిళ నాయకురాలు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఏమ్ ఎన్ ఆర్ స్కూల్‌లో నిర్వహించిన "ఇన్వెస్టిచర్ సెరిమనీ" వేడుకలో పాల్గొన్న కాట సుధా






**అశోక్‌నగర్ వెలుతురు జూన్ 28:**
అశోక్‌నగర్‌లోని ప్రముఖ విద్యాసంస్థ MNR స్కూల్ లో ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకకు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా గారు ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థి నాయకులకు ప్రమాణస్వీకారం చేయించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీమతి కాట సుధ గారు మాట్లాడుతూ "నాయకత్వం అనేది కేవలం పదవికాదు, అది బాధ్యత. మీలోని ప్రతిభను గుర్తించుకొని, సమాజానికి సేవ చేసే మార్గాన్ని ఎంచుకోవాలి. మీరు చేసే ప్రతి పని సామాజిక పట్ల గౌరవంతో ఉండాలి," అని ఆమె అన్నారు.

# ఎమ్మెల్యేకు కూకట్ పల్లి ప్రాంతం మీద ఉన్న శ్రద్ధ బాలానగర్ మీద లేదు...

- కాంగ్రెస్ నేత ఎం.యుగంధర్ రెడ్డి....



కూకట్ పల్లి జూన్ 28 వెలుతురు: బాలానగర్ ప్రాంత పేద ప్రజల పట్ల కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చిన్న చూపు చూస్తూ ఏమాత్రం పట్టించుకోకుండా తాను నివసించే కూకట్ పల్లి ప్రాంతం వైపు అధికంగా శ్రద్ధ చూపిస్తున్నాడని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శనివారం ఒ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ కూకట్పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని గత సంవత్సరం నుండి నిధులు వేచించి 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కాకుండా, స్థలం స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే చేసిన కృషి, బాలానగర్ లో 100 పడకల ఆసుపత్రి కట్టిస్తా అని చెప్పిన మాటపై ఎందుకు అంతగా శ్రద్ధ చూపించలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా బాలానగర్ లోని 47 ఎకరాల ప్రభుత్వ లీజు భూముల్లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కట్టిస్తానని అనేక ఎన్నికల బహిరంగ సభల్లో మాట్లాడారని గుర్తు చేశారు. బాలానగర్ ప్రాంతంలో ఆసుపత్రి పై ప్రత్యేకమైన కృషి ఎందుకు చేయలేదని, సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నాడు. తాను చెప్పేది అబద్ధం అయితే, ఎమ్మెల్యే ప్రభుత్వం ఆసుపత్రి నిర్మిస్తా అని అనలేదని తన సొంత నిధులతో నిర్మించిన సీతారాముల స్వామి దేవాలయంపై ఒట్టు వేసి చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆడుతున్న డ్రామాల ను నియోజకవర్గం ప్రజలు దయచేసి గమనించాలని కోరారు. బాలానగర్ లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించినట్లయితే స్థానిక పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే వేలాది మంది కార్మిక కుటుంబాలు వైద్యం కు నోచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బాలానగర్ ప్రాంత పేద ప్రజలకు వైద్యం అక్కర లేదని కూకట్పల్లిలో ప్రభుత్వ ఆసుపత్రిని కట్టించడం ఎంత విడ్డూరంగా ఉందో బాలానగర్ ప్రాంత ప్రజలు గమనించాలని అన్నారు. కూకట్పల్లికి అంత శ్రద్ధ వహించినప్పుడు, బాలానగర్ కు ఎందుకు అంత శ్రద్ధ తీసుకోలేదు, అంటే ఎమ్మెల్యేకు బాలానగర్ ప్రాంత ప్రజలు ఓట్లు వేసి గెలిపించలేదా.. అని ఆయన ప్రశ్నించారు..?

# ఫ్లై ఓవర్ కు పీజేఆర్ పెట్టడం అభినందనీయం...

- ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన పీజేఆర్...
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు...
- కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి



**కూకట్ పల్లి జూన్ 28 వెలుతురు:**
హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేస్తూనే పేదల నాయకునిగా పేరొందిన సీఎల్పీ మాజీ నేత పి జనార్దన్ రెడ్డి పేరును కొండాపూర్, గచ్చిబౌలి ఫ్లైఓవర్ కు నామకరణం చేయడం అభినందనీయమని కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. శనివారం సీఎం రేవంత్ రెడ్డి పీజేఆర్ పేరున ఫ్లైఓవర్ ప్రారంభించిన సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ గురువు, పేదల నాయకునిగా ఒకప్పటి ఖైరతాబాద్ నియోజకవర్గం కు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సమస్యలపై గళం విప్పిన నేత పీజేఆర్ అని అన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా గచ్చిబౌలి లోని ఓ ఆర్ ఆర్ ఫ్లైఓవర్‌కు "పీ.జె.ఆర్ ఫ్లైఓవర్"గా నామకరణం చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఇలాగే మున్ముందు మరిన్ని గుర్తింపులు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం అని స్పష్టం చేశారు. పీ.జె.ఆర్ మన మధ్య లేకపోయినా, ఆయన త్యాగాలు, సేవలు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా వెలుగుతూనే ఉంటాయని అన్నారు.

# జులై 09 న జరిగే దేశ వ్యాప్త సమ్మె వాల్ పోస్టర్ విడుదల...

- కార్మికులను బానిసలుగా చేసే 4 లేబర్ కోడ్ లను రద్దు చెయ్యాలి
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్




**కూకట్ పల్లి జూన్ 28 వెలుతురు:**
కేంద్ర ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తూ కట్టు బానిస లు చేసే 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చెయ్యాలని శనివారం బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల్లో జులై 09 న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చెయ్యాలని పారిశ్రామిక కార్మికులు, జిహెచ్ఎంసి కార్మికుల ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ లు విడుదల చేశారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ దేశంలోని సంఘటిత రంగమైన కార్మికులు, అసంఘటిత రంగమైన కార్మికులు స్కీం వర్కర్లు వ్యవసాయ కార్మికులు, రైతు కూలీలు సమస్త కార్మిక వర్గం ఐక్యం కావలసిన సమయం జులై 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మె అని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం నిస్సిగ్గుగా బడా కార్పొరేట్ లకు దేశాన్ని తాకట్టు పెట్టాలనే ఉద్దేశంతో చట్టాలలో మార్పులు తెస్తూ బడా కార్పోరేట్లకి అనుకూలమైన విధంగా చట్టాలను మార్చుతూ దేశా కార్మిక వర్గాన్ని బానిసలుగా చేయడమే కేంద్ర ప్రభుత్వ వైఖరి లా కనిపిస్తుందన్నారు. 44 చట్టాలుగా ఉన్న కార్మిక చట్టాలను 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చి బడా కార్పొరేట్ యాజమాన్యాలకు మేలు చేసే విధంగా చట్టాలను తీసుకురావడం దుర్మార్గమని కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. శ్రమ దోపిడి గురవుతున్నా శ్రమకు తగ్గ వేతనం కావాలని అడిగే అవకాశం లేకుండా చట్టంలో మార్పు తెస్తున్నారు. కార్మికులందరూ ఐక్యంగా యూనియన్ పెట్టుకొని కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలని అనుకుందామంటే యూనియన్ పెట్టుకోకుండా చట్టాలను తెస్తున్నారనీ అన్నారు. యజమానికి కార్మికుడ్ని తనకు వచ్చినప్పుడు ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం చేస్తూ చట్టం చేస్తున్నారు ఇలాంటి లేబర్ కోడ్లు యాజమాన్యాలను బతికించడమే తప్ప కార్మికుల నట్టేట ముంచేయడమే ఈ దేశ వ్యాప్త సమ్మెతో బిజెపి కేంద్ర ప్రభుత్వం అహంకారాన్ని తిప్పికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, లక్ష్మణరావు, మోహన్,నాగరాజు, మూర్తి, లక్ష్మి, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తాటికాయ గ్రామంలో అమానవీయం

- మహిళను వివస్త్రను చేసి చిత్రహింసలు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనతో పోలీసుల విచారణ



**హనుమకొండ,జూన్28( వెలుతురు):**
జిల్లాలో అత్యంత అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ఓ మహిళను వివస్త్రను చేసి చిత్రవధ చేసిన ఘటన వెలుగు చూసింది. ధర్మసాగర్ మండలం తాటికాయలలో ఈ దారుణం జరిగింది. వివాహేతర సంబంధం పెట్టుకుందని ఓ మహిళను ఇనుప గ్రిల్స్ కట్టి, వివస్త్రను చేసి జననాంగాలపై జీడి పోసి చిత్రవధకు గురి చేశారు. తప్పు చేశామని క్షమించాలని వేడుకున్నా కూడా వినకుండా దాడి చేశారు. ఈ ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.తాటికాయల గ్రామానికి చెందిన యువతితో మునుగు మండలం బోలోలుపల్లికి చెందిన రాజుకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. అయితే ఇటీవల కాలంలో రాజు.. మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. పదిరోజుల క్రితం ఇద్దరు కలిసి గ్రామం నుంచి పారిపోయారు. వీరిద్దరి కోసం గాలించిన రాజు కుటుంబసభ్యులు ఎట్టకేలకు వారిని వెతికి పట్టుకుని తాటికాయల గ్రామానికి తీసుకొచ్చారు. ఆపై మహిళ పట్ల అత్యంత కిరాతకంగా వ్యవహరించారు. ఆమెను ఇనుప గ్రిల్స్‌కు కట్టి వివస్త్రను చేసి జననాంగాలపై జీడి పోసి దారుణంగా చిత్రవధ చేశారు. తరువాత ఇద్దరికీ గుండు గీయించారు. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన నేడు వెలుగులోకి వచ్చింది. ఈ దారుణ ఘటన అనంతరం రాజు, మహిళ కనిపించకుండా పోయారు. మహిళపై దాడి దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. దీంతో ధర్మసాగర్ పోలీసులు తాటికాయల గ్రామానికి చేరుకుని దాడిలో పాల్గొన్న కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు. మహిళను చిత్ర హింసలకు గురిచేసిన కుటుంబాన్ని అదుపులోకి తీసుకున్నారు. అలాగే కనిపించకుండా పోయిన రాజు, మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన కాట శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**
ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రిగా ఇటీవల నియమితులైన తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీలు, గనులు మరియు భూగర్భశాస్త్ర శాఖ మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామి గారిని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ గారు, నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సోమాజిగూడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సన్మానించారు.ఽఈ సందర్భంగా మంత్రి గారికి శుభాకాంక్షలు తెలిపిన కాట శ్రీనివాస్ గౌడ్ గారు, పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధి పనులు, ప్రాధాన్యతలపై మంత్రి గారితో చర్చించారు.

## తెలంగాణ సచివాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ను కలిసిన కాట శ్రీనివాస్ గౌడ్.





**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**
తెలంగాణ సచివాలయంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ గారు ఈరోజు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ గారిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలు, మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి గారితో చర్చించారు. మంత్రి గారు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆపరేటర్

**సూర్యాపేట,జూన్28( వెలుతురు):**
హుజూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు శనివారం దాడులు చేశారు. ఈ దాడుల్లో భూ భారతి ఆపరేటర్ ఒక రైతు నుంచి రూ.12 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన తోట రాంబాబు అనే రైతుకు 12 ఎకరాల వారసత్వంగా వచ్చే గుర్తింపు ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీ ఇవ్వడానికి కంప్యూటర్, భూ భారతి డేటా ఎంట్రీ ఆపరేటర్ కర్నాటి విజేతారెడ్డి రూ.20 వేలు లంచంగా డిమాండ్ చేశాడు. ఈ ఒప్పందంలో భాగంగా బాధితుడు శనివారం రూ.12 వేలు ఇస్తుండగా నల్లగొండ ఎసిబి డిఎస్పి జగదీశ్ చందర్ ఆధ్వర్యంలో అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కెమికల్ పరీక్షల అనంతరం నగదును స్వాధీనం చేసుకున్నారు. అవినీతికి పాల్పడ్డ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని నాంపల్లి ఫస్ట్‌క్లాస్ ఎసిబి స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరచనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

## సుల్తానాబాద్‌లో ఎసిబికి చిక్కిన ఇద్దరు ఉద్యోగులు




**పెద్దపల్లి,జూన్28( వెలుతురు):**
సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ ఐ) ఏ .వినోద్, బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఎన్ విజయ్ కుమార్ ఎసిబి వలలో చిక్కుకున్నారు. ఎసిబి డిఎస్పి విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్నకొండ ప్రసాద్ అనే వ్యక్తి రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణం కోసం మున్సిపల్ కార్యాలయంలో అనుమతులు పొందాడు. అయితే, ఇంటినెంబర్ కోసం మే 23వ తేదీ నుండి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఇంటి నెంబర్ కోసం రూ.5 వేలు ఇస్తే ఇంటి నెంబర్ ఇస్తామని ఆర్ఐ, బిల్ కలెక్టర్ స్పష్టం చేశారు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. శనివారం ఐదు వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఆర్ఐ, బిల్ కలెక్టర్‌ను రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేశామని, కోర్టుకు హాజరుపరుస్తామని ఎసిబి డిఎస్పి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సోదాలో ఎసిబి సిఐలు కృష్ణ కుమార్, పున్నం చందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో 30వ తేదీన మినీ జాబ్ మేళా

- జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి రవికృష్ణ

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 28**

జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో జిల్లా నిరుద్యోగ యువత కొరకు ఈ నెల 30 తేదీన ఉదయం 10:30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థ నందు 40 ఫార్మసస్ట్, 20 ట్రైనీ ఫార్మసిస్ట్, 30 ఫార్మా అసిస్టెంట్, 10 రిటైల్ ట్రైనీ అసోసియేట్స్ పోస్టులకు గాను హైదరాబాద్/మంచిర్యాల ప్రాంతాలలో పని చేసేందుకు ఎస్. ఎస్. సి./ఇంటర్/డి. ఫార్మసీ/బి. ఫార్మసీ/డిగ్రీ అర్హత కలిగిన 18 నుండి 35 సంవత్సరాల వయసు గల పురుష అభ్యర్థులు సకాలంలో మినీ జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8247656356, 9121171671, 9110368501 నెంబర్లలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని ఆసక్తి అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# క్రీడా పాఠశాలలో ప్రవేశానికి రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

- జిల్లా యువజన క్రీడాధికారి హనుమంత రెడ్డి

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 28**

ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం కొరకు రాష్ట్రస్థాయి ఎంపికల నిమిత్తం ప్రభుత్వ క్రీడా పాఠశాల హకీంపేట వద్ద నిర్వహించే పోటీలకు జిల్లా విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని జిల్లా యువజన క్రీడా అధికారి హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుండి ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలతో ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల లోపు హకీంపేట క్రీడా పాఠశాలలో హాజరుకావాలని తెలిపారు. జిల్లాలోని జన్నారం మండలానికి చెందిన బోర్లకుంట విష్ణు తేజ, దవులు తన్విత్, వి. అభ్యాస్, జె. రిషి వర్ధన్, అట్టెం శాన్విత శ్రీ, బోర్లకుంట మహిత, బండారి శృతిక, మందమర్రి మండలానికి చెందిన మాయ శ్రీయాన్, మిట్టకొల హన్షిత్, చిత్తారి అక్షయ, వేమనపల్లి మండలానికి చెందిన జి. అంజన్న, జి. నిహారిక, కె. శ్రీజ, ఎం. వర్షిని, బెల్లంపల్లి మండలానికి చెందిన కొట్ల హర్షిత్ సాయి, అర్సం చిన్మయి చిత్రిక, మంచిర్యాల మండలానికి చెందిన షేక్ నయీమ్, దండే శ్రీయాన్సీ, కాసిపేట మండలానికి చెందిన మేడ సహర్షవర్ధన్, కన్నెపల్లి మండలానికి చెందిన జాడీ అక్షర లు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు సకాలంలో హాజరు కావాలని, వివరాలకు 9963539234 నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

# రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝాకు ఉత్కృష్ట సేవా పతకం



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 28**

పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే ఉత్కృష్ట సేవా పతకానికి రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఎంపికైనారు. 2009 ఐపిఎస్., బ్యాచ్ కి చెందిన సీపీ వివిధ హోదాలలో సుదీర్ఘకాలం వృత్తిపరమైన నైపుణ్యంతో విధులు నిర్వర్తించినందుకు గాను ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా కి అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపినారు.

## లైబ్రరీ సైన్స్ లో పిహెచ్ డి సాధించిన కరీంనగర్ వాసి...



**కరీంనగర్ వెలుతురు జూన్ 28:**

కరీంనగర్ పట్టణం సుభాష్ నగర్ కు చెందిన గుండ శ్రీకాంత్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి లైబ్రరీ సైన్స్ లో పి. హెచ్ డి పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం లో ఆర్ కే పవన్ కుమార్ పర్యవేక్షణ లో యూటీలైజేషన్ అఫ్ లైబ్రరీ సైన్సెస్ బై ఫేకల్టీ మెంబర్స్ అండ్ రీసెర్చ్ స్కాలర్స్ ఇన్ ఉస్మానియా యూనివర్సిటీ అండ్ కాకతీయ యూనివర్సిటీ, ఏ కంపారిటివ్ స్టడీ అనే అంశం పై పరిశోధన చేసిన క్రమంలో ఉస్మానియా అధికారులు గత నెలలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు శ్రీకాంత్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ ట్రిపుల్ ఐటి కళాశాల లో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తనకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని సహచర విద్యార్థి న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి అభినందనలు తెలిపారు.

# టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను సన్మానించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

మన్ననూర్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



**వెలుతురు న్యూస్, అచ్చంపేట /అమ్రాబాద్ జూన్ 28:**



శ్రీశైలం మల్లికార్జున స్వామి దైవ దర్శనం అంతరం తిరిగి హైదరాబాద్ వెళ్తున్న టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్ లో అచ్చంపేట ఎమ్మెల్యే కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం మన్ననూర్, ఎల్మపల్లి గ్రామాలలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల లో టీఆర్ఎస్ ప్రస్తుత బి ఆర్ ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు పరిపాలన చేసి ఏ ఒక్క గ్రామంలో కూడా ఒక్క ఇల్లు నిర్మించలేదని, తెలంగాణ ప్రజలను లూటీ చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన లో అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. మన ప్రభుత్వం ప్రక్షాళన చేసి పథకాలను అమలు చేస్తూ ప్రజాపాలన చేస్తుంటే అదే బి ఆర్ ఎస్ పార్టీ వారు దుష్ప్రచారం చేస్తున్నారని అట్టి దుష్ప్రచారాలను మానుకోవాలని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు కాంగ్రెస్ పార్టీకి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థానానికెదగాలి

- హైకోర్టు అడ్వకేట్ ఈపూరి నర్సింహ స్వామి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 28**



మునిపంపుల ఉన్నత పాఠశాల మరియూ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఈపూరి నర్సింహ స్వామి ట్రస్టు ఆద్వర్యంలో తేది: 28-06-2025 శనివారం రోజు 1400 నోటు బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మెన్ ప్రముఖ హైకోర్టు న్యాయవాది నరసింహ స్వామి మాట్లాడుతూ, నేను ఇదే పాఠశాలలో చదువుకొని ఇప్పుడు హైకోర్టు న్యాయవాదిగా ఉన్నత స్థితిలో ఉన్నానని, విద్యార్థులందరూ టెన్త్ క్లాస్ తోనే చదువు ఆపకుండా డిగ్రీ, పీజీలు చదివి ఉన్నత స్థానాల్లో ఉండాలని, డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య , రవ్వా శ్రీహరి మరియు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కూడా ఇక్కడే విద్యనభ్యసించి, ఉన్నత స్థానాలలో ఉన్నారని కొనియాడారు. అందరు విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, కుటుంబానికి, ఊరికి మంచి పేరు తేవాలని, ఎస్ ఎస్ సి లో మంచి రిజల్ట్స్ తేవడంలో కృషి చేసినందుకు, స్టాఫ్ ను అభినందించారు. ఇదే రిజల్ట్స్ ప్రతీసారి తీసుకురావాలని, నేనూ ప్రతీ సంవత్సరం ట్రస్టు ద్వారా పాఠశాలకు సహాయ సహకారాలందిస్తానని తెలిపారు. ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ దొడ్డి స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు నోటుబుక్స్, అందించినందుకు గాను నర్సింహ స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. మా పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా, సహకరించాల్సిందిగా కోరారు. ఈసందర్భంగా పాఠశాల తరపున నర్సింహ స్వామిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ దర్మేందర్, స్టాఫ్ తిరుమల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వసంత, మనోహర్, మంజుల, త్రివేణి ప్రసాద్, మంజుల, సరోజ, కంచి రవి, కృష్ణయ్య, రాకేశ్, అమరయ్య, గణేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థుల కొరకు మౌళిక సదుపాయాల కల్పన

రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 28**


ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. సులేమాన్, టి.జి.ఎం.ఐ.డి.సి. ఈ.ఈ. నరసింహరావు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని, త్వరలో విద్యాబోధన కొరకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు ఒప్పంద పద్ధతిన ఇతర పోస్టులలో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్న పోస్టులను అవసరం ఉన్న మేరకు భర్తీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో తలపెట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల, మాతా-శిశు కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్మాణం కొనసాగుతున్న మాతా-శిశు ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి వార్డులు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శులకు గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై శిక్షణ

**- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 28**





ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ, డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సమాచార హక్కు-గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ భాగస్వామ్యంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంచిర్యాల శిక్షణ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు 2 రోజులు శిక్షణ ఇవ్వడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు తెలిపారు. మెరుగైన స్థానిక పాలన కోసం, సమాచార హక్కు చట్టం, స్వచ్ఛందంగా సమాచారం వెల్లడించడం ద్వారా పారదర్శకత, గ్రామసభ బలోపేతం, మహిళా-స్నేహ పూర్వక గ్రామ పంచాయతీలను ప్రోత్సహించడం, మహిళా సాధికారత, బాలల సంరక్షణకు సంబంధిత ముఖ్యమై చట్టాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. 2 రోజుల శిక్షణలో సమాచార హక్కు చట్టం-2005, పంచాయతీ కార్యదర్శి పాత్ర, మహిళా గ్రామసభలు, మహిళా ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవలసిన చర్యలు వంటి పలు అంశాలపై వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రీసోర్స్ పర్సన్స్ ఎండి. అజ్మత్ అలీ, వి.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, ఎస్.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన రామన్నపేట ఎంఈఓ గవ్వ.జ్యోతి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 28**



మండల ఎంఈఓ గవ్వ.జ్యోతి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను, పరిశీలించినారు. అనంతరం పాఠశాల హెడ్మాస్టర్ తో మిడ్ డే మీల్స్ వివరాలను నూతన అడ్మిషన్ వివరాలను,అడిగి తెలుసుకున్నారు. దుబ్బాక ప్రాంగణంలో ఉన్న పౌల్ట్రీ ఫార్మ్ సందర్శించి అక్కడ ఉన్న తల్లిదండ్రులతో మాట్లాడి 11 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల దుబ్బాకలో చేర్పించినారు. అనంతరం దుబ్బాక జెడ్పిహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మీటింగ్ కండక్ట్ చేసి, విద్యార్థుల సంఖ్యను పెంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సమయపాలన తప్పకుండా పాటించాలని తెలిపినారు.

## అనారోగ్యంతో మరణించిన మల్లేష్ కుటుంబానికి సిపిఎం ఆర్థిక సహకారం



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 28**

సిరిపురం గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతి పరుడు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకుడు బొడ్డుపల్లి మల్లేష్ అనారోగ్యంతో మరణించగా సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో కుటుంబానికి రూ.20,000/- ఆర్థిక సహకారం చేసి అండగా నిలిచింది. పేద కుటుంబామైన మల్లేష్ చిన్న వయసులోనే మరణించడం విచారకరమణి కుటుంబానికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యుడు బల్గురి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, రాపోలు ప్రభాకర్ నాయకులు దోమలపల్లి నర్సింహా,కంకల శేఖర్, కునూరు గణేష్,మోటే స్వామి,సిలువేరు రాజు,గుంజే సైదులు,వర్కాల నాగరాజు,సిలువేరు వెంకటయ్య, మొగిలి ముత్యాలు,బొడ్డుపల్లి రాము, శివరాత్రి సదానందం తదితరులు పాల్గొన్నారు.

## కరోనా సమయంలో వెంకటేష్ అందించిన సేవలు మరువలేనివి

- వెంకటేష్ ఆత్మీయ సత్కార సభ లో మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, పలువురు ప్రముఖులు



**వెలుతురు, చారకొండ జూన్ 28 :**

కరోనా సమయంలో గ్రామ ప్రజలకు వెంకటేష్ అందించిన సేవలు మరు వలేనివని జేపల్లి గ్రామ మాజీ స ర్పంచ్ రవీందర్ రెడ్డి అన్నారు. విశ్వ ఆర్ట్స్, మన కళాక్షేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల సేవా ఐకాన్ అవార్డు అందుకున్న ప్రముఖ సమాజసేవకులు, మాజీ వార్డు సభ్యులు వెలిజాల వెంకటేష్ కు ఆత్మీయ సత్కార సభ శుక్రవారం మండలం లోని జేపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివా స్ రావు...గ్రామయువత, గ్రామస్థు లతో కలిసి వెంకటేష్ ను ఘనంగా సత్కరించి, ప్రసంగించారు. కరోనా సమయంలో, వార్డు సభ్యుడి హ యాంలో గ్రామ పంచాయతీ ప్రజ లకు వెంకటేష్ ఎంతో సేవలు అం దించారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి సత్కరించడం అ భినందనీయం అని, ఆయన భవి ష్యత్తులో మరెన్నో సత్కారాలు పు రస్కారాలు పొందాలని వారు ఆ కాంక్షించారు. అంతకు ముందు గ్రామపెద్దలతో కలిసి వెంకటేష్.. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని పూలమాల వేశారు. తనకు అవార్డు వచ్చిన సందర్భంగా ఆత్మీయ సత్కార సభా ఏర్పాటు చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని, ఈ కార్యక్రమాన్ని ఏర్పా టు చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మాజీ వార్డు సభ్యులు జైపాల్ నాయక్, మున్నా నాయక్,ముని రామ్ రాథోడ్, వెంకటయ్య, సీతారాములు, రమేష్, వెంకటేష్, పరుశురాం, ప్రశాంత్, గ్రామస్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ఏ ఈ ఓ ల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేత

**మునుగోడు, జూన్ 28 (వెలుతురు):**



రాష్ట్రంలోని ఏఈఓ ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డికి గ్రాడ్యుయేట్ ఏ ఈ ఓ ల రాష్ట్ర అధ్యక్షుడు పాలకూరి యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా రైతు వేదికల నిర్వహణకు ఎలాంటి నిధులు రాకుండా ఏ ఈ ఓ లే సొంత డబ్బులు ఖర్చు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రైతు వేదికలో ఒక అటెండర్ ని కేటాయించాలని,రైతు వేదికల ద్వారా ఎరువులను,విత్తనాలను రైతులకు పంపిణీ చేయాలని,అర్హత కలిగిన 700 మంది గ్రాడ్యుయేట్ ఏఈఓ లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న రైతు వేదికలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు వహీద్,నిఖిల్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లికుదురులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి : సిపిఎం.

**నెల్లికుదురు, వెలుతురు జూన్ 28:**



మానుకోట జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని పీహెచ్సీలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఇక్కడ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. డయాలసిస్ బాధితులు నెల్లికుదురు తోపాటు ఇనుగుర్తి, తొర్రూరు, నరసింహన్నపేట, దంతాలపల్లి, కేసముద్రం మండలాలలో అధిక సంఖ్యలో ఉన్నందున వీరు జిల్లా కేంద్రం అనుకూటకు,హైదరాబాద్ కు వెల్లడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సంబంధిత మండలాలకు నెల్లికుదురు సమీపంగా ఉంటుందని ఇక్కడ డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బాధితులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఇందుకోసం ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్,డి ఎం అండ్ హెచ్ ఓ సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఆలస్యం చేయకుండా డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసేలా కృషి చేయాలని ఆయన కోరారు.

## ఆల్ ఇండియా జూనియర్ చెస్ పోటీల పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్....





**కరీంనగర్ వెలుతురు జూన్ 28:**
కరీంనగర్ వేదికగా జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జూలై 12, 13 తేదీల్లో జరుగనున్న 3వ ఆల్ ఇండియా జూనియర్ చెస్ పోటీలకు సంబంధించిన పోస్టర్ ను శనివారం రోజున జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు చిన్నారుల మేదస్సు కు పదను పెట్టే క్రీడ చదరంగం అని అన్నారు. చెస్ క్రీడల్లో రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. కరీంనగర్ లో జరగనున్న ఆల్ ఇండియా పోటీలను అట్టహాసంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. మూడవ సారి ఆల్ ఇండియా చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ కు జీనియస్ చెస్ అకాడమీ కోచ్, డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ వివరించారు. పోటీలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, జిల్లా క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి కాళీ చరణ్, భరద్వాజ్, సాగర్, తదితరులుపాల్గొన్నారు.

## కలెక్టర్ గారూ.! 100% దివ్యాంగునికి ఇల్లు ఇవ్వండి.

- ఎంపీ రవిచంద్ర.



**ఇనుగుర్తి జూన్ 28,వెలుతురు:**
నిరుపేద దివ్యాంగునికి ఇంటి జాగ, ఇల్లు కేటాయించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను కోరుతూ సిఫారసు లెటర్ రాశారు. మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన చెడుపాక లక్ష్మయ్య నిరుపేద,100% దివ్యాంగుడైన దళితుడు. ఈయనకు భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు.ఉండటానికి ఇల్లు లేదు. శనివారం ఇనుగుర్తిలో లక్ష్మయ్య తన గోడును ఎంపి రవిచంద్రకు మొరపెట్టుకున్నారు.దీంతో చలించిన రవిచంద్ర తక్షణమే ఇంటి జాగా కేటాయిస్తూ.. ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని కలెక్టర్ ను లెటర్ ద్వారా కోరారు.

## ఇనుగుర్తిలో బాధిత కుటుంబాలకు..

- ఎంపి వద్దిరాజు రవిచంద్ర పరామర్శ..





**ఇనుగుర్తి, జూన్ 28,వెలుతురు:**
మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో ఇటీవల కన్నుమూసిన పలు బాధిత కుటుంబాలను రాజ్యసభ సభ్యులు(ఎంపీ) వద్దిరాజు రవిచంద్ర శనివారం పరామర్శించారు. స్వర్గీయులు హనుమాండ్ల సోమిరెడ్డి,చాగంటి లక్ష్మి, కళాకారుని సట్ల అంజలి,నెమలి కండ్ల పుల్లమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. వీరి అకాల కన్నుమూత కలచి వేస్తోందని విచారం వ్యక్తం చేశారు.ఆపద సమయంలోనూ ధైర్యాన్ని కోల్పోవద్దని సంబంధిత కుటుంబాల కు సూచించారు.అధైర్య పడవద్దని అండగా ఉంటామని ఎంపీ భరోసా ఇచ్చారు. రవిచంద్ర సోదరులు బిఆర్ఎస్ రాష్ట్ర నేత వద్దిరాజు కిషన్,పిఎసిఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న గౌడ్,సీనియర్ ఎక్సైజ్ కానిస్టేబుల్ వద్దిరాజు వెంకన్న,నాయకులు మహేందర్ రెడ్డి,రామ్మూర్తి, పింగిలి శ్రీనివాస్,బాబురావు,శ్రీనివాస్ రెడ్డి,చంద్రయ్య,నాగయ్య గౌడ్,రవి,భోజ్యా నాయక్, తదితరులు ఎంపీ వెంట ఉన్నారు.

# నిరంతరం అప్రమత్తంగా వుండాలి

- **విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు**
- **కేసులలో పరిశోధన పారదర్శకంగా ఉండాలి**
- **పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపిఎస్.,**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 28**

శాంతి భద్రతల,నేరాల నియంత్రణ విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నిరంతరం 24/7 నిరంతరం అధికారులు, సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా వుండాలని రామగుండం పోలీస్ కమిషనర్



అంబర్ కిషోర్ ఝా, IPS పోలీస్ అధికారులకు సూచించారు. నెలవారి సమీక్షాలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈరోజు కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపి లు, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్, డివిజన్, జోన్లవారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల



సేకరణ, చార్జ్షీట్కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోద్కైన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతో పాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని మొదల్కైన అంశాలపై పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్షా జరిపారు. అదేవిదంగా నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించడంతో పాటు, అధికారులతో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ....కేసుల దర్యాప్తులో విషయంలో అధికారులు ప్రస్తుతం అందుబాటులో వున్న టెక్నాలజీతో పాటు, శాస్త్రీయ పద్ధతిను కూడా అనుసరిస్తూ ప్రయత్నం దర్యాప్తు చేపట్టాలని, అలాగే కేసు నమోదయిన వారం రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని స్టేషన్ అధికారులు ప్రతి రోజు ఒక గంట పాటు పెండింగ్ కేసులను సమీక్షా జరపాలని,పెండింగ్ లో వున్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రధానంగా మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయడంతో పాటు, నిందితులకు కోర్టులో శిక్షలు పడేవిధంగా తగు సాక్ష్యాధారాలను కోర్టుకు అందజేయాల్సిందిగా అలాగే మహిళలు, బాలికల మిస్సింగ్ కేసుల్లో అధికారులు వేగం స్పందించాలని, రౌడీషీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించడంతో పాటు వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహిరంచాలని, దొంగతనాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుంటూ, విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ విభాగంతో కల్సి పనిచేయాలని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు గల కారణాలపై విశ్లేషణ చేసి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని పోలీస్ అధికారుల పనితీరుపైనే రామగుండము పోలీస్ కమిషనరేట్ కీర్తి ప్రతిష్టలు ఆధారపడి వుంటాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. బెల్లంపల్లి పట్టణం లోని కాల్టెక్స్ ఏరియాలోని ఏటీఎం దొంగతనానికి యత్నం చేసిన దొంగలని చాకచక్యంగా పట్టుకొన్న నేన్నాల్ ఎస్ఐ ప్రసాద్, బ్లూ క్లోట్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్ సాయి, హోం గార్డ్ సంపత్ లను సిపి కాష్ రివార్డ్ అందించి అబినందనలు తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి ఎ .భాస్కర్ ఐపిఎస్., పెద్దపల్లి డిసిపి కరుణాకర్, అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, కమీషనరేట్ పరిది ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు సీఐ లు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐ లు సిసి హరీష్ పాల్గొన్నారు.

# కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం లోపాయి కారి ఒప్పందాలు...

- **బిజెపిని అడ్డుకోవడానికి ఆ మూడు పార్టీలు ఒకటయ్యాయి...**
- **మున్సిపల్ కార్పొరేషన్ ముసాయిదా, హద్దుల మార్పులు చేర్పులు వారికి అనుకూలంగా మార్చుకున్నారు..**
- **బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు....**

**కరీంనగర్ వెలుతురు జూన్ 28:**
జరగబోయే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్ , ఎంఐఎం పార్టీలు ఒకటయ్యాయని, లోపాయి కారి ఒప్పందాలతో వ్యవహారాలు చేస్తున్నారని , నగర ప్రజానీకమంతా ఈ విషయంలో ఆలోచించాలని బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. శనివారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ లో బిజెపి కున్న విశేష ప్రజాదరణ నేడు కాంగ్రెస్, బి ఆర్ ఎస్ , ఎంఐఎంలకు మింగుడు పడడం లేదన్నారు. అందుకే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని డివిజన్ల ముసాయిదా, హద్దులలో మార్పులు చేర్పులు ఆయా పార్టీలకు అనుకూలంగా చేపట్టారని ఆయన ఆరోపించారు. బిజెపిని అడ్డుకోవడానికి ఆ మూడు పార్టీలు అనేక కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నాయని ఆయన ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ , బి ఆర్ ఎస్ లకు బిజెపిని ఎదుర్కొనే దమ్ము లేక ఎంఐఎంతో జతకట్టి ,కరీంనగర్ మేయర్ పీఠాన్ని ఎంఐఎం కు కట్టబెట్టాలనే



పెద్ద కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రధానంగా గత అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో 70 నుంచి 80% ఓట్లు బిజెపికి రావడం హిందూ సమాజమంతా ఏకతాటిపై నిలబడాన్ని ప్రత్యక్ష పార్టీలు తట్టుకోలేకపోతున్నాయనన్నారు. ప్రధానంగా కరీంనగర్ మున్సిపల్ ముసాయిదా మార్పుల చేర్పుల తో
ఎంఐఎం కొన్ని స్థానాలు టిఆర్ఎస్ కాంగ్రెస్ కొన్ని స్థానాలు గెలిచి ఎంఐఎం నాయకుడికి మేయర్ కూర్చుని అప్పగించాలనే పెద్ద కుట్ర కు తెర లేపాయన్నారు. మెజారిటీ ప్రజలున్న హిందువులంతా ఈ విషయంలో సీరియస్గా ఆలోచించాలన్నారు.అధర్మంతో అక్రమాలతో.. చాట్ మటుగా జట్టు కట్టి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను ఎలాగైనా కైవసం చేసుకోవాలని ఆ మూడు పార్టీలు ప్రయత్నిస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కి నగరంలో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఆ మూడు పార్టీలు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయనన్నారు.నగర హిందూ ప్రజలంతా ఒక్కసారి ఆలోచించాలని, కరీంనగర్ భవిష్యత్తుప్రగతి కచ్చితంగా ప్రజల నిర్ణయంతోనే ఆధారపడి ముడిపడి ఉంటుందని తెలిపారు.
ఆ మూడు పార్టీల కుట్రలను గమనించాలని, ధర్మ మార్గంలో నడిచే బిజెపి కి అండగా నిలవాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ తగిలే అవకాశం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం చేయించుకున్న సర్వేలో టిఆర్ఎస్కు, కాంగ్రెస్కు సీట్లు రావడం లేదని, బిజెపికే ఎక్కువ స్థానాలు వస్తాయని వాళ్లకు నివేదిక అందిందన్నారు. అందుకనే రాత్రికి రాత్రి ఎంఐఎం పెద్దలు కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకున్నారనీ, ఎందుకు బి ఆర్ ఎస్ నాయకులు కూడా సంపూర్ణ సహకారాన్ని రాత్రికి రాత్రి అందించారనీ తెలిపారు.ఎంఐఎం కుట్రలకు,బీఆర్ఎస్ కుతంత్రాలకు.. కాంగ్రెస్ క్రూర నిర్ణయాలకు ప్రజలు తగిన బుద్ధి , గుణపాఠంచెప్పాలని పేర్కొన్నారు.
కరీంనగర్ బల్దియా ఆ మూడు పార్టీల కబంధ హస్తాల్లో చిక్కకుండా రక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# అమృత్ స్కీమ్ కింద తాగునీరు పైప్‌లైన్ పనులు

- **రూ.5,350 కోట్ల విలువైన పనులకు టెండర్లు ఆహ్వానం**
- **వీలైనంత త్వరగా లబ్దిదారులకు టిడ్కో ఇళ్లు**
- **మున్సిపల్ శాఖపై సమీక్షలో సిఎం చంద్రబాబు**

**అమరావతి,జూన్28( వెలుతురు):**

అమృత్ స్కీమ్ కింద తాగునీరు పైప్లైన్ పనులకు టెండర్లు పిలిచామని సీఎం చంద్రబాబు తెలిపారు.వారంలో రూ.5,350 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలుస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు, విశాఖపట్నంలో చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్, పురపాలక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉండవల్లి నివాసంలో సమీక్షకు మంత్రి నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. నెల్లూరు, రాజమండ్రి ప్లాంట్లకు టెండర్లు పూర్తి అయ్యాయని చెప్పారు. కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ఎ÷-లాంట్లకు త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు. మున్సిపాలిటీల్లో ఆధునిక యంత్రాల కొనుగోలుకు రూ.225 కోట్లు కేటాయించామని తెలిపారు. వీలైనంత త్వరగా లబ్దిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మున్సిపల్ శాఖలో అనేక అంశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ సమావేశానికి



సంబంధించిన వివరాలను మీడియాకు మంత్రి నారాయణ తెలిపారు. టిడ్కో ఇళ్లను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం 2014 నుంచి 2019 మధ్య కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక నిధులను తీసుకువచ్చామని వెల్లడించారు మంత్రి నారాయణ. రూ.5800 కోట్లు నిధులు, రూ.3000 కోట్ల స్వచ్ఛభారత్ నిధులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిందని మంత్రి నారాయణ గుర్తుచేశారు. గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో మధ్యలోనే నిధులు నిలిచిపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులను పరిష్కరించి కేంద్రప్రభుత్వం నుంచి మళ్లీ నిధులు తీసుకువస్తున్నామని వివరించారు. అమృత్ స్కీమ్ ద్వారా తాగునీరు పైప్లైన్ పనుల కోసం నిన్ననే టెండర్లు పిలిచామని స్పష్టం చేశారు. ఈ పనులు పూర్తయితే 85 శాతం ప్రతి ఇంటికీ నేరుగా నదులు, కాలువల ద్వారా నీరు అందుతోందని అన్నారు. ంఎః నుంచి రూ.5350 కోట్లకు సంబంధించిన పనులకు వారం రోజుల్లో టెండర్లు పిలుస్తామని తెలిపారు మంత్రి నారాయణ. యా నిధులకు రాష్ట్ర వాటా ఇచ్చేలా ఆర్థిక శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. శుద్ధి చేసిన నీటిని డ్రైన్లలోకి వదిలేలా 2029లోగా వందశాతం ÷ఖలు నిర్మిస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం వదిలేసిన లెగసీ వేస్ట్‌ను అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిగా తొలగిస్తామని చెప్పుకొచ్చారు. 2014 నుంచి 2019 మధ్యలో 10 వేస్ట్ టు ఎనర్జీ ఎ÷-లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. ప్రస్తుతం గుంటూరు, విశాఖపట్నం ప్లాంట్‌లలో 2800 టన్నుల చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తున్నారని మంత్రి నారాయణ చెప్పారు. నెల్లూరు, రాజమండ్రిప్లాంట్‌లకు టెండర్లు పూర్తి అయ్యాయని మంత్రి నారాయణ వెల్లడించారు. కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతిలో ఎ÷-లాంట్‌ల ఏర్పాటుకు త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు. ఈ ఎ÷-లాంట్‌లు పూర్తయితే 7500 టన్నుల చెత్తని ప్రతిరోజూ విద్యుత్ తయారీకి పంపిస్తున్నామని తెలిపారు. మిగిలిన 500 టన్నుల చెత్తను వివిధ రూపాల్లో సేకరిస్తామని చెప్పారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ కోసం కంపాక్టర్లు, స్వీపింగ్ మెషీన్ల కొనుగోలు కోసం రూ.225 కోట్లు కేటాయించామని ప్రకటించారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం 2014-19 మధ్య కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామని గుర్తు చేశారు. రూ.5,800 కోట్ల ఏఐఐబీ నిధులు, రూ.300 కోట్ల స్వచ్ఛభారత్ నిధులకు ఆమోదం వచ్చిందని వెల్లడించారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో మధ్యలోనే నిధులు నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సమస్యలు పరిష్కరించి మళ్లీ నిధులు తీసుకొస్తున్నామన్నారు. అమృత్ స్కీమ్ ద్వారా తాగునీటి పైప్‌లైన్ పనుల కోసం నిన్న టెండర్లు పిలిచామని తెలిపారు.

## విద్యార్థి దత్తత గొప్ప కార్యక్రమం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కితాబు

**జగిత్యాల,జూన్28( వెలుతురు):**
పేద విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గొల్లపల్లి గణేష్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి విద్యార్థి దత్తత కార్యక్రమాన్ని చేపట్టారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ధర్మపురి పట్టణంలో శనివారం విద్యార్థి దత్తత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా



హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక విద్యాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాములు, స్థానిక ప్రధానోపాధ్యాయులు కొలిచాల శ్రీనివాస్, గాదె శ్రీనివాస్, పెండ్యాల మహేందర్, ఎంఈఓ సీతాలక్ష్మి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సుపై చంద్రబాబు సమీక్ష

**- ఆక్యుపెన్సీకి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశం**



**అమరావతి, జూన్28( వెలుతురు):**
సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళా శక్తి పేరిట ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం హామీపై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం ఉండవల్లిలోని తన నివాసంలో మహిళలకు ఉచిత బస్సు పథకంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. ఈ పథకం అమలు చేయడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఆక్యుపెన్సీకి తగ్గట్లుగా బస్సులు నడిపించాలని సూచించారు. తమ ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15వ తేదీ నుంచే ఈ పథకం అమలు చేయాలని తెలిపారు. ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ, ఏసీ బస్సులే ఉండాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## నకిలీ ఈ-స్టాంపుల స్కామ్‌లో ముగ్గురిపై కేసు నమోదు

**అనంతపురం, జూన్28( వెలుతురు):**
కళ్యాణదుర్గంలో వెలుగుచూసిన నకిలీ ఈ-స్టాంపుల స్కామ్‌లో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కళ్యాణదుర్గంలో బోయ ఎర్రప్ప నకిలీ ఈ-స్టాంపులు తయారు చేసి విక్రయించాడని ఎస్పీ తెలిపారు. 'నకిలీ ఈ-స్టాంపులు విక్రయించి మోసం చేశారని ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ ఏజీఎం సతీష్ బాబు ఫిర్యాదు మేరకు బోయ ఎర్రప్ప, మోహన్‌బాబు, భువనేశ్వర్‌లను అదుపులోకి తీసుకున్నాం. మీసేవ నిర్వహకుడు బోయ ఎర్రప్ప రెండేళ్లుగా 15, 413 స్టాంపులు విక్రయిండు. వీటిలో ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు 438 ఈ-స్టాంపులు ఇచ్చాడు. ఈ-స్టాంపుల కోసం బోయ ఎర్రప్ప బ్యాంకు ఖాతాకు ఎస్ఆర్ ఇన్‌ఫ్రా రూ.32 లక్షలు బదిలీ చేయగా, అందులో రూ.25.48 లక్షలు కాజేసి.. ఆ మొత్తానికి నకిలీ ఈ-స్టాంపులు ఇచ్చాడు' అని ఎస్పీ తెలిపారు.

## మంత్రి అడ్లూరికి తప్పిన ప్రమాదం



**ధర్మపురి, జూన్28( వెలుతురు):**
రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ మైనార్టీ,వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కారు ప్రమాదానికి గురైంది. ఆయన ప్రయాణిస్తున్న కారును మరో కారు ఢీకొట్టింది. దీంతో మంత్రి కారు టైరు ఊడిపోయింది. శనివారం సాయంత్రం మెట్‌పల్లి నుంచి ధర్మపురి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో మంత్రితో పాటు ఎవ్వరికీ ఏమీ కాలేదని తెలుస్తోంది. ఇక, తన కారు టైరు ఊడిపోవంటంతో కార్యకర్త కారులో మంత్రి వెళ్లిపోయారు. ఇదిలావుంటే మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కౌంటర్ ఇచ్చారు. 'నిరుద్యోగులకు బీఆర్ఎస్ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో హరీష్ చెప్పగలరా. బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా. ఒక్క ఉద్యోగికి అయినా.. కేసీఆర్ నియామక పత్రం అందించారా. ప్రజలను డైవర్ట్ చేసేలా హరీష్ మాట్లాడుతున్నారు. నిరుద్యోగులను ఏడిపించింది మీరు కాదా. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బీఆర్ఎస్ పాడు చేసింది. కాంగ్రెస్ పాలనను చూసి ఓర్వలేక పోతున్నావా. నిరుద్యోగుల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు లేదు. మీ మనుగడ కోసమే ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు' అని అన్నారు.

## చంద్రబాబు రీకాల్ కార్యక్రమం హాస్యాస్పదం

**- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి వాసంశెట్టి సుభాష్**




**కోనసీమ, జూన్28( వెలుతురు):**
రీకాలింగ్ చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో పేరిట వైసీపీ కార్యక్రమం నిర్వహించడం అత్యంత హాస్యాస్పదమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేధం, వికలాంగుల పింఛన్ల పెంపు, ప్రత్యేక హోదా, 30 లక్షల ఇళ్ళ నిర్మాణం వంటి హామీలు అమలు చేయలేదన్నారు. జగన్ (ఈనీసపఏస అఓ జా ఏజీణజీని) ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సర్వ నాశనం చేశారని మండిపడ్డారు. కమిషన్‌ల కోసం అమర్‌రాజా, కియా వంటి కంపెనీలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారు జగన్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని లేని రాష్ట్రం చేశారన్నారు. నా ఎస్సీ, నా బీసీ, నా ఎస్టీలు అంటూ వారికి ఒక రుణం కూడా మంజూరు చేయలేదని విమర్శలు గుప్పించారు. ఎస్సీలకు సంబంధించి 26 పథకాలను రద్దు చేసింది జగన్ ప్రభుత్వం అంటూ విరుచుకుపడ్డారు. అనేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి రాజకీయ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారు గానీ ఒక్క పైసా కూడా కార్పొరేషన్‌లకు వేయలేదన్నారు. ప్రజలు జగన్‌ను విశ్వసించలేదని.. అందుకే 11 సీట్లకు పరిమితం చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు జగన్‌ను అంత దారుణంగా చీదరించుకున్నా బుద్ధిలేకుండా రీకాలింగ్ చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో పేరిట వైసీపీ కార్యక్రమం చేపట్టడం దారుణమంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ వాళ్ళ పరిస్థితి నూతిలో కప్పల మాదిరిగా ఉందని మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యలు చేశారు.


# గిగ్ వర్కర్ల కోసం బోర్డు ఏర్పాటు యోచన

- ఉత్తమ పాలసీ ద్వారా వారికి రక్షణ
- కార్మికశాఖ మంత్రి వివేక్ వెల్లడి





**హైదరాబాద్, జూన్28( వెలుతురు):**
రాష్ట్రంలో గిగ్ వర్కర్లకు ఉత్తమ పాలసీని తీసుకొస్తామని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. తెలంగాణ గిగ్ వర్కర్ పాలసీ దేశానికే రోల్ మోడల్ అయ్యేలా చూస్తామని ఆయన తెలిపారు. త్వరలోనే గిగ్ వర్కర్లకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బోర్డును ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తోందని ఆయన అన్నారు. రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటికే గిగ్ వర్కర్లకు ప్రత్యేకంగా ఓ చట్టాన్ని రూపొందించారని ఆయన గుర్తు చేశారు. త్వరలో తెలంగాణలో కూడా అదే చేయబోతున్నాయని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. శుక్రవా రం గి గ్ వర్కర్ల సమస్యలపై సంబంధిత అధికారులతో సచివాలయంలో మంత్రి వివేక్ సమీక్ష స మావేశం నిర్వహించారు. గిగ్ వర్కర్ల సమస్యలు, వారి నుంచి వచ్చిన సూచనల గురించి అధికారులతో మంత్రి చర్చించారు. అనంతరం ఆయన మీ డియాతో మాట్లాడుతూ గిగ్ కార్మికులు చాలా స మస్యలు ఎదుర్కొంటున్నారని వాళ్లకు హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో గిగ్ వర్కర్లకు రిజిస్ట్రేషన్ సిస్టమ్‌ను తీసుకొస్తామని ఆయన చెప్పారు. యాజమాన్యాలు, గిగ్ వర్కర్ల నుంచి 66 సూచనలు, సలహాలు వచ్చాయని వాటిపై చర్చించి ఎలాంటి సాయం చేయాలన్న దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి వివేక్ పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ భారత్ సమ్మిట్‌లో మాట్లాడారని అలాగే గిగ్ వర్కర్లకు న్యాయం చేయాలని సూచించారని ఆయన తెలిపారు. గిగ్ వర్కర్ల సమస్యలపై కేబినెట్‌లో చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే గిగ్ వర్కర్లతో మాట్లాడారని మంత్రి వివేక్ గుర్తు చేశారు. గిగ్ వర్కర్ల పాలసీపై కేబినెట్‌లో చర్చించి అసెంబ్లీలో చట్టం తీసుకొస్తామని ఆయన తెలిపారు. గిగ్ వర్కర్లకు కనీస వేతనం వచ్చేలా కృషి చేస్తామని మంత్రి వివేక్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నాలుగున్నర లక్షల గిగ్ వర్కర్లు ఉన్నారని, కొత్త యాక్ట్ వాళ్లకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త యాక్ట్‌లో భాగంగా 2 శాతం సెస్ వినియోగదారులు లేదా కంపెనీ యాజమాన్యం భరించాలన్న ప్రతిపాదనను బిల్లులో పొందుపరుస్తామని మంత్రి వివేక్ పేర్కొన్నారు.

## కమలం ఎందుకో సైలెంట్



**విజయవాడ, జూన్28( వెలుతురు):**
వైసీపీ అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలపై కూటమి పార్టీలోని రెండు పార్టీలే ఎక్కువగా స్పందిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ ఎటూ అందులో ముందుంటుంది. ఇక జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కూడా జగన్ వ్యాఖ్యలకు గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. కానీ మూడో మిత్రపక్షమైన భారతీయ జనతా పార్టీ మాత్రం జగన్ విషయంలో ఎందుకో మౌనంగా ఉన్నట్లు కనిపిస్తుంది. జగన్ చేసే విమర్శలను తిప్పికొట్టడానికి బీజేపీ నేతలు ఎవరూ పెద్దగా ముందుకు రావడం లేదు. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి నేతలు ఎవరూ జగన్ పై విమర్శలు చేయకపోవడం ఇప్పుడు ఏపీ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారిందంటున్నారు. కనీసం రాష్ట్రంలో బీజేపీ లో ఉన్న జగన్ వ్యతిరేక నేతలు కూడా పెదవి విప్పడం లేదు. ధాని నరేంద్ర మోదీ నుంచి మొదలు పెడితే కేంద్ర మంత్రులు రాష్ట్రానికి వచ్చినా జగన్ ప్రస్తావన తేవడం లేదంటున్నారు తెలుగు తమ్ముళ్లు. గతంలో రాష్ట్రానికి వస్తే మోదీ, నిర్మాలా సీతారామన్, అమిత్ షా వంటి వారు వచ్చినప్పుడు చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా విమర్శలు చేసే వారని, కానీ నేడు కేంద్ర మంత్రులు సయితం జగన్ పేరు ప్రస్తావించకపోవడం ఎక్కడో డౌట్ కొడుతుందని అంటున్నారు. రాజధాని అమరావతి పనుల రీలాంచ్ కు వచ్చిన సందర్భంలోనూ ప్రధాని నరేంద్ర మోదీ జగన్ పేరును తన ప్రసంగంలో చోటు ఇవ్వలేదు. ఇక జగన్ కు బీజేపీలో వ్యతిరేకులు రాష్ట్రంలో చాలా మంది నేతలున్నారు. పురంద్రీశ్వరి, సుజనా చౌదరి, సీఎం రమేష్ వంటి వారు కూడా మౌనంగా ఉన్నారు.. వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ఇటీవల పొదిలి, రెంటపాళ్ల పర్యటనల్లో అపశృతి జరిగింది. పొదిలిలో వైసీపీ కార్యకర్తలు పోలీసులపై రాళ్లు రువ్వారంటూ కేసు నమోదయింది. అలాగే రెంటపాళ్ల పర్యటనలో జగన్ వాహనం కింద పడి సింగయ్య అనే వ్యక్తి మృతి చెందినట్లు మరో కేసు నమోదయింది. అయినా సరే టీడీపీ, జనసేన నేతలు మినహాయించి బీజేపీ నేతల నుంచి రియక్షన్ పెద్దగా రాకపోవడం తెలుగుదేశం పార్టీలో చర్చనీయాంశమైంది. టీడీపీ సోషల్ మీడియాలో కూడా పలువురు సైకిల్ పార్టీ అభిమానులు ఇదే అనుమానాలను ప్రశ్నిస్తున్నారు. జగన్ పట్ల అంత సాఫ్ట్ కార్నర్ కమలం పార్టీకి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలతో అధినాయకత్వాన్ని నిలదీస్తున్నారు. జగన్ పర్యటనలకు వస్తున్న ప్రజా స్పందనతో కేంద్ర ఇంటలిజన్స్ నివేదికలు ఏమైనా బీజేపీకి అందాయా? అన్న అనుమానాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర పార్టీ నుంచి ఆదేశాలు ఏమైనా వచ్చాయా? అని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై దారుణమైన విమర్శలు చేస్తున్నప్పటికీ కమలం పార్టీ నేతలు కామ్ గా ఎందుకుంటున్నారని? ఇదేదో లోపాయికారీ ఒప్పందంలా తమకు అనిపిస్తుందని కొందరు టీడీపీ సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. అదే నిజమయితే కూటమికి భవిష్యత్ లో ఇబ్బందులు ఎదురు కాక తప్పదన్న విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి. ఎన్నికలకు ముందు విమర్శలుచేసిన వారు ఇప్పుడు చేయకపోవడాన్ని చాలా మంది సోషల్ మీడియా హ్యాండిల్స్ లో గుర్తు చేస్తున్నారు.

# అధికార పార్టీకి అనుకూలంగా నియోజకవర్గాలు...



**విశాఖపట్టణం, జూన్28( వెలుతురు):**
ఏపీలో నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది జనగణన ప్రారంభం కానుంది. దాంట్లోనే కుల గణన కూడా ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. దీంతో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్రం దృష్టి పెట్టే అవకాశం ఉంది. సాధారణంగా అధికార పార్టీ తమకు అనుకూలంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడంలో కొంతవరకు సక్సెస్ అవుతుంది. ప్రస్తుతం ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామి కావడంతో కూటమికి అనుకూలంగా పునర్విభజన జరుగుతుందన్న టాక్ నడుస్తోంది. 2009లో చివరిసారిగా నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పునర్విభజన జరిగినట్లు వార్తలు వచ్చాయి. 2009లో రెండోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పునర్విభజన దోహద పడిందన్న టాక్ నడిచింది. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. అప్పట్లో నవ్యాంధ్రప్రదేశ్లో నియోజకవర్గాల పునర్విభజన చేపడతామని విభజన హామీల్లో సైతం పొందుపరిచారు. అయితే జనగణనతో పాటు కుల గణన జరగకపోవడంతో నియోజకవర్గాల పునర్విభజన చేయలేకపోయారు. వాస్తవానికి 2011లో జనగణన జరిగింది. సరిగ్గా పదేళ్లకు అంటే 2021లో జనగణన జరగాల్సి ఉంది. కానీ కరోనా కారణంగా అప్పట్లో జనగణన జరగలేదు. ఇప్పుడు తాజాగా జనగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. 2026లో జన గణన పూర్తి చేసి.. వెంటనే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని నిర్ణయించింది. అంటే 2029 నాటికి కొత్త నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయి అన్నమాట.ఏపీలో ప్రస్తుతం 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 25 పార్లమెంట్ స్థానాలు కొనసాగుతున్నాయి. పునర్విభజనతో 225 కు అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. పార్లమెంటు సీట్లు సైతం పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది. అయితే జనగణన తరువాతే దీనిపై స్పష్టత రానుంది. ప్రస్తుతం ఉన్న 25 లోక్సభ స్థానాలను ఒక్కో జిల్లాగా మార్పు చేశారు. అయితే నియోజకవర్గాల పునర్విభజనతో ఆరు నుంచి 8 వరకు ఎంపీ స్థానాలు మహిళలకు రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. మరోవైపు ఎస్సీ ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలు సైతం పెరిగే అవకాశం కనిపిస్తోంది. అదే సమయంలో ఎస్సీ రిజర్వు నియోజకవర్గాలు జనరల్ కానున్నాయి.అయితే నియోజకవర్గాల పునర్విభజన తమకు లాభం అంటే తమకు లాభం అని రాజకీయ పార్టీలు చెప్పుకుంటున్నాయి. అయితే అధికార పార్టీకి అనుకూలంగా పునర్విభజన జరిగే అవకాశం ఉంది. దాదాపు 50 సీట్లు పెరగడంతో కూటమి పార్టీల మధ్య సర్దుబాటు ఆ స్థాయిలో ఉండనుంది. అటు విపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం ఆశావాహులకు అవకాశాలు ఇచ్చేందుకు ఒక అవకాశంగా భావిస్తోంది. అయితే అధికార పార్టీ కచ్చితంగా రాయలసీమ వంటి ప్రాంతాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసుకుంటుంది. సామాజికపరంగా పట్టున్న నియోజకవర్గాల్లో మార్పులకు ప్రయత్నిస్తుంది. 2009లో అలానే చేసింది కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు అటువంటి పరిస్థితి వస్తుందని కూడా రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# వదిలేది లేదంటున్న చెల్లెమ్మ...




**ఏలూరు, జూన్28( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తనకు తాను ఏమనుకుంటుందో తెలియదు. వైఎస్ లెగసీ తనకే ఉందన్న భ్రమలో ఆమె ఉన్నట్లు కనపడుతుంది. అన్నపై పోరాటం చేయవచ్చు. ఇరువురి పార్టీలు వేరు కాబట్టి ఎవరూ వ్యతిరేకించరు. కానీ అదే పనిగా అధికార పార్టీ కంటే ఎక్కువగా సోదరుడిపైనా, ఆ పార్టీ పైన విమర్శలు చేస్తుండటం చూస్తే వైఎస్ షర్మిలలో ఫ్రస్టేషన్ పీక్స్ కు చేరకున్నట్లు కనిపిస్తుంది. ఏ చిన్న అవకాశాన్ని కూడా షర్మిల వదిలిపెట్టడం లేదు. బహుశ అధికార పార్టీ కంటే ఎక్కువగానే విమర్శలు చేస్తుండటం కొంత ఏవగింపుగా మారింది. కేవలం వైసీపీ అభిమానులకు మాత్రమే కాదు. కాంగ్రెస్ పార్టీలోని నేతలు, వైఎస్ తో సంబంధమున్న ముఖ్యమైన సీనియర్ నేతలు సయితం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.. ప్రజాసమస్యలపై పోరాటం చేసి ప్రజల్లోకి వెళ్లాలి. సోదరుడిని ఓడించాలంటే ఇది మార్గం కాదని వైఎస్ షర్మిలకు సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఎవరు చెప్పినా ఆమె ఏకైక లక్ష్యం. జగన్ తిరిగి ముఖ్యమంత్రి కాకూడదనేలా అనిపిస్తుందని వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలోని కొందరు చేస్తున్న వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆస్తుల వివాదాలే ఈ కక్ష్య లకు కారణం కావచ్చు. ఆస్తి పంచి ఇవ్వకపోవడం జగన్ తప్పు కావచ్చు. అయితే అది కుటుంబ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి, సన్నిహితులు, బంధువుల మధ్య రాజీ కుదుర్చుకోవాల్సిన అన్నా చెల్లెళ్లు ఇద్దరూ ఆగర్భ శత్రువులుగా మారారని చెప్పడంలో అతిశయోక్తి లేదు.ఇక్కడ ఉన్న వీరు కొట్లాడుకుంటూ, వీధి పోరాటాలు చేసుకుంటుంటే కొందరు ఆనందపడవచ్చేమో కానీ పైలోకంలో ఉన్న వైఎస్ ఆత్మ మాత్రం శాంతించిందనే అంటున్నారు. అసలు అధికార పార్టీ తప్పొప్పులను అప్పుడప్పుడు ప్రస్తావిస్తున్నప్పటికీ జగన్ విషయాన్ని పట్టుకుని లాగుతుండటంతో సొంత పార్టీలోనే అసమ్మతి గ్రూపులు బయలుదేరాయి. వైఎఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి వచ్చింది సొంత ప్రయోజనాలు కోసమే కాని, పార్టీ బలోపేతం చేయడం కోసం కాదని పార్టీలో ని ముఖ్యనేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. సుంకర పద్మశ్రీ వంటి వారు అయితే ఏకంగా జిల్లాల్లో షర్మిలకు వ్యతిరేకంగా సభలు పెట్టి కార్యకర్తలను ఏకం చేసే పనిలో ఉన్నారు. ఇప్పుడు వైఎస్ షర్మిల జగన్ పర్యటనలకు అనుమతి ఇవ్వవద్దంటూ ప్రభుత్వాన్ని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. జగన్ ను జైల్లో పెట్టాలని కోరడం కూడా ఆమె కసికి తార్కాణమని చెప్పాలి. వివేకా ను చంపి సునీత మీద నెట్టేసినోళ్ళకు, సింగయ్యను తొక్కి చంపి %గా×% గ్రాఫిక్స్ అనడం ఒక లెక్కనా ? అంటూ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. వివేకా హత్య విషయంలో సీబీఐ అన్ని ఆధారాలు చూపుతుంటే సునీత చంపింది అనేటోళ్లకు..టైర్ల కింద తొక్కి గ్రాఫిక్స్ అనక ఏమంటారు ? అని వైఎస్ షర్మిల నిలదీశారు. ఇలా జగన్ వెంటాడమే పనిగా పెట్టుకున్నట్లుందని సొంత పార్టీ నేతలే పార్టీ హైకమాండ్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. హైకమాండ్ కూడా వైఎస్ షర్మిలను పీసీసీ చీఫ్ గా కొనసాగించడంపై పునరాలోచనలో పడినట్లు సీనియర్ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. షర్మిల కంటే చింతామోహన్, హర్షకుమార్ లాంటి నేతలు ఎక్కువగా అధికార పార్టీ నిర్ణయాలను తప్పుపడుతున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# వెలుతురు

## జనరల్ వార్తలు

https://epaper.velthuru.com


# ఇవాళే పసుపు బోర్డు ప్రారంభం



**నిజామాబాద్, జూన్ 28, ( వెలుతురు)**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా జూన్ 29న నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ బోర్డు ఏర్పాటు దేశవ్యాప్తంగా ఉన్న పసుపు రైతులకు ఒక చారిత్రక మైలురాయి అని, తెలంగాణకు గర్వకారణమైన క్షణం అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అభివర్ణించారు. జూన్ 29న జరగనున్న భారీ కిసాన్ సభ కోసం నిజామాబాద్‌లో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి కిషన్ రెడ్డి పరిశీలించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కూడా అయిన కిషన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ లోక్‌సభ సభ్యుడు ధర్మపురి అరవింద్, ఇతర పార్టీ నాయకులు కూడా హాజరయ్యారు. 'బోర్డు ప్రారంభం అనంతరం కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అమిత్ షాతో పాటు ఇతర మంత్రులు, అధికారులతో కలిసి తదుపరి కార్యాచరణపై చర్చలు జరపనున్నారు. పసుపు ధరలు పెరిగేలా, వ్యాల్యూ యాడెడ్ ఉత్పత్తుల అభివృద్ధి ద్వారా ఎగుమతి అవకాశాలు మెరుగయ్యేలా చర్యలు తీసుకుంటాం. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు గౌరవం పెరగాలన్నదే ఉద్దేశ్యం. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుచేయడం ప్రధాని మోదీ పాలనలో తెలంగాణ రాష్ట్రానికి లభించిన ఒక అద్భుత బహుమతి.' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 'మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. వారి జీవితంలో చివరి దశలో బీజేపీ కి దగ్గరయ్యారు. డీఎస్ ప్రథమ వర్ధంతి జూన్ 29న జరగనుంది. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను అభ్యర్థించారు. అమిత్ షా ఈ అభ్యర్థనను పెద్ద మనసుతో అంగీకరించారు. జూన్ 29న రైతు సభకు వెళ్లే క్రమంలో డి.శ్రీనివాస్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది.' అని వివరించారు.

### పసుపు బోర్డుతో ఏం ఉపయోగం?

దేశవ్యాప్తంగా పండే కీలకమైన పంటలపై పరిశోధనలు, దిగుబడి పెంచడం, మార్కెటింగ్ వంటి అంశాలను అధ్యయనం చేసేందుకు, రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయా పంటలకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేస్తుంది. అలా పసుపు సహా 52 సుగంధ ద్రవ్యాలకు కలిపి జాతీయ సుగంధ ద్రవ్యాల (స్పైసెస్) బోర్డు ఒకటి 1987లో ఏర్పాటు చేశారు. కేరళలోని కొచ్చిలో దీని ప్రధాన కార్యాలయం ఉంది. దీనికి 2010 నుంచి గుంటూరు, వరంగల్‌లో ప్రాంతీయ కార్యాలయాలు పెట్టారు. నిజామాబాద్, పాడేరు, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌లలో స్పైస్ బోర్డుకు సంబంధించిన వివిధ కార్యాలయాలు ఉన్నాయి. నిజామాబాద్ దగ్గరలో ఉండే స్పైసెస్ బోర్డు కార్యాలయం పసుపు పంటపై పనిచేస్తుంది. అయితే నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయం కాకుండా పూర్తిస్థాయిలో పసుపు కోసమే బోర్డు కావాలన్నది స్థానిక రైతుల డిమాండ్. 'టీ బోర్డు, పొగాకు బోర్డులాగా పసుపు బోర్డు ఉంటే రైతులకు లాభం. స్పైసెస్ బోర్డులో పసుపు పంటకు ప్రాధాన్యం లేదు. ప్రత్యేకంగా బోర్డు ఉంటే రైతులకు నమ్మకం ఉంటుంది. అందుకే మేం బోర్డు విషయంలో ఒత్తిడి చేస్తున్నాం.'' పసుపు బోర్డు కోసం పోరాడుతోన్న సమయంలో చెప్పారు నిజామాబాద్‌కు చెందిన రైతు నాయకుడు ఉప్పల ప్రభాకర్. "అన్ని సుగంధ ద్రవ్యాలపై కాకుండా కేవలం పసుపుపైనే పనిచేసే ఈ కొత్త బోర్డు పసుపు పంటపై పరిశోధన, మార్కెట్ పెంచడం, కొత్త మార్కెట్ సృష్టించడంపై పనిచేస్తుంది." అని భారత ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త వంగడాలు కనిపెట్టడం, తెగుళ్ల నివారణకు పనిచేయడం, యాంత్రీకరణ, రైతులకు సూచనలు, మార్కెటింగ్ పెంచడం, నాణ్యత పెంచడం వంటి పనులపై ఈ బోర్డు శ్రద్ధ పెడుతుంది. ఇప్పటికే నిజామాబాద్ (కమ్మరపల్లి)లో పసుపు పరిశోధన కేంద్రం విషయంలో రైతులకు అవగాహన పెరిగింది. వారి పరిశోధనల ఫలితాలు, కొత్త వంగడాలు రైతులకు చేరుతున్నాయి. కానీ అది బోర్డులో భాగమైతే మరింత లాభదాయకంగా ఉంటుందంటున్నారు స్థానికులు. 2017 ఆగస్టులో అప్పటి ఎంపీ కల్వకుంట్ల కవిత పసుపు బోర్డు ఏర్పాటు కోసం ప్రధాని మోదీని కలిశారు. 2018లో సురేశ్ ప్రభు స్పైసెస్ డెవలప్‌మెంట్ పార్క్ ప్రకటించారు. 2018లో పసుపు బోర్డు ఎన్నికల అంశంగా మారింది. టీఆర్ఎస్ తరఫున లోక్‌సభకు పోటీ చేసిన కవితకు వ్యతిరేకంగా 178మంది రైతులు ఎంపీ స్థానానికి నామినేషన్లు వేశారు. కాశీలోనూ మోదీపైనా పలువురు నామినేషన్లు వేశారు. "బీజేపీ ఎంపీగా గెలిచిన తరువాత పసుపు బోర్డును తీసుకురాకపోతే రాజీనామా చేస్తా" అని బాండు పేపర్ పై రాసి హామీ ఇచ్చిన ధర్మపురి అరవింద్ ఆ ఎన్నికల్లో గెలిచారు. కానీ ఆ తరువాత ఆయన (2019 %-% 2024) హయాంలో పూర్తి స్థాయి పసుపు బోర్డు ఏర్పాటు చేయలేకపోయారు. కానీ, దానికి సంబంధించిన ఇతర కార్యాలయాలు వచ్చాయి.

### మద్దతు ధర కావాలి

2020 జనవరిలో నిజామాబాద్‌లో స్పైసెస్ బోర్డు రీజినల్ ఆఫీసు ఏర్పాటు చేశారు. ఇందులో పసుపు, మిర్చి రెండు పంటలకు సంబంధించిన వ్యవహారాల పర్యవేక్షణ ఉంటుంది. అంతే కాకుండా రైతులకు అందే పాలిషర్లు, బాయిలర్ల సంఖ్య గతంకంటే గణనీయంగా పెరిగింది. రాయితీ ధరపై వీటిని ఇస్తున్నారు. తరువాత కూడా ఈ అంశం రగులుతూనే ఉంది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ పాలమూరు ప్రజాగర్జనలో పసుపు బోర్డు గురించి ప్రకటించారు. ఆ తరువాత 2023 అక్టోబరులో ప్రభుత్వం గెజిట్ ఇచ్చేసింది. ఇన్నాళ్లకు మళ్లీ నిజామాబాద్ కేంద్రంగా తాత్కాలిక కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా హడావుడిగా ప్రారంభోత్సవం చేస్తున్నారు. "నిజామాబాద్ పసుపు బోర్డు ప్రయత్నిస్తామని చాలాసార్లు అన్నారు. అన్నాక మొత్తానికి ప్రకటించారు. అది రైతులు ఎప్పటినుంచో కోరుతున్నది. అయితే బోర్డు ప్రకటించడమే కాదు దానికి తగినన్ని నిధులు ఇవ్వాలి. అలాగే పసుపుకి మద్దతు ధర లేదు. పసుపుకి మద్దతు ధర వచ్చేలాగా ఈ బోర్డు ప్రయత్నం చేయాలి. దీంతోపాటు జీడి, కొబ్బరి, కాఫీ బోర్డులు, ఆయా పంటల ధరలు తగ్గినప్పుడు అవే స్వయంగా పంటను కొని అంతర్జాతీయ మార్కెట్లోకి ఎగుమతి చేసే పరిస్థితి ఉంది. పసుపు విషయంలో ఈ బోర్డు కూడా అలా చేస్తే మంచిది. దీంతోపాటుగా పరిశోధన మరింత పెంచి రైతుకు ఉపయోగ పడాలంటున్నారు రైతు స్వరాజ్య వేదికకు చెందిన కన్నెగంటి రవి.

### భారత్‌లో పసుపు ఎందుకు ప్రత్యేకం?

భారతదేశంలో పసుపు హిందూ సంప్రదాయంతో ముడిపడి ఉంది. అంతే కాకుండా ఆహార పదార్థాలు, సౌందర్య సాధనాలు, ఔషధాల్లోనూ పసుపును ఉపయోగిస్తారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారు, వినియోగదారు, ఎగుమతిదారు కూడా. 2022-23 సంవత్సరంలో 11.61 లక్షల టన్నులతో ప్రపంచంలో మూడింట రెండొ వంతు పసుపు భారత్ ఉత్పత్తి చేయగా, పసుపులో ప్రపంచ వాణిజ్యంలో భారత్ కు 62% వాటా ఉంది. 2022-23లో భారత్ నుంచి వివిధ దేశాలకు 1.534 లక్షల టన్నుల పసుపు, పసుపు ఆధారిత ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. దేశంలోని 20 రాష్ట్రాల్లో పసుపు పండించినా, ఎక్కువగా మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో ఉత్పత్తి అవుతోంది. అధ్యక్ష పదవితోపాటు ఆయుష్ మంత్రిత్వ శాఖ నుంచి సభ్యులు, కేంద్ర ప్రభుత్వ ఔషధాలు, వ్యవసాయం %ఉ% రైతు సంక్షేమం, వాణిజ్యం %ఉ% పరిశ్రమల శాఖలు, అలాగే మూడు రాష్ట్రాల నుంచి సీనియర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు (రొటేషన్ ప్రాతిపదికన), అలాగే పరిశోధనలో నిమగ్నమైన ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు, పసుపు రైతులు, ఎగుమతిదారులు సభ్యులుగా ఉంటారు. ఇక దీని కార్యదర్శిని వాణిజ్య శాఖ నియమిస్తుంది. ఈ సంస్థ కింద ప్రాంతీయ, డివిజనల్, ఫీల్డ్ కార్యాలయాలు ఉంటాయి. పసుపు బోర్డుకు కూడా ఇలాంటి బ్రాంచి కార్యాలయాలు దేశంలో పసుపు పండించే ఇతర ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

# జూరాల ప్రాజెక్టుపై నీలినీడలు



**మహబూబ్ నగర్, జూన్ 28, ( వెలుతురు)**

జూరాల ప్రాజెక్టులోని ఇనుప తాళ్లు (రోప్‌లు) తెగిపోయాయి. మరోవైపు భారీగా వరద నీరు తరలివస్తోంది. అయితే 12వ నంబరు గేటు నుంచి నీళ్లు లీకవుతున్నాయి. దీంతో ప్రాజెక్ట్ గేట్ల నిర్వహణపై విమర్శలు వినిపిస్తున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కృష్ణా బేసిన్‌లోని జూరాల ప్రాజెక్ట్ భద్రతపై నీలినీడలు అలుముకుంటున్నాయి. తాజాగా నాలుగో గేట్ ఇనుప రోప్(తాళ్లు) తెగిపోవడంతో గేట్ల నిర్వహణపై ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు ఎగువ నుంచి భారీ వరద తరలివస్తోంది. దీంతో ప్రాజెక్ట్ భద్రతపై వెంటనే చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

జూరాల ప్రాజెక్ట్ – ముఖ్యమైన అంశాలు:

కృష్ణా బేసిన్ లోని తెలంగాణ పరిధిలో ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్(ఆత్మకూరు– గద్వాల మధ్య) ఉంటుంది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఈ ప్రాజెక్ట్ జలప్రదాయినిగా నిలుస్తోంది. ఈ జూరాల ప్రాజెక్ట్ 1997లో వినియోగంలోకి వచ్చింది. మొత్తం 67 రేడియల్ గేట్లు ఉన్నాయి. ఇందులో కొన్నిగేట్ల రోప్‌లు నీటి తాకిడితో తుప్పుపట్టాయి. అంతేకాకుండా కొన్ని గేట్ల నుంచి నీటి లీకేజీ సమస్య ఉంది. గేట్ల మరమ్మత్తుల కోసం 2022లో రూ.11 కోట్లతో టెండర్లు పిలిచారు. ఈ పనులు ప్రారంభమయ్యాయి. అయితే అనుకున్నంత పురోగతి కనిపించటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం రోప్‌ల మార్పిడి పనులు జరుగుతున్నాయి. అయితే తాజాగా నాలుగో గేట్ ఇనుప రోప్ తెగిపోవడంతో ప్రాజెక్ట్ గేట్ల నిర్వహణపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు ఎగువ నుంచి లక్ష క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. 12 గేట్ల ద్వారా అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలుగా ఉంటుంది. దీని కింద 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. తాజా పరిస్థితులపై అధికారులు స్పందిస్తూ%ౌ% మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. అయితే ముందస్తుగా వరద రావడం ఆటంకంగా మారిందని అంటున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు వచ్చిన ముప్పు ఏమీ లేదని అభిప్రాయపడుతున్నారు. జూరాల ప్రాజెక్టులోని గేట్ రోప్ తెగిపోవడం కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ప్రాజెక్టు నిర్వహణ కూడా చాకపోవడం వల్లే ఇవాళ జూరాల ప్రాజెక్టు డేంజర్ లో పడిందని విమర్శిస్తోంది. జూరాలకు భారీగా వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం వెంటనే దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, ఎగువ నుంచి పెరుగుతున్న ఇన్ ఫ్లో ను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పకడ్బందీగా వ్యవహరించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

# మొహర్రం ఉత్సవాలు ప్రారంభం



**అదిలాబాద్, జూన్ 28, ( వెలుతురు)**

మొహర్రం ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. కుల, మత భేదాలు, చిన్నా పెద్ద తేడాలేకుండా అంతా భక్తి శ్రద్ధలతో మొహర్రం నిర్వహించుకుంటారు. తెలంగాణ రాష్ట్రంలో మతసామరస్యానికి ప్రతీకగా ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామంలో హస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో పీరీల ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నిర్వాహకులు పీర్ల బంగ్లాలను శుభ్రం చేయడం, విద్యుత్తు దీపాల అలంకరణ పనుల్లో నిమగ్నమయ్యారు. పదిరోజుల పాటు నియమనిష్ఠలు, హిందూముస్లింలు ఐక్యతతో వీటిని నిర్వహిస్తారు. రుయ్యాడి అంటేనే పీర్ల పండుగ స్పెషల్ అని అందరు అంటుంటారు. ఇక్కడ మొహర్రం సందర్భంగా జరిగే ఉత్సవాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, పక్కనున్న మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. హస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో పీర్లకు దర్శించుకుని తమ మొక్కులు చెల్లిస్తారు. రాష్ట్రంలోనే పేరుగాంచిన రుయ్యాడి హస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో మొహర్రం సందర్భంగా ఆలయ కమిటీల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోను ఆదివాసులు సైతం ఘనంగా జరుపుకుంటారు. హస్సేన్ హుస్సేన్, దూలా, సవారీ, పులిఖేల్ తదితర పీర్ల పేరిట ఈ ఉత్సవాలను జరుపుకుంటారు. సాంప్రదాయ డప్పు చప్పులతో రకరకాల వాయిద్యాలు వాయిస్తూ పది రోజులపాటు గ్రామాల్లో ఎంతో సందడిగా ఈ మొహర్రం ఉత్సవాలను జరుపుకుంటారు. పది రోజుల మొహర్రం ఉత్సవాలలో ప్రతి రోజు ప్రారంభించే ముందు పీర్లకు ప్రత్యేకంగా దేవ్ కా బాజా అనేది ఉంటుంది. దీన్ని "ధనక ధర్ధన్ ధన్...ధనక ధర్ధన్ ధన్" ఇలా ఈ వాయిద్యాన్ని మోగిస్తారు. అనంతరం మిగతా అన్ని రకాల వాయిద్యాలు వాయిస్తారు. ఇందులో ఢూలే, గోండీ, పర్సాని, రుమాలీ, తీన్ పావులీ, ఘోడాఖేల్, తదితర రకాల వాయిద్యాలను వాయిస్తూ ఈ మొహర్రం ఉత్సవాలను సంబరంగా జరుపుకుంటారు. ప్రస్తుతం ఆదివాసి గ్రామాల్లో ఆకాడి పండుగలను ఆదివాసీలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఆకాడి పూజల తర్వాతే ఆదివాసీలు డప్పు చప్పులను వాయించడం మొదలుపెడతారు. నేటి నుంచే గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు ప్రారంభం కావడంతో, మొహర్రం ఉత్సవాలు నిర్వహించే గ్రామాలలో ముందుగా ఆకాడి పండుగలను జరుపుకుంటున్నారు. తర్వాత పీర్ల పండుగలను పది రోజుల పాటు ఘనంగా నిర్వహించుకోనున్నారు

# సైడు కాల్వలోకి దూసుకుపోయిన బస్సు

**- ప్రయాణికులకు గాయాలు**

**అమరావతి జూన్ 28, ( వెలుతురు)**

గుంటూరు జిల్లా పెదకాకాని సర్వీస్ రోడ్ లో బస్సు ప్రమాదం జరిగింది. సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న సైడ్ కాల్వలోకి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దూసుకెళ్లింది. ఘటనలో పలువురు యాత్రికులకు స్వల్ప గాయాలు అయ్యాయి, ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు అంటున్నారు. యాత్రికులు రావుల పాలెం నుంచి అరుణాచలం వెళ్తున్నారు. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెదకాకాని పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

# మరో వివాదాన్ని లేపిన రేవంత్

**హైదరాబాద్, జూన్ 28, ( వెలుతురు)**



పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వాలు రేషన్ కార్డులపై ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. గతంలో రూ.2 కిలో బియ్యం ఇవ్వగా, తర్వాత రూ.5 తీసుకున్నారు. వైఎస్సార్ హయాంలో రూపాయికి కిలో ఇచ్చారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. ఇక రేషన్ కార్డు లేని పేదల ఆకలి తీర్చేందుకు తమిళనాడులో మాజీ సీఎం జయలలిత అమ్మ క్యాంటీన్లు ప్రారంభించింది. దాని స్ఫూర్తితో ఏపీలో అన్న క్యాంటీన్లు, తెలంగాణలో అన్నపూర్ణ క్యాంటీన్లు ప్రారంభించారు. అయితే ఇప్పుడు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇందిర క్యాంటీన్లు తెరవడం వివాదానికి తెరలేపింది. తెలంగాణలో అన్నపూర్ణ కేంద్రాలను ఇందిరా క్యాంటీన్లుగా పేరు మార్చడం రాజకీయ చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్ణయం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్యగా, తమిళనాడులోని అమ్మ క్యాంటీన్లు, ఆంధ్రప్రదేశ్‌లోని అన్నా క్యాంటీన్ల నమూనాల స్ఫూర్తితో రూపొందింది. అయితే, ఈ పేరు మార్పు తెలంగాణ ఉద్యమ చరిత్రతో ముడిపడిన సున్నితమైన అంశాలను లేవనెత్తి, విమర్శలను రేకెత్తించింది. 2014లో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో అన్నపూర్ణ కేంద్రాలను ప్రారంభించింది. ఈ కేంద్రాలు పేదలకు రూ.5కే భోజనం అందించే లక్ష్యంతో రూపొందాయి, హైదరాబాద్‌లో 150కి పైగా కేంద్రాల ద్వారా రోజుకు 40 వేల మందికి ఆహారం అందుతోంది. ఇటీవల, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఈ కేంద్రాలను ఇందిరా క్యాంటీన్లుగా పేరు మార్చడానికి ఆమోదించింది. అదనంగా, రూ. 5కే బ్రేక్‌ఫాస్ట్‌ను ప్రవేశపెట్టడం, 11 శాశ్వత నిర్మాణాలను పునరుద్ధరించడం, 139 కొత్త స్థానాల్లో క్యాంటీన్ల నిర్మాణం చేపట్టడం వంటి ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. పాత అన్నపూర్ణ కేంద్రాలకే ఇందిర క్యాంటీన్లుగా పేరు మార్చాలని నిర్ణయించింది. ఇందిరా క్యాంటీన్ పేరు మార్పు నిర్ణయం తెలంగాణలో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. ఇందిరా గాంధీ, 1969లో తొలిదశ తెలంగాణ ఉద్యమాన్ని, జై ఆంధ్ర ఉద్యమాన్ని అణచివేసిన నాయకురాలిగా చరిత్రలో నమోదైన వ్యక్తి. ఆమె హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా ప్రకటించడం ద్వారా తెలంగాణ ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఈ చారిత్రక నేపథ్యం కారణంగా, ఇందిరా పేరును క్యాంటీన్లకు ఉపయోగించడం తెలంగాణ సెంటిమెంట్‌కు వ్యతిరేకమని బీఆర్ఎస్ వంటి విపక్షాలు వాదిస్తున్నాయి. బీఆర్ఎస్ నాయకురాలు కవిత, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం పేర్లు మార్చడంపై దృష్టి సారిస్తూ, తెలంగాణ సిద్ధాంతాలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అన్నపూర్ణ అనే పేరు దేవతామూర్తిని సూచిస్తూ, పేదలకు ఆహారం అందించే ఉద్దేశానికి ప్రతీకగా ఉందని, ఇందిరా పేరు రాజకీయ కుటుంబాన్ని గుర్తు చేస్తుందని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇందిరా గాంధీ "గరీబీ హఠావో" నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేసిన నాయకురాలిగా ఈ పేరు సముచితమని వాదిస్తున్నారు. క్యాంటీన్ల లక్ష్యం పేదలకు సరసమైన ధరల్లో ఆహారం అందించడమే కాబట్టి, ఇందిరా పేరు ఈ ఉద్దేశానికి తగినదని వారి భావన. అదనంగా, ఈ నిర్ణయం కాంగ్రెస్ పార్టీకి రాజకీయ లబ్ధిని చేకూర్చే ప్రయత్నంగా కనిపిస్తుంది. పేరు మార్పు కంటే, క్యాంటీన్ల నాణ్యత, సౌలభ్యం, విస్తరణపై దృష్టి సారించడం ద్వారా పేదలకు మరింత ప్రయోజనం చేకూరవచ్చు. ఇందిర పేరు చారిత్రక వివాదాలతో ముడిపడి ఉండటం వల్ల, స్థానిక సెంటిమెంట్‌ను గౌరవించే పేరును ఎంచుకోవడం లేదా అన్నపూర్ణ వంటి తటస్థమైన పేరును కొనసాగించడం రాజకీయ వివాదాన్ని తగ్గించవచ్చు. ప్రభుత్వం ఈ క్యాంటీన్ల ద్వారా సేవలను మెరుగుపరచడంపై దృష్టి పెడితే, ప్రజల ఆదరణను పొందే అవకాశం ఉంది.

# తలరసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆకస్మిక తనిఖీ

**పాడేరు జూన్ 28, ( వెలుతురు)**

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలోని తలరసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తనిఖీ చేశారు. హాస్టల్ వసతి గృహాల్లో గిరిజన విద్యార్థులు ఉంటున్న గదులను ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు స్వయంగా చూసి చలించిపోయారు. పాఠశాలలో సుమారు 432 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారని కానీ వారికి ఎటువంటి మౌలిక వసతి సదుపాయాలు లేవన్నారు. విద్యార్థులు ఉంటున్న గదులు చూస్తే పందులు కూడా అసహ్యించుకొని నిద్రపోవన్నారు. పూర్తిగా తలుపులు కిటికీలు లేక హాస్టల్ మొత్తం అధ్వాన్నంగా ఉందని, భవనం పూర్తిగా శిథిలదశకు చేరిందని అన్నారు. ప్రతి రోజు విద్యార్థులు నిద్రిస్తున్న సమయంలో భవనం పెచ్చులూడి పడుతుందన్నారు. జిల్లా అధికారులు రోజు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారని కానీ లోపల విద్యార్థులు పడే బాధలు తెలుసుకోలేకపోవడం తీవ్ర విచారకరమన్నారు. ఇంత దారుణంగా జిల్లా కేంద్రంలోని ఓ గిరిజన సంక్షేమ వసతి గృహం పరిస్థితి ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. జిల్లా కేంద్రంలోని వసతి గృహం పరిస్థితి ఇలా ఉంటే మారుమూల ప్రాంతంలో గిరిజన సంక్షేమ వసతి గృహాల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. కాలం చెల్లిన భవనాల్లో విద్యార్థులను ఉంచటం సరైన పద్ధతి కాదన్నారు. విద్యార్థులకు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి విద్యాభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు పాఠశాలను తనిఖీ చేసిన సంగతి తెలుసుకున్న సంక్షేమ శాఖ డీడీ రజని పాఠశాలను సందర్శించారు. పాఠశాల మరమ్మతులకు గతంలోనే రూ. 75 లక్షల నిధులు మంజూరు అయిందని టెండర్లు పూర్తయిన తర్వాత ప్రారంభిస్తామని ఆమె ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్ఆర్ సీపీ ఎస్టీ సెల్ పాడేరు నియోజకవర్గం అధ్యక్షుడు సరభ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ మినుముల కన్న పాత్రుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రేవంత్ బీహార్ కు రండి...



**పాట్నా, జూన్ 28, ( వెలుతురు)**

ఇందులో బాగా సక్సెస్ అయింది మాత్రం ఐ ప్యాక్ అధినేత ప్రశాంత్ కిషోర్. అతని బృందంలో పనిచేసి.. ఆ తర్వాత వేరు కుంపటి పెట్టుకున్న రాబిన్ సింగ్. ప్రశాంత్ కిషోర్ మాటలన్నీ విచిత్రంగా ఉంటాయి. ఆయన వ్యూహాలు మొత్తం అత్యంత దారుణంగా ఉంటాయి. ప్రత్యర్థి పార్టీని ఇష్టానుసారంగా తిట్టడం.. దారుణంగా విమర్శలు చేయడం.. ఒక రకమైన విద్వేషాలకు పాల్పడడం వంటివి అతని రూపకల్పనలో ఒక భాగం. అయితే ఇవన్నీ కూడా విజయవంతం కాలేదు. విజయవంతమైనప్పుడు ప్రశాంత్ కిషోర్ డబ్బా కొట్టుకున్నాడు. భారీగా డబ్బులు సంపాదించాడు. క్రితం సారి బీహార్ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినప్పుడు పోటీలో ఉంటానని చెప్పి ఆ తర్వాత యూటర్న్ తీసుకున్నాడు.ఇప్పుడేమో ఒక రాజకీయ పార్టీని పెట్టి.. బీహార్ ఎన్నికల్లో ప్రచారం చేస్తానని చెబుతున్నాడు. అంతేకాదు తను బీహార్ ఎన్నికల్లో గేమ్ చేంజర్ అవుతానని చెప్పుకుంటున్నాడు. ఇందులో భాగంగానే తనకు మాత్రమే సాధ్యమైన విమర్శలు చేస్తున్నాడు. అంతేకాదు విద్వేషాలు రగిలించే విధంగా కామెంట్లు చేస్తున్నాడు. ఇక ఇటీవల కాలంలో పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలలో పొల్గొంటూ నెత్తికి అరికాలికి సంబంధం లేని వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రముఖంగా ప్రచారంలో ఉంటున్నాడు. వాస్తవానికి ప్రశాంత్ కిషోర్ కు తెలిసింది అది మాత్రమే. సోషల్ మీడియాలో ఎంత రచ్చ లేపాలో ప్రశాంత్ కిషోర్ కు తెలుసు. అందువల్లే అతడు విద్వేషాన్ని రగిలించే విధంగా వ్యాఖ్యలు చేస్తూ ఉంటాడు.ఒక పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడిన ప్రశాంత్ కిషోర్.. బీహార్ ఎన్నికలపై విచిత్రమైన వ్యాఖ్యలు చేశాడు. అసలు బీహార్ రాష్ట్రానికి సంబంధం లేని రేవంత్ రెడ్డి పేరు ప్రస్తావించాడు. కాంగ్రెస్ పార్టీ బీహార్ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో విజయం సాధిస్తుందని అనుకుంటున్నదని.. కానీ అది సాధ్యం కాదని ప్రశాంత్ కిషోర్ చెప్పాడు. అంతేకాదు ఒకవేళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి కనుక తీసుకొస్తే అది ఇబ్బందికరమవుతుందని వ్యాఖ్యానించాడు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని.. ఇక్కడ మొత్తం పరిస్థితి విచిత్రంగా ఉందని ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యానించాడు.ఎప్పుడైతే ప్రశాంత్ కిషోర్ ఆ వ్యాఖ్యలు చేశాడో.. కోతికి దొరికింది కొబ్బరి చిప్ప అన్నట్టుగా గులాబీ పార్టీ సోషల్ మీడియాను పర్యవేక్షించేవారు రెచ్చిపోవడం మొదలుపెట్టారు. చూశారా రేవంత్ రెడ్డి పరిస్థితి ఎలా ఉందో.. చివరికి ప్రశాంత్ కిషోర్ కూడా విమర్శలు చేస్తున్నాడు. బీహార్ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ప్రచారానికి రేవంత్ రెడ్డి గనక వెళితే వచ్చేది 0 ఫలితమే అన్నట్టుగా గులాబీ పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని పర్యవేక్షించేవారు ఆరోపిస్తున్నారు.. రేవంత్ రెడ్డి కనీసం ఎన్నికల ప్రచారానికైనా వెళ్తున్నాడు. గులాబీ పార్టీ నాయకులకు ఆమాత్రం కూడా లేదు కదా.. దేశంలో చక్రాలు తిప్పుతానని వ్యాఖ్యానించిన కేసీఆర్ ఇప్పుడు వ్యవసాయ క్షేత్రానికి మాత్రమే పరిమితమయ్యాడు కదా.. మరి ఆ విషయం గులాబీ నాయకులకు తెలియదా.. తెలిసిన కూడా తెలియనట్టు నటిస్తున్నారా?

# కొడుకు, కూతురు మధ్య బాపు



**హైదరాబాద్, జూన్ 28, ( వెలుతురు)**

బీఆర్ఎస్ లో ఏదో బయటకు కనపడని రాజకీయం నడుస్తుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితల మధ్య అంతర్గత వార్ నడుస్తున్నట్లే కనిపిస్తుంది. అన్న నాయకత్వాన్ని కవిత అంగీకరించినట్లు కనిపించడం లేదు. అందుకోసమే తెలంగాణ జాగృతి సంస్థను తిరిగి యాక్టివ్ చేశారు. అన్నివిభాగాలను నియమించారు. తానే జాగృతి చీఫ్ అని ప్రకటించుకున్న కవిత తనంతట తానే కార్యక్రమాలను డిజైన్ చేసుకుంటున్నారు. కేసీఆర్ కు లేఖ బహిర్గతమయినప్పుడు, కేటీఆర్ పై ఆఫ్ ది రికార్డులో కవిత కేటీఆర్ పైవిమర్శలు చేసినప్పుడు ఆయన హైదరాబాద్ లో లేరు. విదేశాల్లో ఉన్నారు. విదేశాల నుంచి వచ్చిన కేటీఆర్ కవిత వ్యాఖ్యలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు కాని దూరం మాత్రం పెరిగినట్లు కనిపిస్తుంది.ఈ నెల 11న కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ ఎదుటకు విచారణకు వస్తున్న సందర్భంలో కవిత ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు వెళ్లారు. అక్కడ కవిత ఉందనేమో తెలియదు కానీ కేటీఆర్ మాత్రం నాడు ఫామ్ హౌస్ కు వెళ్లలేదు. కేసీఆర్ వెంట కమిషన్ ఎదుటకు కూడా కేటీఆర్ వెళ్లలేదు. మరొకవైపు కేటీఆర్ ను ఫార్ములా ఈరేసు కేసులో ఈనెల 16వ తేదీన ఏసీబీ అధికారులు విచారణకు పిలిచినప్పుడు అందరు నేతలు కేటీఆర్ వద్దకు వచ్చారు. అయితే ఆరోజు కవిత జగిత్యాల పర్యటనకు వెళ్లడం కూడా ఇద్దరి మధ్య దూరం కొనసాగుతుందన్న విషయం కనపడుతుంది. ఎందుకంటే కేటీఆర్ తనను అరెస్ట్ చేయవచ్చని నాడు చేసిన వ్యాఖ్యలతో బీఆర్ఎస్ నేతలందరూ వచ్చినా కవిత మాత్రం రాకపోవడం పార్టీలోచర్చనీయాంశమైంది. సొంత కార్యక్రమాలతో కవిత... దీనికి తోడు కల్వకుంట్ల కవిత గత కొన్ని రోజుల నుంచి తెలంగాణ భవన్ కు దూరంగానే ఉంటున్నారు. పైగా కేసీఆర్ నుకమిషన్ విచారణకు పిలిచిందని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తే బీఆర్ఎస్ నేతలు ఎవరూ అక్కడకు హాజరు కాలేదు. ఇప్పుడు కవిత ఏకంగా తనంతట తాను సొంతంగా కార్యక్రమాలను డిజైన్ చేసుకుంటూ పిలుపునిస్తుండటం చర్చనీయాంశమైంది. బీసీల రిజర్వేషన్లపై పోరాటానికి కవిత సిద్ధమయ్యారు. జులై 17వ తేదీన రైల్ రోకోకు పిలుపు నిచ్చారు. అంతే కాదు అవసరమైతే ఢిల్లీలో ఆందోళన నిర్వహిస్తామని కూడా తెలిపారు. ఇలా మరొక వైపు కేసీఆర్ రైతులకు అనుకూలంగా కొన్ని ఆందోళన కార్యక్రమాలు చేయాలని కార్యక్రమాలకు పిలుపు నిచ్చారు. ఇందుకోసం కేటీఆర్ పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నారు కేటీఆర్ కార్యక్రమాలు మరొకవైపు... ఇలా అన్న కేటీఆర్ ఒక వైపు వేరేలా కార్యక్రమాలను రూపొందించుకుంటుంటే... మరొకవైపు సోదరి కవిత మరొక అంశాన్ని తీసుకుని జనంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇద్దరివీ వేర్వేరు దారులన్నది స్పష్టంగా తెలుస్తోంది. తాను కేసీఆర్ నాయకత్వాన్ని తప్పించి మరొకరి నాయకత్వాన్ని అంగీకరించబోనని కవిత తేల్చి చెబుతుండగా, కేటీఆర్ మాత్రం కవిత కార్యక్రమాలకు ఎవరూ వెళ్లవద్దంటూ బీఆర్ఎస్ నేతలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకోవాల్సిన కేసీఆర్ మాత్రం ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ఇలా అన్నా చెల్లెళ్లు కారు స్టీరింగ్ ను చెరొక చేతుల్లోకి తీసుకోవడంతో అది ఎటువైపు పయనిస్తుందన్నది క్యాడర్ లో మాత్రం అయోమయం నెలకొంది. మొత్తం మీద బీఆర్ఎస్ లో ఏదో జరుగుతుంది. అది కేసీఆర్ కు తెలిసి జరుగుతుందా? తెలియక జరుగుతుందా? అన్నది మాత్రం భవిష్యత్ లో తేలనుంది.

# కాంగ్రెస్ తలనొప్పిగా మారుతున్న గొడవలు





**హైదరాబాద్, జూన్ 28, ( వెలుతురు)**


పంచాయతీ ఎన్నికలు సెప్టెంబర్ 30వ తేదీలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అన్ని పార్టీలు స్థానిక సంస్థలకు సమాయత్తమవుతున్నాయి. అయితే అధికార పార్టీలో మాత్రం ఈ ఎన్నికలు గుబులు పుట్టిస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరారు. ఆ నియోజకవర్గాల్లో ఇప్పుడు వర్గపోరు నడుస్తోంది. తామే ఒరిజనల్ కాంగ్రెస్ అని, వచ్చిన వారు వలస కాంగ్రెస్ నేతలు అన్న బేధాభిప్రాయాన్ని పాత కాంగ్రెస్ నేతలు తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పట్టు నిలుపుకోవడానికి అటు వలస నేతలు, ఇటు ఒరిజినల్ నేతలు ఇప్పటి నుంచే పార్టీ పెద్దలపై తమ వారికే అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలా రెండు వర్గాల నుంచి వస్తోన్న డిమాండ్లతో హస్తం పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. ఈ గొడవలు ఇలానే ముదిరితే పంచాయతీ ఎన్నికల్లో గెలుపుపై ప్రభావం చూపుతాయని ఆందోళన చెందుతున్నారు.కాంగ్రెస్ పార్టీలో ఈ వర్గ పోరులో ఉన్నసమస్య ఏంటంటే పార్టీలోకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో తమ బలం చూపించడం ద్వారా హైకమాండ్ మనసు గెల్చుకోవడం,తద్వారా తమ రాజకీయ భవిష్యతుకు మరిన్ని పెద్ద అవకాశాలు సృష్టించుకోవచ్చని ఆలోచిస్తున్నారు. ఈ దిశగా వచ్చే పంచాయతీ ఎన్నికల్లో తమ వ్యూహాలు, తమ బలంతో ఎక్కువ పంచాయతీలు గెల్చుకుని సత్తా చాటాలాని చూస్తున్నారు. ఇక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేతిలో దురదృష్టవశాత్తు శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయినా, తమ ప్రభుత్వం అధికారంలో ఉందన్న ఆనందంలో ఓడిపోయిన అభ్యర్థులు ఉన్నారు. ఆ ఆనందానికి గండి కొడతూ, తమపైన గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో పాత నేతలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఈ చేరికలు తమ రాజకీయ భవిష్యత్తును సమాధి చేస్తుందన్న ఆందోళనలో ఉన్నారు. వలస నేతలు వచ్చి పోతారని, తాము ఒరిజినల్ కాంగ్రెస్ నేతలమని, తమకు ప్రాధాన్యత లేకపోతే ఎలాగని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారంలో లేకపోయినా నమ్మి తాము ఇన్నేళ్లు కాంగ్రెస్‌లో ఉంటే ఇప్పుడు తమ భవిష్యత్తును నాశనం చేస్తారా అని పాత నేతలు అంటున్నారు. ఇలా రెండు వర్గాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పట్టు నిలుపుకునేలా, తమను నమ్ముకున్న వారికి పంచాయతీ ఎన్నికల్లో అవకాశాలు కల్పించాలన్న డిమాండ్ ను పార్టీ పెద్దల ఎదుటకు తెస్తున్నారు.తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరిన నియోజకవర్గల్లో ఒరిజినల్ కాంగ్రెస్ వర్సెస్ వలస కాంగ్రెస్ నేతలు అన్న రీతిలో చీలికలు వచ్చాయి. కొత్త నేతల రాకను, పాత నేతలు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్సెస్ ఆపార్టీ సినియర్ నేత జీవన్ రెడ్డి మధ్య తీవ్రమైన విబేధాలు ఉన్నాయి. ఇటీవలే నియోజవర్గంలో వెలసిన ఫ్లెక్సీలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జీవన్ రెడ్డి ఫోటోలు ప్రముఖంగా పెట్టి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఫోటో పెట్టకపోవడం పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ నియోజకవర్గంలోనే తాము ఒరిజినల్ కాంగ్రెస్ అని బ్యానర్లు జీవన్ రెడ్డి వర్గీయులు ఏర్పాటు చేయడం కూడా జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సంజయ్ వర్గానికి ప్రాధాన్యత ఇస్తే, తాము తిరుగుబాటు చేస్తామని జీవన్ రెడ్డి వర్గీయులు ఇప్పటికే హెచ్చరికలు పంపుతున్నారు. స్టేషన్ ఘన్పూర్ లోను వర్గ విబేధాలు చోటు చేసుకున్నాయి. వరంగల్ జిల్లాలో పట్టును విడవ కూడదని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి హస్తం గూటికి చేరిన కడియం శ్రీహరి తన పట్టును కోల్పోకూడదని భావిస్తున్నారు. ఇలా రెండు వర్గాల మధ్య పోరు నడుస్తోంది. కడియం రాకను కొండా మురళి రాజకీ అవకాశవాదంగా అభివర్ణించారు. ఇక మంత్రి కొండా సురేఖ తాను మంత్రి కావడాన్ని కడియం జీర్ణించుకోలేకపోతున్నారని బహిరంగంగానే వ్యాఖ్యానించడం సంచలం సృష్టించింది. ఇలా రెండు వర్గాలు స్టేషన్ ఘన్పూర్ లో తమ రాజకీయ బలాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పంచాయతీ ఎన్నికల్లో తమ అనుచరులకే అవకాశాలు ఇప్పించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించారు. రానున్న రోజుల్లో అంతర్గత పోరు ఎక్కడికి దారి తీస్తుందా అన్న ఆందోళనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నారు.బీఆర్ఎస్ నుంచి గెలిచిన బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హస్తం పార్టీలో చేరికతో , జెడ్పీ ఛైర్ పర్సన్ సరిత తిరుపతయ్య మధ్య వర్గ పోరు ప్రారంభమైంది. కొద్ది రోజుల క్రితం మంత్రి పొంగులేటి సమక్షంలోనే ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, సరితకు మద్దతు ఇస్తున్న నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఉద్దేశపూర్వకంగానే అధికార కార్యక్రమాలకు జెడ్పీ ఛైర్మన్ సరితను పిలవడం లేదని మల్లు రవి ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిని వ్యతిరేకిస్తూ జెడ్పీ ఛైర్మన్ సరిత వర్గం రాజకీయాలు చేస్తోంది. ఇలా రెండు వర్గాలు ఇక్కడ తయారయ్యాయి. పంచాయతీ ఎన్నికల్లో ఎవరి వర్గం వారు వారి అనుచరులకు పంచాయతీ ఎన్నికల్లో అవకాశాల కోసం ప్రయత్నాలు ప్రారంభించారుపఠాన్ చెరు నియోజవర్గం విషయానికి వస్తే ఇక్కడ మూడు వర్గాల మధ్య విబేధాలున్నాయి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నీలం మధు,కఠారి శ్రీనివాస్ గౌడ్ మధ్య మొదటి నుంచి విబేధాలున్నాయి. పార్టీ అవకాశాల కోసం ఇద్దరు ప్రయత్నిస్తున్నవారే. ఇలాంటి సందర్భంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ లో చేరడంతో పఠాన్ చెరులో ఇప్పుడు మూడు వర్గాలయ్యాయి. అయితే నీలం మధు, కఠారి శ్రీనివాస్ గౌడ్ మహిపాల్ రెడ్డి తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇక కఠారి అనుచరులు అయితే ఒక అడుగు ముందుకేసి మహిపాల్ రెడ్డి కార్యాలయంపై దాడి చేశారు. అక్కడి ఫర్నీచర్, కుర్చీలను ధ్వంసం చేశారు. ఈ మూడు వర్గాలు నియోజకవర్గంలో తమ పట్టుకోసం ప్రయత్నిస్తున్నాయి. తమ అనుచరులకే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇప్పించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మూడు వర్గాలను సయోధ్య కుదర్చడం అంత సులువేమి కాదని తెలుస్తోంది. ఒక వేళ ఇదే పరిస్థితి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఇబ్బందులు ఎదుర్కోవడం ఖాయం.భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆయన వర్గం తెల్లం వెంకట్రావుకు వ్యతిరేక వర్గంగా ఏర్పడింది. ఇరు నేతలు నియోజకవర్గ పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు.

ఇరు వర్గాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణలు చోటు చేసుకోనప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ వర్గం వారికి న్యాయం చేయాలని పార్టీ పెద్దలను డిమాండ్ చేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ కాంగ్రెస్ లో అంతకు ముందు బీజేపీ నుంచి చేరిన ఎనుగు రవీందర్ రెడ్డి మధ్య వర్గపోరు నడుస్తోంది. పోచారం ఎమ్మెల్యేగా ఉండగా, ఎనుగు రవీందర్ రెడ్డి నియోజకవర్గ ఇన్ చార్జిగా ఉన్నారు. పోచారం చేరిక సమయంలోనే ఎనుగు రవీందర్ రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు.

ల ఆ తర్వాత కూడా ఆయన పోచారం పై పలు అవినీతి ఆరోపణలు బహిరంగంగానే చేయడం జరిగింది. ఇలా రెండు వర్గాలు ఈ స్థానిస సంస్థల ఎన్నికల్లో తమ అనుచరులకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చెవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కాలే యాదయ్య కాంగ్రెస్ లో చేరడంతో అక్కడ పాత నేతలతో వర్గ పోరు మొదలైంది. అక్కడ బలమైన కాంగ్రెస్ నేతగా ఉన్న భీం భరత్ వర్గం కాలే యాదయ్య తీరును వ్యతిరేకిస్తోంది. కాలే యాదయ్య ను పార్టీలోకి తీసుకోవడం వల్ల పాత నేతలకు అన్యాయం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు.

పాత నేతలను పక్కన పెట్టి తమ అనుచరలకే కాలే యాదయ్య ప్రాధాన్యత ఇస్తున్నారని భీం భరత్ వర్గం ఆరోపిస్తుంది. వలస వచ్చిన నేతలకు కాకుండా, పార్టీని నమ్ముకున్న విధేయులకు స్థానిక సంస్థల్లో టికెట్ ఇవ్వాలని భరత్ వర్గం డిమాండ్ చేస్తుంటే, పార్టీని నమ్ముకుని వచ్చిన తమకు అన్యాయం చేయడం సరైంది కాదని ఎమ్మెల్యే వర్గం వాధిస్తోంది.ఇలా తెలంగాణ కాంగ్రెస్ లో బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో అంతర్గత పోరు నడుస్తోంది. ఇలా వర్గాల మధ్య సయోధ్య కుదర్చడం, రెండు వర్గాలకు న్యాయం జరిగేలా స్థానిక సంస్థల్లో వారు సూచించిన వారికి అవకాశాలు ఇవ్వడం కత్తిమీద సామే. ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినా మరో వర్గం నుంచి సహాయ నిరాకరణ తప్పదు. ఇది స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను దెబ్బతీసే అవకాశం ఉంది. ఎన్నికల నాటికి ఈ పరిస్థితులను ఎలా మార్చుతారన్నది అటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కు, సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ లాంటిదేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# రియల్ ఆపడం ఎవరి తరం...



**హైదరాబాద్, జూన్ 28, ( వెలుతురు)**

హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగానికి ఎప్పటికీ కొదవలేదు. ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్టులు ఊరిస్తుంటాయి. హైదరాబాద్ నగరం పెరగటమే కాని, నగరంలో రియల్ ఎస్టేట్ తగ్గిన కాలం అస్సలు లేదనే చెప్పాలి. 1990వ దశకం నుంచి ప్రారంభమయిన ఈ ఉధృతి అలాగే కొనసాగుతుంది. పాలకులు, వారి పాలసీలతో సంబంధం లేకుండా పెరిగే ఏకైక నగరం హైదరాబాద్ మాత్రమే. బెంగళూరుకు మించి హైదరాబాద్ నగరం విస్తరించింది. అందుకే మౌలిక సదుపాయాల కల్పనలో ఏ ప్రభుత్వమయినా కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తుంది. ఇక మంచి వెదర్ తో పాటు కాస్మోపాలిటన్ సిటీగా మారడం, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నగరం హైదరాబాద్ మాత్రమే.అందుకే ఏ ప్రభుత్వం వచ్చినా హైదరాబాద్ నగరం విస్తరణకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. పాలసీలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. అందరికీ తాగు నీటిని అందించేలా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక మెట్రో రైలు, ఫ్లై ఓవర్లతో ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫోర్త్ సిటీని కూడా అభివృద్ధి చేయడం ప్రారంభించింది. తాజాగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో నియో పొలిస్ మరో భారీ ప్రాజెక్టును నిర్మిస్తుంది. దీని విలువ 3,169 కోట్ల రూపాయలుగా అంచానా. దీనికి కాస్ కేడ్స్ నియోపోలిస్ పేరుతో నిర్మిస్తున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. మొత్తం ఐదు బ్లాక్ లలో ఆరు అంతస్తులను నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. మొత్తం 1,189 ఫ్లాట్లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది. చదరపు గజం పది వేల రూపాయలుగా చెబుతోంది. ఇక అదనంగా పార్కింగ్, ఇతర సదుపాయాల కోసం అదనపు మొత్తాన్ని వసూలు చేస్తారు. దీంతో పాటు ట్రంప్ సంస్థ నిర్మించే మరో భవనాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ లో ట్రంప్ టవర్ అందుబాటులోకి వస్తే నగరం రూపురేఖలే మారనున్నాయి. అత్యంత ఎత్తైన ఈ టవర్ల నిర్మాణపనులు ప్రారంభ కానున్నాయి కోకాపేట్ లో నిర్మాణమయ్యే ట్రంప్ టవర్ కూడా ఏర్పాటయితే ఇక హైదరాబాద్ అభివృద్ధిని ఎవరూ అపలేరన్నది వాస్తవం. . కోకాపేట్ లోని నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ట్రంప్ టవర్స్ ను నిర్మించనున్నారు. వీటిని ట్రిబెకా డెవలెపర్స్ నిర్మిస్తున్నట్లు ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగంలో జోరుగా ప్రచారం జరుగుతుంది. ట్రంప్ టవర్స్ అంచనా వ్యయం మూడు వేల ఐదు వందల కోట్ల రూపాయలు అని చెబుతున్నారు. మొత్తం నాలుగు వందల వరకూ లగ్జరీ ఫ్లాట్లను నిర్మించనున్నారు. ఒక్కొక్క ఫ్లాట్ ధర ఐదు కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని ప్రాథమిక అంచనా. ... ఇక మధ్యతరగతి ప్రజల కోసం కూడా అనేక అపార్ట్ మెంట్లు నగరానికి నాలుగువైపులా నిర్మాణమవుతున్నాయి. ఇటు మేడ్చల్, హయత్ నగర్, సాగర్ రోడ్డులో చాలా వరకూ నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణం చేయతలపెట్టిన ఫోర్త్ సిటీలో కూడా భూముల ధరలు పెరిగాయి. ఎంతగా అంటే ఇప్పుడు అక్కడ సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేనంతగా పెరిగిపోయాయి. అక్కడకు మెట్రో రైలు ప్రతిపాదనను కూడా ప్రభుత్వం సిద్ధం చేస్తుంది. అది పూర్తయిందంటే అక్కడ కూడా అభివృద్ధిని ఆపడం ఎవరి తరమూ కాదు. ఇటు ధనిక, అటు మధ్యతరగతి ప్రజలకు అనుగుణంగా నివాస భవనాలు రెడీ టూ ఆక్యూపైకి సిద్ధంగా ఉండటంతో హైదరాబాద్ మరో ఏడాదిలో మరో పది లక్షల జనాభా పెరుగుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# ఇక మీసేవలో ఇసుక బుకింగ్

**అదిలాబాద్, జూన్ 28, ( వెలుతురు)**



ఇసుక సరఫరా విధానంపై తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. మీసేవా కేంద్రాల్లో బుకింగ్ చేసుకునే విధానాన్ని ప్రారంభించింది. వినియోగదారులు తమకు కావాల్సిన ఇసుకను నచ్చిన స్టాక్‌యార్డ్ నుంచి బుకింగ్ చేసుకోవచ్చు.రాష్ట్ర ప్రజలకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. మీసేవలో ఇసుక బుకింగ్ చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అంటే ఇసుక అవసరం ఉన్న వాళ్లు%ఔ% నేరుగా మీసేవ కేంద్రాలను సందర్శించవచ్చు. ప్రాథమిక వివరాలతో సులభంగా బుకింగ్ చేసుకోవచ్చు.ఈ కొత్త విధానం ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చు. ప్రజలు వారి సమీపంలోని మీసేవ కేంద్రాన్ని సందర్శించారు. మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి. ఆ తర్వాత ఇతర వివరాలను ఎంట్రీ చేస్తారు. ఏ ప్రాంతానికి ఇసుక కావాలనే వివరాలను స్పష్టంగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో జిల్లా, మండలం, గ్రామం, ల్యాండ్ మార్క్ తో పాటు పిన్ కోడ్ వివరాలను నమోదు చేయాలి. వీటితో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును చెల్లిస్తే బుకింగ్ ప్రాసెస్ పూర్తవుతుంది.ఈ ఆన్ లైన్ విధానంలో తమకు కావాల్సిన ఇసుకను నచ్చిన స్టాక్‌యార్డ్ నుంచి బుకింగ్ చేసుకోవచ్చు. ఏ వెహికల్ లో కావాలంటే అందులో తెప్పించుకోవచ్చు. మీసేవా బుకింగ్ ద్వారా ఇసుక సరఫరా విధానంలో మరింత పారదర్శకత కూడాపెరిగే అవకాశం ఉంది. ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా%ఔ% ఖాజానకు ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని సర్కార్ భావిస్తోంది.

https://epaper.velthuru.com

# వెలుతురు

cinema

## తమ్ముడు చిత్రానికి ఎ సర్టిఫికెట్

టాలీవుడ్ నటుడు నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తమ్ముడు వకీల్ సాబ్ ఫేమ్ వేణు శ్రీరామ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ నటి సప్తమి గౌడ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రాన్ని జూలై 4న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు మేకర్స్. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్‌ను అందించింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ సినిమాలో లయ, స్వశిక, వర్ష బొల్లమ్మ, సౌరభ్ సచ్‌దేవా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర బ్యానర్‌పై దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు.




## హిట్ టాక్‌లో కన్నప్ప మూవీ

మంచు విష్ణు హీరోగా నటించిన కన్నప్ప సినిమా ఎట్టకేలకు నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. కొన్నిసార్లు వాయిదా పడిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి పాజిటివ్ టాక్ సంపాదించింది. సినిమా బాలేదని అనే వాళ్లు ఉన్నా సరే, ఎక్కువ శాతం మాత్రం సినిమా బాగుందని అంటున్నారు. అయితే ఈ సినిమా టీం మాత్రం ఒక ఆసక్తికరమైన పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది. నిజానికి ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రేక్షకులు కూడా థియేటర్లకు వెళ్లి చూడాలనుకుంటున్నారు. చాలామంది చూస్తున్నారు. అయితే ఏకంగా మొదటి రోజే ఇండస్ట్రీ హిట్ కన్నప్ప అంటూ పోస్టర్ రిలీజ్ చేయడంతో ఒక్క రోజులోనే ఇండస్ట్రీ హిట్ స్టేటస్ సాధించిన ఘనత ఈ సినిమాకే దక్కుతుంది అంటూ సోషల్ మీడియాలో కొందరు ట్రోల్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో అప్పటివరకు ఉన్న హిట్ సినిమా రికార్డులను ఈ సినిమా తిరగరాసి అత్యధిక కలెక్షన్లు రాబడితే దాన్ని ఇండస్ట్రీ హిట్ అని అభివర్ణిస్తారు. కానీ మంచు విష్ణు సినిమా టీం ఏమని ఆలోచించిందో తెలియదు, కానీ ఏకంగా రెండవ రోజు ఇలా రికార్డు స్థాయిలో ఇండస్ట్రీ హిట్ పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది.







## పూర్తిస్థాయి దర్శకత్వం వహించలే..

### అప్పుడు నటనను వదిలేస్తానన్న అమీర్

'సితారే జమీన్ పర్' అంటూ ప్రేక్షకుల ముందుకువచ్చి మనసులను కదిలించారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్. విమర్శకుల ప్రశంసలు అందుకుంటోన్న ఈ సినిమా విజయం తర్వాత ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తనకు నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. అలాగే దర్శకత్వం వైపు వెళ్లకపోవడానికి గల కారణాన్ని వివరించారు. ఆమిర్‌ఖాన్ దర్శకత్వం వహించిన ఏకైక సినిమా 'తారే జమీన్ పర్'. హిట్ టాక్‌ను సొంతం చేసుకొని ఆయనకు పేరు తెచ్చిన ఆ సినిమా తర్వాత ఆయన దర్శకత్వం వహించలేదు. తాజాగా ఈ విషయంపై మాట్లాడుతూ.. 'పూర్తిగా దర్శకుడిగా మారకపోవడానికి ఏకైక కారణం నటనపై నాకున్న ఇష్టమే. ఈ పరిశ్రమలో దర్శకత్వం, నిర్మాణం రెండూ చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఒకవేళ నేను దర్శకత్వం వైపు వెళ్తే నటన బోరింగ్‌గా అనిపిస్తుంది. బోర్ కొట్టిన పనిని నేను చేయలేను. కాబట్టి నటన మానేస్తాను. 'తారే జమీన్ పర్'కు కూడా అనుకోని పరిస్థితుల్లో దర్శకత్వం వహించాను. అప్పుడు నేనున్న పరిస్థితులు అలా ప్రేరేపించాయి' అని చెప్పారు. ఇక లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తాను నటించేది సూపర్ హీరో సినిమా అని ఆమిర్ తెలిపారు. 'లోకేశ్ ఎంతో ప్రతిభావంతుడు ఆయనతో కలిసి వర్క్ చేసేందుకు ఎదురుచూస్తున్నాను. ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లడానికి సమయం పడుతుంది. నేను రాజ్‌కుమార్ హిరాణీ సినిమా పూర్తిచేశాక ఇందులో నటిస్తాను. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో దీన్ని ప్రారంభించే అవకాశాలున్నాయి' అని చెప్పారు. ఇక ఆమిర్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సితారే జమీన్ పర్' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము కూడా దీన్ని వీక్షించి ప్రశంసించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆమె కోసం ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. మానసిక దివ్యాంగులు తమకున్న సమస్యను అధిగమించి ఎలాంటి విజయాన్ని అందుకున్నారన్నది ఇందులో హృద్యంగా చూపించారు.

## విజ్జూ..నిన్ను గర్వపడేలా చేస్తా

### మైసాపై నటి రష్మిక ఆసక్తిక పోస్ట్

విజయ్ దేవరకొండతో రష్మిక డేటింగ్ అంటూ కొన్నేళ్లుగా రూమర్లు వస్తున్నా వీరు మాత్రం స్పందించట్లేదు. ఎప్పటికప్పుడు అడ్డంగా దొరికిపోతూనే ఉన్నారు. తాజాగా రష్మిక చేసిన పోస్టు వీరిద్దరి డేటింగ్ ను కన్ఫర్మ్ చేసేలా ఉంది. రష్మిక తన మైసా సినిమాను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీకి స్టార్ హీరోలు విషెస్ చెబుతున్నారు. తాజాగా విజయ్ దేవరకొండ కూడా ఆమెకు కంగ్రాట్స్ చెబుతూ విషెస్ చెప్పారు. ఇది అద్భుతంగా ఉంటుంది అని ఇన్ స్టా స్టోరీలో పోస్ట్ చేశాడు. దానికి రష్మిక విజయ్ దేవరకొండను ఉద్దేశిస్తూ రిప్లై ఇచ్చింది. 'విజ్జూ ఈ సినిమాతో నిన్ను గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నా' అంటూ లవ్ ఎమోజీతో రిప్లై ఇచ్చింది. ఆమె చేసిన ఈ పోస్టు కాస్త వైరల్ అవుతోంది. విజయ్ దేవరకొండను విజ్జూ అంటూ పిలవడం అందరికీ ఆశ్చర్యంగా అనిపిస్తోంది. ఆమె పోస్టు చూసిన వారందరికీ.. ఆమె విజయ్ ను లవ్ చేస్తోందని కన్ఫర్మ్ చేసినట్టే అంటున్నారు. విజయ్ గర్వపడేలా చేయాల్సిన అవసరం ఆమెకు ఏముంది. వీరిద్దరి మధ్య ఏదో ఉంటేనే కదా ఇలాంటి రిప్లై ఇస్తుంది అని అంటున్నారు. ఏదేమైనా రష్మిక, విజయ్ తమ రిలేషన్ ను ప్రకటించకుండా.. చేయాల్సినవన్నీ చేసేస్తున్నారు. ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇలాంటి టైమ్ లో లేడీ ఓరియెంటెడ్ సినిమాను చేయడం అందరికీ ఆశ్చర్యంగా అనిపిస్తోంది. ఈ సినిమాలో వయోలెంటిక్ పాత్రలో రష్మిక నటిస్తున్నట్టు తెలుస్తోంది.



## డిమాండ్ పెంచేసిన శ్రీలీల

పెళ్లి సందడిసినిమాతో తెలుగు సినీ పరిశ్రమకు పరిచయమైన శ్రీలీల ఆ తర్వాత మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం పడలేదు. ఎందుకంటే ఆమెకు వరుస సినీ అవకాశాలు అలా వచ్చి పడ్డాయి. నిజానికి ఆమెకు ఎన్ని హిట్ సినిమాలు ఉన్నాయో అన్ని ఎ÷-లాప్ సినిమాలు కూడా ఉన్నాయి. కానీ ఆమె డిమాండ్ మాత్రం తగ్గడం లేదు, సరికదా ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఇప్పటికే ఆమె రెమ్యూనరేషన్ చాలాసార్లు పెంచింది. తాజాగా బాలీవుడ్ ఆఫర్లు వస్తున్నందున ఆమె ఇప్పుడు మరోసారి రెమ్యూనరేషన్ పెంచినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం మేరకు శ్రీలీల ఏకంగా ఏడు కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగు సినిమా హీరోయిన్‌కి రెమ్యూనరేషన్ అంటే చాలా పెద్ద అమౌంట్ అని చెప్పాలి. అయితే బాలీవుడ్ నిర్మాతలు శ్రీలీలకు ఆ మొత్తం ఇవ్వడానికి ఏమాత్రం వెనకాడడం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె రెమ్యూనరేషన్ భారీగా పెంచింది. అయితే ఆమెకు 7 కోట్లు ఇవ్వడానికి తెలుగు నిర్మాతలు ప్రస్తుతానికి సిద్ధంగా లేరు. అందుతున్న సమాచారం మేరకు ఆమె ఇప్పటివరకు రెండున్నర కోట్లు ఒక్కో తెలుగు సినిమాకి తీసుకునేది. పుష్ప సినిమాలో ఐటమ్ సాంగ్ కోసం మూడు కోట్లు తీసుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో అవకాశాలు రావడం మొదలుపెట్టాయి కదా అని, డబ్బులు డిమాండ్ చేసి ఏకంగా ఏడు కోట్లు అడుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవిధంగా అఖిల్ అక్కినేని లెనిన్ సినిమా నుంచి బయటకు వెళ్లిపోవడానికి కూడా ప్రధాన కారణం ఇదే అని అంటున్నారు.




## హరిహరవీరమల్లు ఆలస్యం..అభిమానుల్లో అసహనం



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం పై అభిమానులు ఏ స్థాయిలో ఆశలు పెట్టుకున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆ అంచనాలకు మేకర్స్ అనుగుణంగా స్పందించకపోవడంపై అభిమానుల్లో అసంతృప్తి పెరిగిపోతోంది. ఇప్పటికే చాలా కాలం క్రితమే షూటింగ్ పూర్తి అయినప్పటికీ, చిత్ర బృందం నుంచి సరైన అప్డేట్స్ లేకపోవడం అభిమానులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ వారం ట్రైలర్‌కు సంబంధించి అప్డేట్ వస్తుందని ప్రకటించినప్పటికీ, అది ఇప్పటివరకు విడుదల కాలేదు. వారం ముగియబోతున్నా కూడా కనీసం ఒక టీజర్, పోస్టర్, గ్లింప్స్ లాంటి ఏదైనా చిన్న హింట్ ఇవ్వకుండా, పూర్తిగా నిశ్శబ్దంగా ఉండిపోవడం వలన ఫ్యాన్స్ నిరాశకు లోనవుతు న్నారు. దీంతొ చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా కూడా ప్రమోషన్ పరంగా ఏమీ చేయకపోవడాన్ని అభిమానులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సినిమా రిలీజ్‌ను మళ్లీ మళ్లీ వాయిదా వేయడమే కాదు, ఇప్పుడు ట్రైలర్ అప్డేట్స్ విషయంలో కూడా అజాగ్రత్తగా వ్యవహరించడం అభిమానులకు నిజమైన 'వర్స్ట్ ఎక్స్‌పీరియన్స్'గా మారుతోంది. ఇప్పటికే సినిమా ఎన్నోసారి వాయిదా పడింది. పవన్ కళ్యాణ్ షూటింగ్ పూర్తి చేసినప్పటికీ సినిమా విడుదలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం, దానికి తోడు తాజా ట్రైలర్ అప్డేట్ విషయంలోనూ స్పష్టత లేకుండా మేకర్స్ వ్యవహరించడం వల్ల ఫ్యాన్స్ ఆగ్రహంగా ఉన్నారు. మొత్తంగా చూస్తే, 'హరిహర వీరమల్లు'పై ఉన్న హైప్‌ను సద్వినియోగం చేసుకోవడంలో చిత్రబృందం పూర్తిగా విఫలమైందని చెప్పాలి. ఎంత భారీ బ్జడెట్, స్టార్ కాస్ట్ ఉన్నా.. ఇలా అప్డేట్‌లు లేకుండా డిజప్పాయింట్ చేయడం అభిమానులకు నిజంగా బాధ కలిగించే విషయం.

వెలుతురు
రాష్ట్రీయం । జాతీయం
https://epaper.velthuru.com
ఆదివారం 29 జూన్ 2025

## పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వామి
# ప్రదీప్తానందపై దుమారం

**- తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఓ మహిళ ఫిర్యాదు**



**కోల్‌కతా,జూన్28( వెలుతురు):**
పద్మ శ్రీ అవార్డు గ్రహీత స్వామి ప్రదీప్తానందపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ మహిళ సంచలన ఆరోపణలు చేసింది. కార్తీక్ మహారాజ్ గా ప్రసిద్ధి చెందిన స్వామి ప్రదీప్తానంద తనపై పలుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపించింది. తనకు పాఠశాలలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 2013 నుంచి పలుమార్లు తనపై కార్తీక్ మహారాజ్ అత్యాచారం చేశాడని వెల్లడించింది. ఈ ఏడాది కేంద్రం బహూకరించిన పద్మశ్రీ అవార్డు గ్రహీతలలో మహారాజ్ ఒకరు. ఆయనపై ఇలాంటి ఆరోపణలు రావడం సంచలనంగా మారింది. పశ్చిమబెంగాల్ లోని ముర్షిదాబాద్ జిల్లాలోని భారత్ సేవాశ్రమ్ సంఘ బెల్డంగా యూనిట్ బాధ్యతలను కార్తీక్ మహారాజ్ నిర్వర్తిస్తున్నారు. ఆయనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆశ్రమంలోని పాఠశాలల్లో ఒకటైన చాణక్ ఆదివాసీ అబాసిక్ బాలికా విద్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని మహారాజ్ హామీ ఇచ్చారని, 2013 జనవరిలో తనకు పాఠశాల హాస్టల్‌లో వసతి కూడా కల్పించారని పేర్కొంది. త్వరలోనే ఉద్యోగం కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చి తనపై లైంగిక దాడులకు పాల్పడ్డారని ఆరోపించింది. ప్రతిరోజు తనను ఆశ్రమం ఆవరణలో ఉన్న బిల్డింగ్ ఐదో అంతస్థులోకి తీసుకెళ్లి అత్యాచారం చేసేవాడని ఫిర్యాదులో పేర్కొంది. లైంగిక దాడి కారణంగా 2013లోనే తాను గర్భవతి నయ్యానని, పాఠశాల సిబ్బందితో కలిసి కార్తీక్ మహారాజ్ తనను ఓ నర్సింగ్ హోమ్‌కు తీసుకెళ్లి బలవంతంగా గర్భస్రావం చేయించాడని బాధితురాలు తెలిపింది. ఆ తర్వాత తనను ఉద్యోగంలోకి తీసుకోకుండా బయటకు పంపేశారని తెలిపింది. ఆ తర్వాత ఆశ్రమం నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చి తనను ఓ వాహనంలో ఎక్కించుకుని బెదిరించారని, మళ్లీ కార్తీక్ మహారాజ్‌తో మాట్లాడే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారని బాధితురాలు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసింది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కాగా, బాధితురాలు చేసిన ఆరోపణలను కార్తీక్ మహారాజ్ ఖండించారు. ఇది తన పేరును, కీర్తిని కించపరచడానికి జరిగిన కుట్ర అని, కాలం అన్నింటికీ సమాధానం చెబుతుందని అన్నారు. తమ ఆశ్రమంలో ఎంతో మంది మహిళలు ఉన్నారని, వారందరినీ తాము తల్లులుగానే భావించి గౌరవిస్తామని పేర్కొన్నారు.

## కోల్‌కతా ఘటనలో సెక్యూరిటీ గార్డు అరెస్ట్

**- ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు**



**కోల్‌కతా,జూన్28( వెలుతురు):**
దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న దక్షిణ కోల్‌కతా లా కాలేజీ సామూహిక అత్యాచార ఘటనలో పోలీసులు తాజాగా సెక్యూరిటీ గార్డును అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ముగ్గురని అరెస్ట్ చేశారు. అంతకుమునుపు, ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు వర్గాల కథనం ప్రకారం, విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన సమయంలో సెక్యూరిటీ గార్డు ఆ పరిసరాల్లోనే ఉన్నాడు. నిందితుడి సూచనల మేరకు అతడు గార్డు రూమ్‌లో బాధితురాలిని ఒంటరిగా వదిలి వెళ్లిపోయాడు. సహాయం కోసం ఆమె పలుమార్లు వేడుకున్నా అతడు జోక్యం చేసుకోలేదు. ఈ ఘటన గురించి కాలేజీ అధికారులకు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయడం సెక్యూరిటీ గార్డు బాధ్యత. కానీ అతడు ఇవేవీ చేయలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన విషయం సెక్యూరిటీ గార్డును ప్రశ్నించినప్పుడు స్పష్టమైందని అన్నారు. ఈ నేపథ్యంలో అతడిని అరెస్టు చేసినట్టు తెలుస్తోంది. జూన్ 25న సెక్యూరిటీ గార్డు గదిలో నిందితురాలిపై కొన్ని గంటల పాటు లైంగిక దాడి జరిగింది. కాలేజీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర పరిషత్ విభాగం మాజీ ప్రెసిడెంట్ మోనోజిత్ మిశ్రా ఈ దారుణానికి పాల్పడగా మిగతా ఇద్దరు అతడికి సహకరించారు. శుక్రవారం ఈ ఘటన వెలుగులోకి రావడంతో కలకలం రేగింది. కాలేజీ మెయిన్ గేట్‌ను లాక్ చేశాక, సెక్యూరిటీ గార్డును గది బయట కూర్చోబెట్టి తనపై దారుణానికి ఒడిగట్టారని బాధితురాలు పేర్కొన్నారు. సెక్యూరిటీ గార్డు అక్కడే ఉన్నా సాయం చేయలేదని తెలిపారు. ప్రధాన నిందితుడైన మోనోజిత్ మిశ్రాను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సహ నిందితులు జైబ్ అహ్మద్ (19), ప్రమిత్ ముఖర్జీని పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

# బక్కన్నపాలెంలో నీటి సరఫరా నిలిపివేతపై ఆందోళన



**విశాఖపట్టణం,జూన్28( వెలుతురు):**
బక్కన్న పాలెం జివిఎంసి పరిధిలో తాగునీరును నిలిపివేశారు. జివిఎమ్‌సి చరిత్రలో మంచినీటి సరఫరా ఆగిపోవడం ఇదే తొలిసారి అని పలు కాలనీల ప్రజలు అన్నారు. 3 లక్షల ఇంటి కుళాయిలకు మంచినీటి సరఫరా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బక్కన్న పాలెంలో ఖాళీ బిందెలతో మహిళలు ధర్నాచేశారు. తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని మహిళలు చెప్పారు. మరోసారి మేయర్ తో చర్చలకు వాటర్ సప్లై ఉద్యోగులు వెళ్లనున్నారని తెలిపారు. చర్చలు సఫలం అయితేనే.. వాటర్ సప్లై ఉద్యోగులు నీటిని విడుదల చేస్తామంటున్నారని మహిళలు స్పష్టం చేశారు.

# స్వేచ్ఛ బలవన్మరణంపై పోలీసుల దర్యాప్తు

**- పూర్ణచందర్ రావు కారణమని తండ్రి ఫిర్యాదు**



**హైదరాబాద్,జూన్28( వెలుతురు):**
తన కూతురు స్వేచ్ఛ వోటార్కర్ ఆత్మహత్యకు పూర్ణచందర్ రావు అనే వ్యక్తి కారణమని ఆమె తండ్రి తెలిపారు. భర్తతో విడిపోయాక పూర్ణచందర్ రావుతో స్వేచ్ఛ ఉంటున్నారన్నారు. స్వేచ్ఛ, పూర్ణచంద్రరావు మధ్య కొన్నాళ్లుగా విబేధాలు ఉన్నాయని, స్వేచ్ఛను పెళ్లి చేసుకుంటానని పూర్ణచంద్రరావు మాట ఇచ్చి ఆమెతో సహజీవనం చేశాడని పేర్కొన్నారు. పెళ్లి చేసుకోవాలని స్వేచ్ఛ ఒత్తిడి చేయడంతో కాలయాపన చేస్తూ అతడు వచ్చాడని, ఈ విషయంలోనే తన కూతురు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందన్నారు. తన కూతురు ఆత్మహత్యకు కారణమైన పూర్ణచంద్రరావును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పూర్ణచంద్రర్ రావు ఓ న్యూస్ చానల్ పని చేసేవాడని తండ్రి తెలిపారు. గతంలో పూర్ణచందర్ రావుతో విభేదాలు రావడంతో విడిపోతామని పలుమార్లు తన కూతురు చెప్పిందని వాపోయాడు. చిక్కడ పల్లిలో జవహర్ నగర్ లో ప్రముఖ తెలుగు న్యూస్ ఛానల్ యాంకర్ స్వేచ్ఛ వోటార్కర్(40) ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తెలుగు న్యూస్ ఛానల్ యాంకర్ గా పనిచేస్తున్న స్వేచ్ఛ ఆత్మహత్య చేసుకుంది. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనీ జవహర్ నగర్ లో తాను నివసిస్తున్న ఇంటిలోనే శుక్రవారం రాత్రి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్వేచ్ఛ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులు శంకర్, శ్రీదేవిలతో కలిసి కొన్నిరోజుల క్రితం వరకు రాంనగర్ లోని ఒక ఇంట్లో ఉన్న స్వేచ్ఛ ఇటీవలే జవహర్ నగర్ లోని ఇంటికి మారింది. చిక్కడపల్లి ఏసిపి రమేష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ ఘటనా స్థలాన్ని సందర్శించి స్వేచ్ఛ ఆత్మహత్యకు దారితీసిన కారణాలను అన్వేషిస్తున్నారు. ఐదేళ్ల క్రితం భర్తతో విడాకులు తీసుకున్న ఆమె.. కూతురు, మరో స్నేహితుడితో కలిసి ఉంటున్నారని సమాచారం. అతనితో వచ్చిన మనస్పర్థల కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. తండ్రి శంకర్ ఉమ్మడి ఏపీలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేయగా.. తల్లి శ్రీదేవి చైతన్య మహిళా సంఘంలో పనిచేస్తున్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో స్వేచ్ఛ ఈసీ మెంబర్‌గా ఎన్నికయ్యారు.

# ఉద్దానం పేజ్ -2 మంచినీటి పథకానికి శంకుస్థాపన

**- ప్రజలకు సేవ చేయడమే కటూమి లక్ష్యం**

**- కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం,జూన్28( వెలుతురు):**
ప్రభుత్వాన్ని ఎదిరిస్తే ప్రభుత్వ పథకాలు కట్ చేయడం వంటి సంస్కృతి మా కూటమి ప్రభుత్వానికి లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన ఆయన.. పాతపట్నంలో 265 కోట్ల రూపాయలతో చేపట్టనున్న ఉద్దానం పేజ్ -2 మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు.. పాతపట్నం నియోజకవర్గంలోని బూరగాం గ్రామంలో 265 కోట్ల రూపాయలతో ఉద్దానం పేజ్ -2 మంచినీటి పథకం





ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లాగా ఇసుక మాఫియా, భూధందాలు, లిక్కర్ మీద సొమ్ము చేసుకోవడం లేదన్నారు.. ప్రభుత్వాన్ని ఎదిరిస్తే ప్రభుత్వ పథకాలు కట్ చేయడం వంటి సంస్కృతి కూడా మా కూటమి ప్రభుత్వానిది కాదన్నారు.. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు స్వాతంత్రం వచ్చేటట్లుగా స్వేచ్ఛగా ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని పేర్కొన్నారు.. ప్రజలు ఎవరైనా సమస్యలు పరిష్కరించుకుంటే మమ్మల్ని అక్కడికక్కడే నిలదీస్తే మేం వారిపై ఎటువంటి అధికార జులుం ప్రదర్శించకుండా.. సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు. మరోవైపు, శ్రీకాకుళం జిల్లాలో ఇండియా టర్న్స్ పింక్ సంస్థ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అ÷ూఖీ ద్వారా మహిళలకు ఉచిత బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు.. ఈ కార్యక్రమం ద్వారా శ్రీకాకుళం జిల్లాలోని 10,000 మంది గ్రామీణ మహిళలకు ఉచితంగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం మహిళలో అవగాహన పెంపొందించి క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం, తద్వారా జీవితాలను రక్షించడం అన్నారు.. ఈ కార్యక్రమంలో నాతో పాటు ౦౦ఎ చైర్మన్ విపిన్ కుమార్, ఊఖీ సభ్యులు శ్రీనివాస్, ఇండియా టర్న్స్ పింక్ అధికారులు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్ ,బగ్గ రమణ మూర్తి పాల్గొన్నారు. గ్రామీణ సమాజాలలోని మహిళలకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ మరియు ముందస్తు రోగ నిర్ధారణ సేవలను అందించేందుకు మేం కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

# పూరి రథయాత్రలో తొక్కిసలాట

- **వందలాది మందికి తీవ్ర గాయాలు**
- **వివిధ ఆస్పత్రుల్లో వారికిచికిత్స**



**భువనేశ్వర్,జూన్28( వెలుతురు):**
ఒడిశాలోని పూరి జగన్నాథ ఆలయంలో రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 625 మంది గాయపడ్డారు. స్థానిక మీడియా కథనం ప్రకారం చాలా మంది పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిలో మహిళలు, పిల్లలుఎక్కువ మంది ఉన్నారు. వీరంతా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో జర్నలిస్టులు కూడా ఉన్నారని వార్తలొస్తున్నాయి. రథయాత్రను లాగుతున్న తాళ్లను పట్టుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో ముందుకు రావడం వల్ల తొక్కిసలాట జరిగి ఒకరిపై ఒకరు పడిపోయారని మీడియా పేర్కొంది. ÷-షతగాత్రులలో దాదాపు 70 మంది పూరి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన వారు స్థానిక ఆసుప్రతుల్లో చికిత్స తీసుకుంటున్నారు. బాలగండి ప్రాంతానికి సమీపంలో జరిగిన రథయాత్రలో అనేక మంది గాయపడ్డారని వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ స్పందించారు. గాయపడిన వారికి చికిత్స అందించే విధంగా ఏర్పాట్ల చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# ఓటర్ల జాబితా రూపొందించడంలో సహకరించండి..

**- అర్హులైన యువ ఓటర్ల నమోదు దిశగా ప్రోత్సహించండి..**

**- డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం**

**విజయవాడ,జూన్28( వెలుతురు):**
దోషరహిత, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడంలో రాజకీయ పక్షాలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అర్హులైన యువ ఓటర్లను నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లోని ఎవిఎస్ఎన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌వో లక్ష్మీనరసింహం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈసీఐ ఆదేశాల మేరకు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పక్షాలు బూత్ లెవెల్ అధికారులతో బూత్ లెవెల్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకొని అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు సహకరించాల్సిందిగా కోరారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలో మరణించినా, శాశ్వతంగా వలస వెళ్లినా వారి పేర్లను బీఎల్‌వోకు తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, ఓటరు కార్డులో ఏవైనా తప్పులు ఉంటే వాటికి సంబంధించి ఫారం-8 నమోదు చేసి, సరిచేసేందుకు సహకరించాల్సిందిగా కోరారు. జిల్లాలో ఫారం 6, ఫారం 7, ఫారం 8 అర్జీలకు సంబంధించిన ప్రస్తుత వివరాలను తెలియజేసి సమాచారాన్ని రాజకీయ పక్షాలకు అందించారు. సమావేశంలో రాజకీయ



పక్షాల ప్రతినిధుల సందేహాలను డీఆర్‌వో నివృత్తి చేశారు. మరణించిన ఓటర్ల తొలగింపు పై అన్ని స్థాయిలలోను విచారణ చేయాలని, ఒకే కుంటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా, ఒకే డోర్ నెంబర్‌తో నమోదై ఉన్న నగరపాలక సంస్థ పరిధిలో అపార్టమెంట్ విషయంలోను ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రాజకీయ పక్షాల ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎన్నికల సెల్ డిప్యూటీ తహశీల్దార్ ఎవిఆర్ గోపాలరెడ్డి, వై రామయ్య (టిడిపి), తరుణ్ కాకాని (బీజేపీ), బి. పుష్పరాజ్ (బిఎస్‌పి) బొర్రా కిరణ్ (ఐఎన్‌సి), ఎస్.అనిల్‌చంద్ (ఐఎన్‌సి) పాల్గొన్నారు.



## అన్నపూర్ణ క్యాంటీన్ పేరు
# ఎలా మారుస్తారు?

**- జిహెచ్ఎంసి ముందు బిఆర్ఎస్ నేతల ధర్నా**

**- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కార్పోరేటర్లు**

**హైదరాబాద్,జూన్28( వెలుతురు):**
అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్పుపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. శనివారం ఉదయం జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద గులాబీ పార్టీ కార్పొరేటర్లు ధర్నాకు దిగారు. 5 రూపాయలకే పేదల కడుపు నింపే అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చాలనే స్టాండింగ్ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అన్నపూర్ణ క్యాంటీన్లను ఇందిరా క్యాంటీన్లుగా పేరు మార్చే కుట్రను అడ్డుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. అయితే బీఆర్ఎస్ కార్యకర్తలను గేటు బయటే పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బల్దియా ప్రధాన కార్యాలయం ముందు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జీహెచ్ఎంసీ కార్యాలయంలోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతలు యత్నించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ జంట నగరాలకు ఎంతో మంది వస్తుంటారని.. అలాంటి వారికి కడుపునిండా అన్నం పెట్టాలని అన్నపూర్ణ క్యాంటీన్ల పథకం కేసీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నపూర్ణ పేరు మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్లు తెలిసిందన్నారు. పేరు మార్చాలని ఉద్దేశం ఉంటే జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు నిర్ణయం తీసుకోవాలని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ప్రజలకు ఇచ్చిందన్నారు. 'ఆరు గ్యారెంటీలకు నచ్చిన పేరు పెట్టుకోండి.. మాకు అభ్యంతరం లేదు. అన్నపూర్ణ పేరు మార్పు మంచి పద్ధతి కాదు' అని మండిపడ్డారు. ఆరోగ్య శ్రీ తెచ్చిన రాజశేఖర్ రెడ్డి పేరే తాము కొనసాగించడం జరిగిందన్నారు. అన్నపూర్ణ అనగానే అమ్మవారు గుర్తుకు వస్తారని.. అన్నపూర్ణ పేరు మార్చాలని ప్రభుత్వానికి ఉద్దేశం ఉంటే కౌన్సిల్ సమావేశంలో చర్చ పెట్టి, ఓటింగ్ పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం పీజేఆర్ ఫ్లై ఓవర్ ఓపెన్ చేస్తున్నారని.. మరి అది కట్టింది ఎవరని ప్రశ్నించారు. తిమ్మిని బొమ్మను చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే అని విమర్శించారు. పేరు మార్పు వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com